ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక



"పాతాళ హ్రదము"


(అమెరికా నైసర్గిక విహారస్థల ఆరామములలోనిది)

6-4-49 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు





రాష్ట్రశాసనసభల కాంగ్రెస్ పక్షానికి నూతన నాయకుడు కుమారస్వామిరాజాగారు; ప్రత్యర్థి డా॥ సుబ్బరాయన్‌గారు; ఎన్నిక ఫలితాన్ని ప్రకటించగానే తీసిన చిత్రం



అమెరికాలో ఇంజనీరింగ్ విధానాలను పరిశీలింప వెడలిన ఇండియన్ హైవే ఇంజనీయర్లు, పారిశ్రామిక వేత్తలు. వాషింగ్టన్‌లోని ఇంజనీరింగ్ పరిశోధక కర్మాగారాలను సందర్శించినప్పటి చిత్రాలు.




బ్రిటిష్ పార్లమెంటులో ప్రతికూలపక్ష ఉపనాయకుడు ఆంథొనీ ఈడెన్, గత నెల 22-న న్యూఢిల్లీలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ వరల్డ్ అఫెయిర్సువారి ఆధ్వర్యమున జరిగిన సభలో ఉపన్యసించినప్పటి దృశ్యం.

వార్తా చిత్రాలు



క్రిందటినెల 27 తేదీన నేషనల్ మెడికల్ సంఘంవారి వార్షికోత్సవము శ్రీ అనంతశయనం అయ్యంగారి అధ్యక్షతను జరిగినపుడు వారు ఉపన్యసించుచున్న చిత్రము.



గవర్నర్ భావనగర్ మహారాజా గత మాసం గుడివాడ వెళ్లినప్పుడు గౌరీశంకర్ సినిమాహాలులో స్థానిక పురపాలక సంఘం సన్మానమిచ్చినప్పటి దృశ్యం.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర ! యప్రియము తన మనంబున కగు దా


నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్.(మహాభారతము)

సంపుటము 41

సంచిక 29


Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర చైత్ర శుద్ధ అష్టమి బుధవారము



కాలిఫోర్నియా నేషనల్‌పార్కు

ఇక్కడ సహజనైసర్గికపరిసరాలు అవలంబనగా జంతుప్రదర్శనశాలలు నిర్మిస్తారు. జింకలు కొండలు వాగులవద్ద తిరగడానికి వీలుగా ఈ పార్కు ఏర్పాటు అయింది.



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ ఏప్రిల్ నెల 6-వ తేది బుధవారము

కొత్తనాయకుని ఎన్నిక

మద్రాసు శాసనసభా కాంగ్రెసు పక్షనాయకుని ఎన్నిక కోలాహలములో శ్రీ కుమారస్వామిరాజాగారి ఎన్నికకన్న వారి అభ్యర్థిత్వమే ఎక్కువ ఆశ్చర్యము కలుగజేసినది. నాయకత్వపోటీనుండి, శ్రీ భక్తవత్సలము, శ్రీ రామస్వామి రెడ్డిగార్లు ఎపుడైతే ఉపసంహరించుకొని శ్రీ కుమారస్వామిరాజాగారి పేరు రంగములోకి వచ్చినదో అపుడే శ్రీ రాజాగారి ఎన్నిక రూఢి అని తేలిపోయినది. కొంతమందికి శ్రీ రాజాగారి అభ్యర్థిత్వము ఆకస్మికము కాదు. అందువల్ల ఆశ్చర్యమూ కాదు. ఆఖరు క్షణమున ఆయన నిలబడుట జరుగు నని జోస్యము చెప్పుచునే యుండిరి. కాని, పైకి కనబడుచున్న వ్యవహారముల గతిని పురస్కరించుకొని శ్రీ కుమారస్వామి రాజాగారు రంగమున ప్రవేశించెద రనునది సాధ్యముగను, స్వాభావికముగను కనుపడలేదు.

శ్రీ రెడ్డిగారి ఉపసంహరణ కూడ ఆశ్చర్యమును కలిగించినది. ఏకీభావము కుదురకపోవుట ఉపసంహరణకు కారణమని వారు తెలుపుట అంతగ నచ్చలేదు. పార్టీయందు వర్గము లున్నవని వారి కదివరకే తెలియును. వాస్తవమునకు ఆ వర్గముల మూలముననే శ్రీ రెడ్డిగారు మొదట, తరువాతకూడ ఎన్నిక అవుట జరిగినది.

ఒక విలేఖరి ఆ అంశమును వారి దృష్టికి తేగా అప్పటి పరిస్థితికి ఇప్పటి పరిస్థితికి భేద మున్న దని వా రనిరి. ఆ భేద మేమో వారు తెలుపలేదు. గత మంగళవారమునాడు సాయంకాలము వారు పార్టీసభయందు చేసిన ప్రకటన వల్ల అన్ని వర్గములు ఏకమవునని వారు తలచిన అది వట్టి భ్రమ. తమ పరిపాలన అన్ని వర్గములను ఏకీకరణ మొనర్చునంత బాగుగ నున్న దని వారు తలచిరేమో తెలియదు. కాని వారికి తమ సహచరులతోనే చివరికి పొసగలేదు.

రెడ్డిగారు ఉపసంహరించుటకు కారణము పార్టీలో ఐకమత్యము లేదని కాదు. పార్టీలోని కక్షలే అందుకు మూలము. అంతే కాని "తురుపుముక్కను చివరివరకు దాచియుంచుట కాదు."

భక్తవత్సలము, సుబ్బరాయనుగారిద్దరూ పోటీచేసిన, ఇదివరకు తమ అభిమానులైనవారి ఓట్లు చెడి, తనూ భక్తవత్సలముగారు గాక, సుబ్బరాయనుగారు ఎన్నిక కావచ్చు నను ఊహతో ఉపసంహరించుకొని రని చెప్పవలసియున్నది. శ్రీ ప్రకాశంగారు బలపరచిన సుబ్బరాయనుగారు ఓడిపోవుట, తాను విజయ మందుట ముఖ్యమని భావించెను. కుమారస్వామి రాజాగారు పోటీచేయుదు రని తెలియుటతోనే అదివరదాకా ప్రకాశంగారి సలహా ననుసరించి సుబ్బరాయన్‌గారిని బలపరచదలచిన తెలుగుసభ్యులుకూడ అనేకమంది రాజాగారికి సుముఖులైరి.

నాయకుడుగా ఎన్నికయినందుకు శ్రీ కుమారస్వామి రాజాగారు అభినందనార్హులు. ఎన్నికయిన వెంటనే "రాష్ట్రములోని విచిత్ర పరిస్థితులే నా ఎన్నికకు" కారణమని అనుటవల్ల వారి వాస్తవికదృష్టి, సౌజన్యమూ వెల్లడి అవుచున్నవి. పార్టీలోని విభేదములు సమసిపోవుటకుగాను అన్ని వర్గములతోనూ మంత్రివర్గమును నిర్మించ ప్రయత్నించుట అభినందింపదగినది. 1946 సం॥ లో ప్రకాశంగారు తమకు వ్యతిరేకులైనవారిని మంత్రివర్గములోనికి తీసికొననికారణముననే పార్టీలో విభేదములు అధికమైనవి. తరువాత రామస్వామి రెడ్డిగారుకూడా రెండు పర్యాయములు అదేపంథాను త్రొక్కిరి. శ్రీ కుమారస్వామి రాజాగారు కనుక సమాధానమార్గమును త్రొక్కిన రాష్ట్రమునకు శాశ్వతోపకారము చేసినవా రవుదురు. వారు ఆహ్వానించిన పక్షములో మంత్రిపదవిని అంగీకరించకపోయినవారిది తప్పు కాగలదు. ఆహ్వానించని పక్షమున శ్రీ రాజాగారి చర్య విమర్శనార్హ మవును.

ఈ సందర్భమున ఒప్పందము కుదిరినట్లే తెలియవచ్చినది. అది కుదిరిన మీదటనే శ్రీ నాడారుగారు ఢిల్లీకి వెళ్లిరి. కాని ఢిల్లీయందు సంప్రతింపులు విఫలమైనట్లు వినవచ్చినది. అక్కడున్న వారికి కొందరికి ప్రత్యర్థులతో సమాధానపడుట కిష్టపడలేదట. బయట ఉన్న పోరుపులు మంత్రివర్గములో కూడ బయలుదేరునని వా రభిప్రాయపడినట్లు తెలిసినది. ఈ వైఖరి కేవలము గర్హణీయ మనుటకు సందేహము లేదు. అన్ని వర్గములతో కూడిన మంత్రి వర్గ ఏర్పాటుకు ప్రాతికూల్యము చూపినది మంత్రి వర్గ అనుకూలురైన ఆంధ్రసభ్యు లనే తెలియవచ్చినది. తమ ప్రాతికూల్యమునకు వారు చెప్పిన కారణములు నచ్చజాలవు. వీధినిబడి కొట్టుకొనుటకంటె మంత్రివర్గములో చర్చించుకొని ఏదో విధమైన ఏర్పాటుకు వచ్చుట ఉచితము కాదా? ఎవరు అమలు పరచినను కాంగ్రెస్ కార్యక్రమము తప్ప ఇతరము కాదు కదా? అన్యపక్షముల ప్రతినిధులను తీసికొనవలసి వచ్చిన ఏకాభిప్రాయము కుదరదేమో నని సందేహించవచ్చును గాని, స్వపక్షములోని సభ్యులను తీసికొనుటకు సందేహించుట ఆత్మశుద్ధికి నిదర్శనము కాదు.

ఆంధ్రరాష్ట్రము రానున్నప్పుడు ఆంధ్రసభ్యులందు ఈ విభేదము లుండుట శోచనీయము. భారత ప్రభుత్వ ఆర్డరుతో ఆంధ్రరాష్ట్ర మేర్పడినప్పుడు క్రొత్త ఎన్నికలు జరుగువరకు ఇపుడున్న మంత్రులే అధికారమున ఉండవలసివచ్చును. అక్కడికికూడ ప్రస్తుత విభేదములు మోసికొని వెళ్లదలచిన తప్ప ప్రస్తుతము సమాధానముపడుటకు విముఖత చూపుటలో అర్థము లేదు.

అన్నమాచార్యుల వర్ధంతి

తెలుగు కవులలో సంగీత సాహిత్యముల రెంటియందును ప్రజ్ఞ కలిగి కించిదధికముగ సంగీతవిద్యయందు సహజప్రతిభ కలవారు సంకీర్తనకవులుగను, పదకవితల నభిమానించిన వారుగనే కాసాగిరి. తాళ్ళపాకవంశీకులలో అన్నమయ, చిన్నన్నలు, త్యాగరాజు, కంచర్ల గోపరాజు, క్షేత్రయ్య, మొదలగువా రందరునూ ఈ పథమునే బట్టిరి. శతకకవులుకూడా, ఆస్థానములలో సంగీతవిద్యాపరీక్షార్హత కల్గిన పండితులుగానే మన్నన పొందినట్లు, వేణుగోపాలశతకకారుని "ఆస్థానమున ప్రవేశించగానే (తనవంటి) విద్వాంసులకు మ్రొక్కని నర్తకి"కి విధించవలసిన దండనముల తెలుపు పద్యమును బట్టి సూచితమగుచున్నది.

"ఆపాతమధురమగు" గానమునకు తోడు కావలసిన సాహిత్యము, "ఆలోచనామృత"త్వ గుణముకన్న "ఆపాతమధుర"త్వ గుణమే, అధికముగా ప్రతిబింబించుకొనవలసిన కారణమున, సామాన్యప్రజ కందుబాటులో నున్న వ్యావహారిక నుడికారములను, యథాతథముగా చొప్పించుట కష్టరాని, లయ ప్రాధాన్యములగు మాత్రాఛందములనే తమ కవితకు వాహికగా వీరు గైకొనిరి. తత్కారణముగ ప్రజాసన్నిహిత మగు తెలుగునుడికారమే, తక్కిన కవులందరిలోకన్న, పదకవులలోను, సంకీర్తనకవులలోను, శతకకవులలోనూ ఎక్కువగ భాసించినది. "ప్రజాసాహిత్య" మను ప్రచార నినాదము బయలుదేరుటకు, 500 ఏండ్లకు పూర్వమే, ఈ సంకీర్తన విధానమునకు సృష్టికర్తయై, వాగ్గేయకారుడై, గోపన్న, త్యాగయ్య, సిద్ధేంద్రుని వంటి ప్రతిభాశాలులు ప్రభవించుటకు మార్గము చూపినవాడు తాళ్ళపాక అన్నమాచార్యులు. సంకీర్తనాచార్యుడు, పదకవితాపితామహుడు, హరికీర్తనాచార్యుడు అన్న బిరుదవిశేషములు తరతరములుగా ఇతనికి నిలచిపోయినవి. 500 ఏండ్లకు ఈనాడు, శ్రీ వేంకటేశ్వరప్రాచ్యపరిశోధనాలయమువారి ప్రోత్సాహమున, తిరుపతి దేవస్థానమువారి ఆధ్వర్యమున, తిరుపతి వేంకటేశ్వర భక్తుడును, తిరుపతిమండల నివాసియు నగు ఈ అన్నమాచార్యుల వారి వర్ధంత్యుత్సవము ఈ నెల ప్రారంభములో జరిగినది. అన్నమాచార్యుల వృత్తాంతమును ప్రాచ్యగ్రంథముల నుండి పరిశోధించి, ఆతని కీర్తనలన్నియు సేకరించి, తమ సంపాదకత్వమున ప్రచురించిన, ప్రాచ్యలిఖితగ్రంథ సేకరణ నిపుణులగు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, సంగీతసాహిత్యవిశారదులగు శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు, జస్టిస్ రాజమన్నారుగారు మొదలైన ప్రముఖులీ ఉత్సవమునకు తోడ్పడుటలో, సంకీర్తన కవులు, పదకవులు మొదలగు కవుల పట్ల, తెలుగు ప్రజల గౌరవాభిమానము లినుమడింప జేయగల్గిరి.

అన్నమాచార్యుని కృతులకు స్వరకల్పన మొనరించి, తెలుగు గాయకులకు, ఈ సంకీర్తన కవి పితామహుని కీర్తనలను పరిచయము చేయుటలో శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారు, చాలా కృషిచేయుచున్నారు. వీరు స్వరపరచిన కీర్తనలు గత నాలుగైదు నెలలుగా వారపత్రికలో వెలువడుచున్నవి. వానితో పరిచయ మున్న పాఠకులకు, అన్నమాచార్యుని కీర్తనలలోని నుడికారమునుబట్టి, అన్నమాచార్యులు గాయకుడే కాక, కవిగా కూడ ప్రముఖుడని తెలియగలదు.

తక్కిన పూర్వ తెలుగు కవులు, గాయకులలో కూడా ప్రముఖులైన పూర్వుల వర్ధంత్యుత్సవముల నిట్లే జరిపి, విస్మృతప్రచారములో లేక మరుగునపడిపోయిన తెలుగుతనమునంతనూ, తెలుగువారికి పరిచయము మొనర్చి, ఇట్టి సంస్థ లెన్నియో బయలుదేరగలందులకు వేంకటేశ్వరప్రాచ్య పరిశోధనాలయమువారు తగు కృషి చేయగల రని ఆశించుచున్నాము.

మద్రాసు నూతన మంత్రివర్గం

అన్ని వర్గాలను సమన్వయించుకు రావటానికి కృషి

మన రాష్ట్రంలో మంత్రివర్గం మళ్లీ మారింది. మారుతుం దని అందరూ అనుకున్నదే. కాని శ్రీ పూసపాటి జగన్నాథ కుమారస్వామిరాజా గారి ఎన్నిక మాత్రం ఎవరూ అనుకోకుండా సంభవించింది. రాజాగారిని నాయకత్వానికి పోటీ పెడతా రని ఎవరూ అనుకోలేదు. ఎన్నిక రేపనగా మాత్రమే వీరిపేరు పైకి వచ్చింది.

శ్రీ కుమారస్వామి రాజా గారు ప్రకాశంగారి ప్రభుత్వంలో వ్యవసాయశాఖామంత్రిగా పని చేశారు. వీరిది రామ్నాడుజిల్లా రాజపాళయం. వీరి పూర్వులు దక్షిణాదిని స్థిరనివాసం ఏర్పర చుకున్న ఆంధ్రులు. రామ్నాడుజిల్లా కాంగ్రెస్ లోను, జిల్లాబోర్డులోను చాలకాలంగా సభ్యులు. వీరికి పశ్చిమ గోదావరిజిల్లాలోనూ, విశాఖజిల్లా లోనూ బంధువర్గం చాలాఉంది. 1934 ప్రాంతాల కేంద్రశాసనసభ్యులుగా ఉన్నారు. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం పట్ల వీరు సుముఖులే. దక్షిణాది ఆంధ్రులు ఈ రాష్ట్రరాజకీయాల్లో తమిళులతోనే కలిసి ఉండాలనీ, దక్షిణాది ఆంధ్రుల భవిష్యత్తు తమిళులపైనే ఆధారపడి ఉందని వీరు అభిప్రాయం వ్యక్తపరిచారు.



ఓమండూరు రామస్వామిరెడ్డియార్

మార్చి నెల ఆరంభంలోనే శ్రీ ఓమండూరు రామస్వామిరెడ్డిగారిని ప్రధానిపదవినుంచి తొల గించా లని శాసనసభ్యులు, మంత్రులు పట్టు దలతో పనిచేశారు. ఎన్నికరోజు దగ్గర పడిన కొద్దీ రామస్వామిరెడ్డిగారిని తిరిగీ పార్టీ నాయ కునిగా ఎన్నుకోరనే విషయం స్పష్టపడి పోయింది. ఎల్లుండి ఎన్నిక జరుగుతుం దనగా శ్రీ రామస్వామిరెడ్డిగారు పార్టీని సమావేశ పరిచి, తాము ప్రధానిగా ఉండగా ప్రభుత్వం ఏయే కార్యాలు సాధించిందో సభ్యులకి జ్ఞప్తికి తెచ్చారు. అయినా సభ్యులు వాటిని గమనించే ధోరణిలో లేరు. మర్నాడు పోటీనుంచి విర మించుకుంటున్నట్లు ప్రకటించారు. ఎన్నికలో శ్రీ కుమారస్వామిరాజాగారిపక్షానే వారూ, వారి అనుయాయులూ వోటు చేశారు.

శ్రీ కుమారస్వామిరాజాగారు 16 వోట్ల



శ్రీ పి. ఎస్. కుమారస్వామిరాజా

మెజారిటీతో నాయకులుగా ఎన్నుకోబడ్డారు. ఇప్పుడు అన్నివర్గాల ప్రతినిధులనూ చేర్చి స్థిర మైన మంత్రివర్గం స్థాపించాలని యత్నాలు జరుగు తున్నాయి. శ్రీ కామరాజనాడార్ గారే అన్ని వర్గాలతోనూ సంప్రదింపులు జరిపారు. చివరికి స్థిరమైన మంత్రివర్గాన్ని స్థాపించడానికి అన్ని వర్గాలనీ అంగీకరింపచేసినట్లు వారే ప్రక టించారు.

స్థిరమైన మంత్రివర్గాన్ని నిర్మిస్తున్నారంటే దేశం అంతా ఆనందిస్తుంది. కాని అది సాధ్యమేనా అని ప్రబల సందేహం అందరికీ ఉంది. పోగా తెలుగు శాసన సభ్యులు గమనించవలసిన కొన్ని ముఖ్యాంశా లున్నాయి. మార్చి నెలలో జరిగిన వర్గరాజ కీయాల ధోరణినికూడా కొంత గమనించవలసిన అవసరం ఉంది.

శ్రీ కుమారస్వామిరాజాగారిని నాయకు నిగా ఎన్నుకోవా లని ముందుగా ప్రకాశం వర్గంవారే సూచించా రట!

మార్చి నెలారంభంలో శ్రీ రామస్వామిరెడ్డి గారిని తొలగించా లని మంత్రులుకూడా కొందరు పట్టుబట్టుతున్నా రని అందరికీ తెలుసును. వారి కంటె తమిళ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకామరాజ నాడార్ గారికి పట్టుదల అధికంగా ఉంది. రెడ్డి గారిని తొలగించడం ఖాయం కాగానే ఎవరో ఒకరిని నాయకులుగా సర్వవర్గాలవారూ ఏక గ్రీవంగా ఎన్నుకోవా లనే అభిప్రాయం అందరి లోనూ కలిగింది. నాడార్ గారే ఇందుకు తీవ్ర కృషి చేశారు. అనేకమార్లు ప్రకాశంగారి ఇంటికి వెళ్లి వారితో దీర్ఘంగా చర్చలు సాగించారు. ప్రకాశంగారి సహచరుల్తో చర్చలు జరిపారు. ప్రకాశంగారి వర్గం డా॥ సుబ్బరాయన్ గారిని పోటీకి నిలబెట్టడానికి నిశ్చయించారు. ఈ నిశ్చయం మానుకుని శ్రీ భక్తవత్సలంగారిని ఏకగ్రీవంగా నాయకునిగా ఎన్నుకోవలసిందని నాడార్ గారు ప్రకాశంగారి వర్గాన్ని కోరారు.

ఆంధ్రులకు కావలసినవారు, తమిళదేశాన్ని మాతృ రాష్ట్రంగా మన్నించేవారూ అయిన శ్రీ కుమారస్వామి రాజాగారిని నిలబెట్ట రాదా అని ప్రకాశంవర్గంవారు సూచించారట. తమవర్గం ఇష్టపడ దని నాడారుగారు సాకు చెప్పారట. అప్పటికి రామస్వామి రెడ్డిగారు, భక్తవత్సలంగారు, డా॥ సుబ్బరాయన్ గారు ముగ్గురు అభ్యర్థు లున్నారు.

ఇంక పోటీనుంచి రామస్వామిరెడ్డిగారిని విరమింప చెయ్యవలసిన అవసరం వచ్చింది. నాడార్ వర్గం గోపాలరెడ్డిగారిఇంటిలో సమా వేశ మైనారు. భక్తవత్సలంగారిని నిలబెడితే రామస్వామిరెడ్డిగారు పోటీనుంచి విరమించు కోరు. రామస్వామిరెడ్డిగారికి 15 మంది అండ వుంది. వీరి నాకర్షించాలంటే కుమారస్వామి రాజాగారే తగినవారని నాడార్ గారికి తోచింది. రాజాగారిని నిలబెట్టితే విరమించుకోగలమని రామస్వామి రెడ్డిగారు చెప్పారు. రేపు ఎన్నికనగా ఈ మార్పు జరిగింది.

రామస్వామి రెడ్డిగారి బలగం, పి. యల్. యన్. రాజు, రామభద్రరాజు మొద లైనవారు అటునుంచి ఇటు తిరిగిపోవడంతో డా॥ సుబ్బరాయన్ గారు ఓడిపోయారు.

తమిళులలో అన్ని వర్గాల్నీ కూడ గట్టుకురావ డంలో నాడార్ గారి కృషి బాగా పనిచేసింది. ఏకగ్రీవంగా నాయకుని ఎన్నుకోవా లనడంలో నూ, స్థిరమైన మంత్రివర్గాన్ని స్థాపించా లనడం లోనూ తమిళవర్గాలన్నీ తమతో కలిసి రావా లనే నాడార్ గారి అభిప్రాయం.

-వెంకట్రావుగారు అఖిల భారత కాంగ్రెస్ కార్యదర్శి అయినప్పటికీ రాష్ట్రరాజకీయాల పట్ల వారిశ్రద్ధ వీసం తగినట్లు లేదు. తమ వర్గంలోనుంచి ఎవరూ చెదరిపో కుండా కంచె చుట్టూ కాపలాకి ముగ్గుర్ని నియ మించి ఉంచారు కూడా.

రాష్ట్రమంత్రివర్గ రాజకీయాల్లో ఇంతవరకూ జోక్యం చేసుకోలేదు కాని ఇంకాను మాత్రం ఊరుకోలేనని చెప్తూ, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ యన్. జి. రంగాగారు రంగం లోకి వచ్చారు. ప్రకాశంగారి పక్షాన ముందు రెండేళ్లు వీరు జోక్యం చేసుకున్నారో లేదో ప్రజల కంత బొత్తిగా మతిమరుపు లేదు. మంత్రి వర్గాన్ని మార్చాలనుకోవడం సంతోషంగా ఉందని వీరు వచ్చీరావడంతోనే ప్రకటన చెయ్య డంలో ఆంతర్యం బోధపడ్డానికికూడా కష్టం లేదు. రాష్ట్రకాంగ్రెస్ తరఫున మంత్రివర్గరాజకీ యాల్ని మరమ్మతు చేస్తాననివస్తే శాసన సభ్యు లంగీకరించగలరా! ఎవరైనా మరమ్మతు చెయ్య పూనుకున్నా, సలహా ఇవ్వడానికి సిద్ధపడినా వారి శాసనసభ్యత్వపు హక్కులికి భంగం కలుగు తుంది మరి.



డా॥ సుబ్బరాయన్

పోనీ నలుగురు కాంగ్రెస్ అధ్యక్షులం కూడ బలుక్కుందాం అని చెప్పి అంతటితో పోని చ్చినా ఎవరూ అంత పాటించకపోయేవారే. కాని పటేల్ గారిదగ్గరనించి ఏదో తాఖీదు తెచ్చారనే అపోహను ప్రజల్లో కల్పించి మరీ వచ్చారు. తమవద్ద ఏమీ లేదని స్పష్టపరచడా నికి వా రెందుకు నిరాకరించారు? ఇది బుకా యింపు అంటే వా రేమి సమాధానం చెప్తారు? బుకాయింపుఅని తెలిసిన నాడార్ గారు తగినట్లే ప్రవర్తించారు. ఇటువంటివి నాడార్ గారు ఎన్నో చూశారు. రాజగోపాలాచారిగారినే భంగపరచగలిగినవారిని, రంగాగా రేమి చెయ్య గల రనే ధైర్యంతో వచ్చారో తెలియదు. చెన్నపట్నం వచ్చి, ఏమీ చెయ్యలేక నిర్ఘాంతపోయి చూస్తూ కూర్చోవలసి వచ్చింది. మర్నాడు పత్రికాప్రకటన అన్నా చెయ్య కుండా వెళ్లిపోయారు.

ఆంధ్రరాష్ట్రం!

జయపూర్ కాంగ్రెస్ సమావేశసమయంలో పట్టాభి, నెహ్రూ, పటేల్ గార్లు సభ్యులుగా నియమించబడిన భాషారాష్ట్ర నిర్ణాయకఉప సంఘం ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి ఏకగ్రీవంగా సుముఖత ప్రకటించిందని తెలియవస్తోంది. ఈ ఉపసంఘం నివేదికను కాంగ్రెస్ కార్యవర్గం చర్చిం చింది. కార్యవర్గంకూడా ఆమోదిస్తుందని నమ్మకంగా తెలుస్తోంది.

అయితే ఇది ప్రస్తుతానికి ప్రత్యేక రాష్ట్రంగా నిర్మించబడక పోవచ్చును. పరిపాలనా సౌకర్యానికిగాను స్థూలరూపంలో చెన్నరాష్ట్ర గవర్నరు ఆధిపత్యంకిందనే విడిగా తెలుగుజిల్లాల పరిపాల నకు ఏర్పాటు కావచ్చునని తెలుస్తోంది. కాని...ఇది ఎన్నాళ్ళకి అమలు లోకి వస్తుందో తెలియదు. ఆమోదానికీ ఆచరణకీ మధ్య వ్యవధి అనుకున్నంతకంటె అధికంగా పట్టవచ్చును.

హిందీ సాహిత్యం:

ప్రేమచంద్

శ్రీ బసిరెడ్డి ఈశ్వరరెడ్డి

ప్రేమచంద్ రవీంద్రనాథు లిద్దరే దేశవిదేశములలో పేరెన్నికగన్న ఉత్తమభారతకథా రచయిత లనునది నిర్వివాదమైన విషయము. రవీంద్రుని ప్రతిభ బహుముఖం. కానీ ప్రేమచంద్ తన ప్రతిభనూ అసాధారణనైపుణ్యమునూ ముఖ్యముగా కథాసాహిత్యరచనలోనే వినియోగించెను. అతని నవలలకంటే కథలద్వారానే అమిత యశస్సు అతనికి లభించినది. అతని రచనా క్షేత్రం కథలు నవలలవరకే పరిమితమైననూ ఆ క్షేత్రములో అత డద్వితీయుడు. శుష్క రాజకీయముల ప్రభావము అతని రచనల్లో అపరిమితముగా ఉన్ననూ అది కథాతత్వమునకు గానీ కళానైపుణ్యమునకుగానీ ఏమాత్రం అంతరాయమును కల్గించలేదు. అదియే అతని కథా సంవిధానంలోని విశిష్టత. ప్రేమచంద్ కథలు యూరోపులోని అనేకభాషలలోనూ యిండియాలో యించుమించుగా అన్ని భాషలలోననూ అనువదిత మైనవి. మన తెలుగునాడులో మాత్రం ప్రేమచంద్ అనువాదముల సంఖ్య శరత్సాహిత్యమంత లేదు. కారణ మనూహ్యం. హిందీప్రాంతంలోని ఏకైకప్రతిభావంతు డితడొక్కడే ఉత్తరభారతదేశంలోని ప్రతి తుచ్ఛరచనా తెలుగులో అనువదించబడుచున్న యీ సమయంలో ప్రేమచంద్ యొక్క అమూల్య సాహిత్యమే పరిమితంగా మన దేశములో ప్రచారం కావడం ఆశ్చర్యకరం.

ఇతడుకూడా శరత్ బాబువలెనే ఒక పేద పరివారములో జన్మించినాడు. తన స్వయం కృషితో ప్రైవేటుగా బి.ఏ. పాస్ చేసి ఉద్యోగం చేస్తూ యావనోద్రేకంతో స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొని ఉద్యోగము వొదిలివేశాడు. మొదట్లో తీవ్రరాచకీయరచనలవల్ల పోలీసుల కోపానికి గురియైనాడు. నిరంకుశప్రభుత్వబారి నుంచి తప్పించుకొనడమునకు "ప్రేమచంద్" అను పేరుతో వ్రాస్తూ ఉండేవాడు. అసలు పేరు... మొదట యితడు ఉర్దూలో వ్రాసేవాడు. కనుక యితనికి భాషను సజీవంగా చేయడం, జాతీయము (ముహావర్)లతో రచనలను అతి మధురంగా చేయడం మొదలగు హిందీవారి కపరిచితమైన గుణములు పట్టుపడినవి. జాతీయములను అతివిరివిగా వాడి యితడు భాషకు ఒక వింత సౌందర్యమును చేకూర్చినాడు. అతడే స్వయంగా అనేక జాతీయములను నిర్మించినాడు. హిందీప్రాంతంలో యితనితో సమానమైనవా డింతవరకూ పుట్టలేదు. భాష నింత సరళంగా ప్రవాహయుక్తంగా నిర్మిస్తూ భావముల నింత తేలికగా ప్రకటించు రచయిత హిందీప్రాంతంలో మరి లేడు. హిందీభాష యింతమాత్రమైననూ పరిమార్జితం కావడమునకు ప్రేమచందే కారణ మని చెప్పవచ్చును.

అతని కథాసాహిత్య మపరిమితం. అతడు మనోవిజ్ఞానంలో పరిపూర్ణమైన పండితుడు. మన శాస్త్రకారులకంటే అతని రచనలను చదివినట్లయిన మనోవిజ్ఞానం క్షుణ్ణంగా అవగతం కాగలదు. కండ్ల కగోచరమై మనస్సులోని గాఢాంధకారములో దాగియుండే అతి సూక్ష్మమైన విభావానుభావములను ఆ కవి హృదయం మాత్రమే గ్రహించగలదు. గాంధీవాదప్రభావం అతని ప్రతిరచనలోనూ స్పష్టంగా ప్రతిఫలిస్తూ ఉంటుంది. అహింస నతడు ముఖ్యంగా సమర్థిస్తాడు. స్వయంగా స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొని తత్ఫలితముల ననుభవించినవాడు గనుక అతని రాజకీయకథలను చదివిన ప్రతి హృదయం ఉద్రేకంతో ఉప్పొంగిపోవును. అతడు భావపూర్ణమైన కథలనూ ఘటనాపూర్ణకథలనూ సమస్యాత్మకకథలనూ అనేకవిధములైన కథలను రచించెను. గ్రామజీవనచిత్రణలో అత డద్వితీయుడు. గ్రామస్థుల హృదయముల నింత మార్మికంగా వారి హావభావములను వేషభూషణములను ఆచారవిహారములను మానసికప్రవృత్తుల నింత విశదంగా సూక్ష్మంగా నిపుణంగా స్పష్టీకరించిన కవు లరుదు. ధనికుల అహంకారం పేదల నిస్సహాయత్వం సంఘంలోని దురాచారములు మొదలగు విషయముల నతడు ఎక్కువగా చిత్రించిననూ గ్రామజీవితచిత్రణలోనే అతని కళ చరమలక్ష్యమును పొందినది. అతని ప్రతిభయొక్క ఉజ్జ్వల వికాసం మనకు అతని గ్రామజీవనచిత్రణలోనే కన్పించును. అతని రచన లన్నిటిలోనా పాత్రపోషణ కెక్కువ ప్రాముఖ్య మిచ్చినాడు. అతని ప్రతిపాత్రకూ సాధారణముగా ఒక లక్ష్యం, ఒక ఆదర్శం ఉండి తీరును. కానీ శరత్ బాబువలె అతని పాత్రలు భావావేశముతో చిందులు దొక్కునవిమాత్రం కావు.

అతని రచనల్లో భావానుగుణ్యమైన భాష ప్రవాహం నిండియుండును. అతని రచన లన్నిటిలోనా అచ్చటచ్చట మార్మికమై అనుభవైకవేద్యమైన సూక్తు లుండును. ఒక విషయమున నిరూపించుటకు అర్థాంతరన్యాసమువలె ఈ సూక్తులుండును. జీవనతత్త్వమునకు పరిభాషలైన యీ సూక్తులను సంకలనం చేసిన ఉత్తమోత్తమ మనస్తత్త్వశాస్త్రం తయారు కాగలదు. అతని కథల్లో ప్రేమకే గాక అస్పృశ్యోద్ధారం, అహింస, ధనికుల అన్యాయం, పేదల మూర్ఖత్వం మొదలగు అనేక విషయములకు స్థాన మివ్వబడినది. శరత్ బాబువలె కేవలం ప్రేమకు స్త్రీపురుషసంఘర్షణల కతనెక్కువ ప్రాముఖ్య మివ్వలేదు. ఒక్క కథలో కూడా ప్రచారం కోసం కళ హత్యచేయబడలేదు. స్త్రీపురుషసంబంధమైన జుగుప్సాకరమైన వర్ణనలు కానీ, సంభోగశృంగార వివరణలు కానీ అతడు చేయలేదు ప్రేమఘట్టాల్లోకూడా పవిత్రమైన సాత్త్వికప్రేమమాత్రమే ప్రదర్శింపబడినది.

నిర్మల, రంగభూమి, గోదానం, సేవాసదన్, కాయాకల్పము, కర్మభూమి, గబన్ మొదలగునవి అతని ప్రముఖమైన నవలలు. వృద్ధవివాహకురీతి నిర్మల అను నవలలో అతి తీవ్రంగా ఖండించబడినది. మున్షీ తోతారామ్ ముగ్గురు కుమారు లుండగనే వృద్ధాప్యంలో యౌవన సుఖాన్ని అనుభవించడమునకు నిర్మల అను అమాయకురాలిని పెండ్లాడును. పైగా అతిపవిత్రచరిత్రుడైన తన యువకపుత్రుడు నిర్మలతో సరసంగా ఉండడంచూచి అనుమానిస్తాడు. నిర్మల యీ విషయమును గ్రహించడం, వృద్ధవివాహముతో తన సుఖశాంతులు నశించిననూ రోకటిపోటువలె పైబడిన ఆ భర్తఅనుమానమును పోగొట్టుటకు లేని ప్రేమను భర్తపై చూపుతూ సోదరునివంటి మంసారామ్ (యువకపుత్రుడు) పై కర్కశత్వవటన చేయడం, మన్సారామ్ అన్యాయంగా వచ్చిన ఘోరకళంకనివారణకై శతవిధములా ప్రయత్నించడం, చివరకు కృశించి నిర్మలపాదములపై ప్రాణం విడవడం, ఒక్కరొక్కరుగా కుటుంబ మంతయూ వృద్ధవివాహపిశాచమునకు బలియై సర్వనాశనం కావడం మొదలగు భయంకరమైన ఘటనలతో యీ నవల దుఃఖభూయిష్ఠమైనది. ప్రేమచంద్ నవల లన్నిటిలోనూ నిర్మలయే దుఃఖభూయిష్ఠమైనది. ఇంత దుఃఖభూయిష్ఠమైనది కనుకనే పాఠకుల నీ నవల పూర్తిగా మార్చివేయగలదు. వృద్ధవివాహంపై అందరిలోనా అసహ్యతను పుట్టించగలదు. మన్సారామ్‌యొక్క కళంకనరకయాతన నిర్మలభగ్నజీవితమును గడుపుతూకూడా పరివారసుఖమునకై పడే నరకయాతనా తోతారామ్‌యొక్క అమానుష ప్రవర్తనా మనల్ని కలచివేయును. కుమారుడు మృత్యుశయ్యపై హాస్పటల్లో ఉన్నాడు. యింటికి తెచ్చిననేగాని అతడు బ్రతుకడు. యింటికి తెస్తే నిర్మల అతని కుపచారం చేస్తుంది. యీ భయంకరస్థితిలోకూడా నిర్మల కుమారునివద్ద ఉండడం ఆ వృద్ధుడు భరించలేడు. ఈ ఘటన ఎంత అమానుషమై మర్మస్పర్శియైనదో పాఠకులు సహజంగా గ్రహించగలరు. నిర్మల ప్రేమచందుయొక్క ఉత్తమోత్తమ నవల యనవచ్చును.

కర్మభూమి కథానాయకుడు అమర్ కాంత్. యీ నవలలో రాజకీయసమస్య లెక్కువ. సకీనాయొక్క విశుద్ధప్రేమ సలీముఉత్కృష్టత అమరనాథుని క్రమికవికాసం ప్రొఫెసరుగారి దేశభక్తి, కుమారునిపై ప్రేమతో తండ్రియొక్క పరివర్తన మొదలగు ప్రముఖ ఘట్టములు పాఠకుల నెక్కువ ఆకర్షించును. యీ నవలలలో ప్రముఖ సమస్య ఏదీ లేదు. ఒక యువకు డెన్ని విధములుగా ఉత్థానపతనములను చెందగలడో విరుద్ధవాతావరణంలో పెరిగిన పురుషు డెంత విచిత్రవికాసమును చెందగలడో అమరకాంత్ పాత్ర పోషణ ద్వారా మనకు తెలియగలదు.

రంగభూమి సూరదాస్ యొక్క ప్రముఖ నవల. యిందులో ప్రముఖపాత్ర సూరదాస్. అత డొక యోగి. త్యాగి. విచిత్ర సిద్ధాంత ప్రవర్తకుడు జీవితాన్ని ఒక ఆటగానూ మానవులు ఆటకాళ్లుగానూ అతడు భావిస్తాడు. అత డొక సాధువైన అంధుడు. కష్టములకు గానీ నిరాశకు గానీ అతడు చలించడు తన ప్రాణముల నైనా వదలును కానీ తన పూర్వుల స్మృతిచిహ్నమైన భూమి నతడు వదలజాలడు. విచిత్రభావములు విచిత్రశక్తులతో గూడిన మన ప్రాచీనసంస్కృతికి యితడు ప్రతినిధిగా కన్పిస్తాడు. దీనిలో కథానాయిక "సోఫియా". ఆమె భారతీయధర్మమునకూ క్రీస్తు అహింసాత్మకబోధనలకూ సమన్వయం చేయు కరుణాస్వరూపిణి. ఆమె క్షత్రియుడైన రాకుమారుని ప్రేమిస్తుంది. రాణీ జాహ్నవి కిది సరిపడదు. తుద కనేక కష్టనిష్ఠురములనూ, అనేకవిచిత్ర ఘటన లనుభవిస్తూ చివరకు వారు కలుసుకొందురు. కానీ అకస్మాత్తుగా తాత్కాలికోద్రేకంలో రాకుమారుడు మరణిస్తాడు. సోఫియా కూడా ప్రియుడు మరణించినందున ఆత్మహత్య చేసికొనును. యీ నవలలో ప్రేమచంద్ అనవసరదుఃఖాంతమును ప్రవేశపెట్టినాడు. రాకుమారుని మృత్యువు పూర్తిగా అనవసరం. కథా సంవిధానమునకు పెద్దదెబ్బ ఐననూ రంగభూమి ప్రేమచంద్ యొక్క ఉత్తమోత్తమనవల యని చెప్పక తప్పదు.

కాయాకల్ప పునర్జన్మ సిద్ధాంతమును పాటించు నవల. యిది కళాత్మకంగానూ ప్రవాహపూర్ణంగానూ లేదు. ప్రేమచంద్ నవలలలో ఉన్నతస్థానము దీని కివ్వజాలము. "గబన్" ప్రేమచంద్ యొక్క సాంఘిక నవల. యిందులోని కథానాయకుడు "రమాకాంత్" ఫాషన్లలో మునిగి సరళత సహజత్వంలేని అనేక మంది యువకులకు ప్రతినిధి. రమాకాంత్‌లోని గుణములు నేటి ప్రతియువకునిలోననూ కొన్నైనా ఉండితీరును విలాసవతులు కూడా ఉత్తమ దేశసేవికలు కాగల రనియూ, పతిపత్నుల మధ్య రహస్యములు భేదములూ ఉండడం ప్రమాదకరమనీ యీ నవల నిరూపిస్తుంది. యీ నవలలో ఎన్నో ఆవేశమును కల్గించు మార్మికస్థలము లున్నవి. కానీ ఎక్కడా పాఠకుల హృదయమున కేమాత్రం ఆఘాతం కలుగకుండా ఉండడమునకు ప్రయత్నిస్తాడు.

ప్రేమచంద్ నవలలలో అక్కడక్కడ కన్పించు చిన్నచిన్న దోషములు కథలలో ఎక్కడా కన్పించవు. అతని ప్రతి కథయూ ఉద్యానవాటికలోని పూలచెట్లవలె క్రమిక వికాసం కలిగియుండును. అందులో అడవి పొదలవంటి అస్తవ్యస్తతా అనవసరవిధానం ఏమాత్రం ఉండదు. అతడు వందలకొలది కథలను రచించెను. అతడు సాహిత్యరంగంలో చొరరాని ప్రదేశమే లేదు. సకల మానవప్రవృత్తులనూ ఆకళింపుచేసికొను విశాలవిహంగమ దృష్టి అతని కున్నది కనుకనే అతడు మహారాజుల ఆభిజాత్యగుణములనూ, నమ్రరాని ధార్మికవిషయములనూ కూడా స్వయంగా సామ్యవాదియై కూడా వర్ణించుటకు వెనుదియ్యలేదు. మనస్తత్వములకే ఎక్కువ ప్రాధాన్య మివ్వడంవల్ల అతని రచనల్లోని ప్రచారత్వంకూడా మనకు నీరసంగా శుష్కంగా కన్పించదు. అతడు తన కథలను కానీ, నవలను కానీ సాధారణంగా ఎక్కడా ట్రాజడీ చేయలేదు. అనవసరంగా పాఠకుల మనస్సు కాఘాతం కల్గించడం అతని కిష్టంలేదు. అతని కథల్లోని ప్రతి పేజీ ప్రతివాక్యంకూడా స్వయంసంపూర్ణమే. అతని ప్రతివాక్యంలోనూ సంపూర్ణత్వం ఆకర్షణ నిండియున్నది. యీ విషయం శరత్ బాబు రవీంద్రులరచనల్లో కన్పించదు. వారి రచనల్లోని ప్రతి భాగమునూ విడదీస్తే ఏమాత్రం ఆకర్షణ యుండదు. వారి రచనల్లో మార్మికస్థలము లేవో తెలిసికొనడం కష్టం రచన అంతా సమగ్రంగా చదువువరకూ శరద్రవీంద్రుల ఉత్కృష్టత బోధపడదు. అట్లుగాక ప్రేమచంద్ యొక్క ప్రతివాక్యం స్వతంత్రంగానూ, సంపూర్ణంగానూ కన్పించును.

అతని భావప్రదర్శనశక్తి అపూర్వమైనది. అతిగహనమైన విషయములనుకూడా అతి సరళంగా అతడు స్పష్టీకరించును. అతిగంభీర విషయములను కూడా అతిసరళశైలిలో ఒక చిన్న వాక్యంద్వారానే తెలియజెయ్యడం అతని రచనల్లోని ప్రత్యేకత అతడు విచారించని గంభీర విషయములుకూడా లేవు. అతని రచనల్లో జరుగబోవు ప్రతిఘటనా అవశ్యంభావిగానే కన్పించునట్లు చేయును. రాబోవు ప్రతివిషయాన్నీ క్రమబద్ధంగా ముందే సూచించడంవల్ల ఆ మార్మికస్థలాల్లో అకస్మాత్తుగా ఆఘాతం కానీ ఎక్కువ భావావేశం కానీ మన హృదయమునకు కలుగదు; ఈవిషయం యిట్లు జరగదు. అన్యాయం అను భావం ప్రేమచంద్ యొక్క ఏరచనలోనా మనకు కన్పించదు యిట్టి ఘటనానైచిత్ర్యం శరద్రచనల్లో మాత్రమే కన్పించును, ప్రేమచంద్ రచనల్లో మార్మికస్థలములుకూడా తక్కువగా లేవుకానీ; ఏదీ అకస్మాత్తుగా జరిగినట్లు లేదు. స్పష్టతయే అతని రచనల్లోని ముఖ్యవిశిష్టత. అతని రచన చదువునంతసేపూ ఎక్కడా మధ్యలో ఆగి ఆలోచించవలసిన అవసరం పాఠకులకు కలుగదు. పాఠకుల కేమాత్రం సందేహం కలుగకుండా ప్రతివిషయాన్నీ స్పష్టంగా అతడు చిత్రిస్తాడు. పాఠకుల మనస్తత్త్వమునకు అంతరాయం కలుగకుండుటకే పాఠకుల భావాల సంరక్షణకే అతడు ప్రయత్నిస్తాడు, అతడు పాఠకుల మనోభావములపై ఎక్కువ దృష్టిని కేంద్రీకరించును.

కళాసౌష్ఠవం చెడకుండా ప్రజలహృదయాలను జాతీయభావపూరితాలను జేసి తన కలం ద్వారా అశేషప్రజానీకహృదయముల నుర్రూతలూగించిన మహనీయు డీతడే. తన రచనల ద్వారా దేశవిదేశీయుల హృదయసామ్రాజ్యాభిషిక్తులైన భారతీయుల్లో యితడు ముఖ్యుడు యితడు లేకున్న హిందీ యేమాత్రమైనా పరిమార్జితం కాలేదనుటలో ఆశ్చర్యం లేదు. కళకూ జాతీయతకూ చక్కని సామంజస్యమొనర్చిన ప్రముఖు డీతడు. సమస్తభారతీయులూ యీ ఉత్తమ రచయితయొక్క దేశభక్తికీ, సాహిత్యసేవకూ కృతజ్ఞులుగా నుండగలరు.

ప్రజల్ని రెచ్చగొడతారు, శాసనాలు ధిక్కరిస్తారు, మోసగిస్తారు: ఈ తరహా వ్యక్తుల్ని కనిపెట్టండి

[సర్ నార్మన్ ఏంజెల్]

ఆ వ్యక్తి ఒక తరహా అనవచ్చును. అటువంటి వ్యక్తి అన్ని దేశాల్లోనూ ఉంటాడు. అతని ప్రభావం అమెరికాలో, బ్రిటన్‌లో, ఫ్రాన్సులోనూకూడా ఇప్పుడు ఈ క్షణంలో గోచరిస్తూనే ఉంటుంది. దేశంలో శాసనాల్ని ఒక్క విసురుతో అతను తోసివెయ్యగలడు. దేశహితం అనేమాట ఆలోచించడు. తన దేశం ఏ దేశాల్తో ఎల్లాంటి ఒడంబడికలు చేసుకున్నా లక్ష్యపెట్టకుండా భగ్నం చెయ్యగలడు. పవిత్ర వాగ్దానాల్ని చులాగ్గా ఎగరగొట్టెయ్యగలడు. దేశరక్షణ అంటేనూ, దేశంలో శాంతిభద్రతలు అంటేనూ అతనికి రవంత విచారం లేదు. కార్మిక నాయకులుగాని, కార్మికసంఘాలుగాని ఇచ్చిన మాటలు, చేసిన వాగ్దానాలు వేరాలు వానితో అతనికి నిమిత్తం లేదు. నిశ్చింతగా, విశృంఖలంగా ప్రవర్తించగలడు.

అతని చర్యలు చూస్తే కార్మికనాయకులు గడగడలాడతారు. ఈమధ్య జరిగిన సమ్మెలే దీనికి తార్కాణం. ఈ సమ్మెల్ని చెలగాటాలని అమెరికాలో అన్నారు. ఈ సమ్మెల్లో న్యూయార్కు ఓడరేవు కార్మికుల సమ్మె ఒకటి మచ్చుకి చూద్దాం.

అమెరికా చరిత్రలో అప్పుడు పరిస్థితి చాలా క్లిష్టంగా ఉంది. యూరప్‌లో నౌకాయానం అతిప్రధానవిషయంగా ఉంది. యూరప్‌లో పశ్చిమదేశాలకు ఆర్థిక సత్తా నివ్వాలని అమెరికా శాయశక్తులా యత్నిస్తోంది. ఇటువంటి రసగంధాయపుపట్టులో అమెరికా (యునైటెడ్ స్టేట్స్) తూర్పుతీరమంతటా నౌకాయానం పూర్తిగా స్తంభించిపోయింది.

ఈ సమ్మె, (ఈ చెలగాటం) అధికారరీత్యా ఏ కార్మికసంఘమూ ప్రకటించి సమ్మెకట్టిన సమ్మె కాదు. అసలు యూనియన్ (కార్మిక సంఘ) నాయకుడు యజమానుల్తో చాలా కాలం సమాలోచనలు జరిపి ఒక కంట్రాక్టు చేసుకున్నాడు. కంట్రాక్టుపైన సంతకాలు జరిగిన మరుక్షణంలో కార్మికుల్లోనుంచి (అనధికార రీత్యా) మన వ్యక్తి ప్రత్యక్షమైనాడు. సరిగా బేరాలాడితే పనివారికి ఇంకా మంచి షరతులు చిక్కి ఉండేవని కొందరు పనివారితో వాదించాడు. కొందరిని ఒప్పించగలిగాడు.

సరే చెలగాటం ఆరంభమయింది. అధికార రీత్యా నాయకుడైనవాడు తన నాయకత్వం పోతుందేమో నని భయపడి, తీరా ఆ వ్యక్తి, ఆ గండుపిల్లే నాయకుడౌతాడేమో నని భయపడి, ఏదో సామెతలో చెప్పినట్లు చేశాడు. ఒక ఫ్రెంచి రాజకీయనాయకుడు తన ఇంటిముందు పెద్ద గుంపు బొబ్బలుపెడుతూ నడిచిపోతుంటే కిటికీలోనుంచి చూసి, "అయ్యో, నేను వాళ్లకూడా వెళ్లక తప్పదే, నేనే వాళ్ళని నడపాలే" అనుకుని దిగి వెళ్లి వాళ్ళతో కలిశాడట.

ఈ రీతిగానే ఇక్కడా జరిగింది. ఆ నాయకుడూ నై అన్నాడు. దానితో సమ్మె అధికారరీత్యా యూనియన్ నాయకుని నోటిమాటల్లో ప్రకటించబడింది.

యూరప్‌నుంచి వచ్చిన ఓడలు న్యూయార్కు ఓడరేవులోకి రాలేకపోయాయి. సరుకులూ దించలేవు. మనుష్యుల్నీ దించలేవు. ఇంక ఓడల్ని హాలిఫాక్సు ఓడరేవుకి మళ్లవేశారు. వెంటనే న్యూయార్కు ఓడరేవు కార్మికుల నాయకుడు, హాలిఫాక్సు ఓడరేవులో కార్మికుల్ని సమ్మె చెయ్యవలసిందని కోరాడు. కాని కెనడా యూనియన్ సమ్మెచెయ్యడానికి నిరాకరించింది. వారు యజమానుల్తో కంట్రాక్టు చేసుకున్నారు. కెనడా శాసనాలప్రకారం సమ్మెలు నిషిద్ధాలు. సమ్మెలు చెయ్యకుండా కంట్రాక్టుల్ని మన్నిస్తేనే కార్మికులికీ, యూనియన్లకీ కూడా క్షేమం అని కెనెడియన్ యూనియన్ సమాధాన మిచ్చింది. వెంటనే కెనడాలో మన వ్యక్తి మరొకడు బయలుదేరతాడు. తన ధోరణి ఆరంభిస్తాడు. శ్రమపడే కార్మికులు పెట్టుబడి వర్గాలతో చేసుకున్న కంట్రాక్టులకోసం చింతించడమేమిటి? చివరికి వారు ధనికవర్గాలుకదా? ఈ శాసనాలన్నీ ధనికవర్గాలు ఏర్పరచినవే కదా! ఇటువంటి ధనికవర్గాలతో చేసుకున్న కంట్రాక్టుల్ని మన్నించాలనే చింత కార్మికుల కెందుకు? అంటాడు. వెంటనే కెనడా యూనియన్ నాయకులు కూడా చెప్పినమాట కార్మికులు వినకుండా లేచిపోతారేమో నని భయపడి, అంటే తమ నాయకత్వం పోతుందేమో నని భయపడి, మొదట తాము చెప్పిన మాటల్ని తమరే మాటుబెట్టి రంగు పిరాయిస్తారు. న్యూయార్కునుంచి వచ్చిన ఓడల్లోనుంచి సామాను దించడానికి నిరాకరిస్తారు. సరిగ్గా అదే జరిగింది.

సరిగ్గా అదే సమయంలో "క్వీన్ ఎలిజబెత్"లో ఒకడు మనతరహావ్యక్తి ప్రత్యక్షమాతాడు. ఆ ఓడ అప్పుడే సౌతాంప్టన్ రేవునుంచి హాలిఫాక్సు వెళ్లడానికి సిద్ధంగా ఉంది. మన వ్యక్తి ప్రత్యక్షం కావడంతో అక్కడ నాలుగువందలమంది నావికులు ఓడలోనుంచి దిగి వెళ్లిపోయారు. బ్రిటిష్ కార్మిక సంఘ నాయకులు కనీసం బాలట్ తీసుకుందాం, ఓట్లు వేసి సమ్మె చెయ్యాలో చెయ్యకూడదో నిర్ణయించుకుందాం అని ప్రార్థించినా వినరు. మొత్తం 1250 మంది నావికుల్లో 400 మంది దిగి వెళ్లిపోయినందువల్ల నౌక నడవలేదు. రేవులోనే నిలిచిపోయింది.

దీనితో యూరప్‌లో నిమార్షల్ ఆర్థిక సహాయ కార్యక్రమానికి సంబంధించిన సరుకులు నిలిచిపోయాయి. సంక్రాంతి బహుమతులు ఓడల్లోనే నిలిచిపోయాయి. యూరప్‌లో జనం ఆకలితో మాడుతున్నారు. ఇప్పటికీ రట్టు చాలదన్నట్లు న్యూయార్కులో ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఉద్యోగులు సమ్మెకట్టారు. సమ్మెకి కారణం ఏదో ఒకటి దొరక్కపోదు. 13 మంది ఉద్యోగులు ఉద్యోగాల కోసం దరఖాస్తులు పెట్టుకున్నప్పుడు దరఖాస్తుపత్రాల్లో పూర్వం తమ నేరాలు తమకు పడ్డ శిక్షలు తెలపకుండా కప్పిపుచ్చారట. ఆ పదముగ్గురినీ ఉద్యోగాలనుంచి తొలగించారు. తొలగించినందుకుగాను సమ్మె చేస్తున్నామన్నారు. ఇటువంటి చోట్ల విషయాల్ని సరిగ్గా పరిశీలించి పరిష్కరించడానికి మధ్యవర్తిత్వాల్ని అమెరికా శాసనాలు ఏర్పాటు చేసే ఉంచాయి. అయినా అటువంటివాటితో నిమిత్తంలేకుండా సమ్మె ఆరంభమయింది. దీనికి ఫలితమేమిటంటే అసలు తగవుకి సంబంధం లేకపోయినా నాలుగు వేలమంది నిరుద్యోగ సంఘంలో చేరారు.

ఒకొక్కప్పుడు చాలా నిస్సహాయస్థితిలో పడిపోతున్నట్లు సమర్థులు వివేకులు అయిన కార్మిక నాయకులే చెప్పారు. సరీగా ఈ సమ్మెలు జరుగుతున్న సమయానికే సర్వ అమెరికన్ కార్మిక సంఘాల సమితి సమావేశమై "ఎవరు బాధ్యతారహితంగా వర్తిస్తున్నప్పటికి కార్మికులు దేశఆర్థికస్థితిని గమనించి దేశానికి ముప్పు తేకూడదని జ్ఞప్తిలో ఉంచుకుని జాగ్రత్తగా ప్రవర్తించాలి"అని ఒక తీర్మానం చేశారు. హక్కు కోరే చోటెల్లా బాధ్యతల్ని కూడా స్మరించాలి అని వారు హెచ్చరించారు. దేశం ఆర్థికదుస్థితినుంచి ముక్తి పొందాలంటే కార్మికులు వస్తూత్పత్తి వృద్ధిపరచడానికే ఇప్పుడు యత్నించాలి అని బ్రిటన్‌లో కార్మిక నాయకులు ప్రకటించారు. ఈ ప్రకటన జరిగిన 48 గంటల్లోనే ఎవరో మన వ్యక్తివంటివాని ప్రోద్బలంపైన అక్కడ సమ్మె ఆరంభమయింది. ఆ తరహా వ్యక్తులవల్ల ప్రమాదం ముఖ్యంగా ఇక్కడే ఉంది. అటువంటివారు చుట్టు ముట్టిస్తారు. అది అంటుకుందంటే కలయచుట్టేసి పొగలు విరచిమ్ముతుంది. ఆ పొగల్లో హేతువాదానికి సబబుకీ, సక్రమవర్తనకీ తావుండదు. దౌర్జన్యాలు విచ్చలవిడిగా చెలరేగిపోతాయి. అందరిలోనూ మత్తు ప్రవేశిస్తుంది. వారు నీతీ నియమం మర్చిపోతారు. ఇటువంటి వాతావరణంలో ప్రజాస్వామ్యం, ప్రజాహితం అంతర్ధానమైపోతాయి. అన్యపక్షాల్ని, అభిప్రాయభేదాల్ని సహించలేనివారు, ఉన్మత్తులైనవారు ప్రబలులౌతారు.

ఇదే రష్యా ప్రాబల్యానికి సంబంధించిన కథ. మనదేశాల స్వాతంత్ర్యంపైన రష్యా ఛాయ ఈ రీతిగా వ్యాపిస్తోంది బోల్షివిక్కులు ధ్వంసం చేసింది జారిస్టు నిరంకుశ పరిపాలనని కాదు. (అది ముందే ఏనాడో చచ్చిపోయింది) పార్లమెంటరీ ప్రభుత్వాన్ని, డెమోక్రసీ, లేక ప్రజాప్రాతినిధ్య పరిపాలనలో సర్వజనులకూ లభించే వ్యక్తిగత పౌరస్వత్వాలను, హక్కులను ఈ బోల్షివిక్కులు ధ్వంసంచేశారు. డ్యూమా అనేపేరుతో వ్యవహరిస్తున్న పార్లమెంటుని, ప్రజాప్రాతినిధ్యసంస్థని అంతంచేశారు. కొద్దిమంది ఒక వర్గంగా ఏర్పడి నియంతృత్వాన్ని స్థాపించి నిరంకుశపరిపాలన చిత్తంవచ్చినట్లు సాగించి రష్యన్ ప్రజ లందరిపైనా పెత్తనం చలాయిస్తున్నారు.

ఈ వర్గానికి ఆరంభంలో ఉన్న బలం సైన్యాలపైనా, మారణాయుధాలపైనా, ఏటంబాంబులపైనా ఆధారపడి లేదు. "ప్రజాశక్తి," "ప్రజాసంస్థ," "ప్రజాతంత్రం" "స్వాతంత్ర్యం," "ప్రజాస్వామ్యం" అని చెవులు చిల్లులుపడేలా నినాదాలు చేస్తూ ప్రజల్లో ద్వేషాలు, కోపం రెచ్చగొట్టి వారిని ఉన్మత్తుల్ని చేసి, "పెట్టుబడిదారులు" "ధనికవర్గాలు" "అభ్యుదయనిరోధకులు" "విప్లవవిరోధులు" "సామ్రాజ్యవాదులు", "ప్రజల్ని పీడించేవారి"పైన కత్తిగట్టించడానికి వారిలో గల సామర్థ్యంపైనే వారి బలం ఆధారపడిఉంది.

ఈ నినాదాల్లో ఏదో మహత్యం ఉంది. ఈమాటల్ని ఏకొద్దిమందో మ్యూనిక్‌లోగాని, మాస్కోలోగాని వార్సాలోగాని, న్యూయార్కులోగాని సౌతాంప్టన్‌లోగాని పలికారంటే ప్రజల్లో అద్భుతమైన సంచలనం కలుగుతుంది. ఈ సంచలనంవల్ల ఫలితమేమిటి? చివరికి ఈ నినాదాల్లో నిబిడమై ఉన్న ప్రజల హక్కులన్నిటినీ వీరికి బలి ఇచ్చెయ్యడం మాత్రమే.

ఈ అల్పవర్గం ప్రతిదేశంలోనూ మంచి బలగం బలం సంపాదిస్తుంది. ప్రభుత్వాన్ని స్వాధీనపరుచుకోవడం మినహా అంతపరపతీ లభిస్తుంది. అధికారాలు, ప్రభుత్వపరిపాలనని స్తంభింపచెయ్యడానికి. ఎలిజబెత్ నౌకలోనుంచి 400 మంది నడిచి వెళ్ళిపోగా" వారి స్థానంలో ప్రభుత్వపు నౌకాదళంలో కొందరిని నియమించరాదా అన్నారు కొందరు (యుద్ధకాలంలో చేసినమాదిరిగా). యూనియన్ ఈసమ్మెకి విరుద్ధంగా ఉన్నప్పటికీ, బ్రిటిష్‌ప్రభుత్వం "ప్రజాప్రభుత్వమే" అయినప్పటికీ, ఆ ప్రభుత్వం ఇటువంటి పనికి పాల్పడలేదు. ఈరీతిగా చేస్తే అధికసంఖ్యాకవర్గాన్ని బలపరచి అల్పసంఖ్యాకవర్గాన్ని నోరునొక్కినట్లు కాగలిగేది.

ఇటువంటి పరిస్థితుల్లో ఈ చెలగాటాల్ని అరికట్టడానికి యూనియన్ నాయకులు శాసనాల్ని తిరగేస్తున్నారు. కాని అసలు వచ్చిన ఇబ్బంది ఏమిటంటే పై తరహావ్యక్తులు యజమానులు కార్మికులమధ్య కంట్రాక్టుల్నే కాదు దేశాల్లో శాసనాల్నికూడా నిశ్చింతగా సులువుగా ఎగరకొట్టి స్వేచ్ఛగా ప్రవర్తిస్తున్నారు. హక్కులతోపాటు బాధ్యతలున్నాయనీ అందరూ ఘోషించడమేగాని ఆ బాధ్యతలేమిటో స్పష్టంగా ఎవరికీ తెలియదు. ప్రజాభిమతంలేని ఏశాసనానికిగాని ఏ రాజ్యాంగానికి బలం లేదనీ, అవి వ్యవహరించలేనివనీ, సరిగ్గా ఎవరూ అర్థంచేసుకోరు.

అయినా ఈ సత్యాన్ని రాజకీయరంగంలో నిరూపించడానికి పాశ్చాత్యదేశాల్లో అనేక తార్కాణాలున్నాయి. దక్షిణామెరికాలో చాలా రిపబ్లిక్కులున్నాయి. అక్కడ రాజ్యాంగాలు రాసినవిచూస్తే అమెరికా రాజ్యాంగంతో తులతూగుతాయి. అక్కడకూడా ప్రెసిడెంట్లని (అధ్యక్షుల్ని) ప్రజలే ఎన్నుకోవాలి. ప్రజలే తొలగించడానికి వీలుంది. అయితే అది వాస్తవంగా ఎన్ని రిపబ్లిక్కుల్లో ఆచరణలో ఉందనేది సందేహం.

"మీ రాజ్యాంగం ఉన్నాసరే ఊడినాసరే నేనే మీ పరిపాలకుణ్ణి. నాకు సైన్యం అండ ఉంది"అని అమెరికాలో ఏ అధ్యక్షుడూ అనలేకపోయాడు. దక్షిణామెరికాదేశాల్లో ప్రతి ఆరునెల్లకీ సైన్యబలం చూపి ప్రభుత్వం హస్తగతం చేసుకున్న వృత్తాంతాలు తెలుస్తూనే ఉంటాయి. అది అమెరికాలో ఎందుకు జరగదు?

ప్రజల్లో ద్వేషాలు, అంతఃకలహాలు, శాసనధిక్కారం రెచ్చగొట్టే పై తరహావ్యక్తులు అమెరికాలో కార్మికరంగంలో ఉన్నట్లే దక్షిణామెరికాలో రాజకీయరంగంలో ఉన్నారన్న మాట.

ఇంగ్లీషు మాతృభాషగా వాడబడుతున్న దేశాల్లో ఇప్పుడొక కొత్త సమస్య వచ్చిపడింది. మన రాజ్యాంగాల్లో - వాటిని ధనికవర్గాలవారి రాజ్యాంగం కానివ్వండి, సోషలిస్టుల రాజ్యాంగం కానివ్వండి—విజ్ఞానశాస్త్రం, పరిశ్రమాభివృద్ధి, కార్మిక సమస్యలు ప్రధానంగాగల ప్రస్తుత కాలానికి అనుగుణంగా దేశంలో ఆర్థికవ్యవస్థనీ, సమాజవ్యవస్థనీ ప్రభుత్వాలు నియమబద్ధంగా నడపడానికి వీలుగా ఉండేటట్లు చెయ్యాలి. పైతరహా వ్యక్తుల్ని, ఆ వ్యక్తులవల్ల రెచ్చగొట్టబడేవారినీ అణచగలుగుతారా లేరా అనేదే ప్రశ్న.

పెద్ద పరివర్తనలు పొందిన మన తరం లోకంలో వ్యక్తిగత బాధ్యతల్ని గుర్తింపచేసి సక్రమవర్తన అలవరింపచెయ్యజాలక పోతున్నట్లయితే, పరివర్తనల ఆంతర్యాన్ని మనం గుర్తించలేదన్నమాట. మనతాతల కాలంలో స్వయం సమృద్ధిగా మసిలిన పట్టణాలలోనూ దేశాలలోనూ, నిరుద్యోగం, అనవసరవస్తూత్పత్తి, అధికోత్పత్తి అనేది ప్రజల్ని బాధించలేదు.

(18-వ పేజీ చూడుడు)

పౌరుషప్రతాపాలకూ ధర్మనిరతికీ లోకఖ్యాతి

హిందూజాతి ఆత్మగౌరవాన్ని, సభ్యతావిజ్ఞానాలనూ

ప్రపంచంలో ఎక్కడా ఇంత విశాల ప్రదేశంలో (125 వేల చతురపు మైళ్లు) ఇన్ని రాజ్యాంగ సంస్కరణలు ఇంత వేగంగా ఒకదానివెంట ఒకటి ప్రవేశపెట్టబడలేదు. రాజపుత్రస్థానంలో ఏవో మార్పులు కలుగుతాయన్న భావం మొదట అస్పష్టంగా ఉండేది. తీరా బయలుదేరి వెళ్లి చూశాను. ఇంత చకచకా మార్పులు వస్తున్నాయని కనిపెట్టలేక పోయాను.

మార్చి 30 తరవాత ఈ ప్రాంతాన్ని పూర్వపు గౌరవనామంతోనే రాజపుత్రస్థానం అనే పేరుతోనే వ్యవహరించడం అనుచితంగా కనిపిస్తోంది. ఎక్కడింకెంతమాత్రం మహారాజులకు తావు లేదు. రాజపుత్రుల పరిపాలన ఇంకెంతమాత్రం ఉండబోదు. జనసంఖ్యాధిక్యత ప్రాతినిధ్య పరిపాలనలో రాజపుత్రులు అల్పసంఖ్యాకులైపోతారు. వారిని వినేవారుండరు. శతాబ్దాలుగా ఈ రాజ్యాల్ని పరిపాలిస్తున్న రాజపుత్రులు పాలనాధికారాన్ని బ్రాహ్మణులకు, వైశ్యులకు, భిల్లులకు ఒప్పగించాలింక.

మార్చి 30 తో రాజపుత్రస్థానంనుంచి రాజపుత్రుల ప్రాబల్యం తొలగిపోయినట్లే. అది రాజపుత్రులకు తెలుసును. ముందేమి కానున్నదో అని అందరూ భయంతో నిరీక్షిస్తున్నారు. కాలానుగుణంగా వారు వర్తించనందువల్ల ఈ పరిణామం అకస్మాత్తుగా సంభవించక తీరదన్న మాట నిజమే. పూర్వ ఆచారాలు, శతాబ్దాలనుంచి ఆచరణసిద్ధమై చరిత్రలో ప్రశంసాపాత్రమైన ధీర లక్షణాలు రాజపుత్రజీవనవిధానం, వారి వీర సాహిత్యంలో ఎంతగా మెరుగుపెట్టబడినప్పటికీ ఈనాడు, అవే అందరినోటా అవహేళనా పాత్రమైనాయి.

అవి రాజపుత్రులకే ఈనాడు సిగ్గుచేటుగా ఉన్నాయి. ధీరోదాత్తులు, మహావీరులు అయిన రాజపుత్రులలో పూర్వాచారసంప్రదాయం కర్పూరంవలె అంతరించిపోతోంది. అది వారికి మన్ననగానీ అగౌరవంకానీ ప్రస్తుతం సంభవిస్తున్నదదే. అధునాతన శాసన వాతావరణంలో జమీందారీ విధానం నిలవలేక అంతరించిపోతోంది. నిత్యం దాడి ప్రమాదాల నెదుర్కొనే రోజుల్లో స్థిరపడిన పరిపాలనా యంత్రాంగం ఈనాటి శాంతివాతావరణంలో పేక ఇల్లులాగా మారిపోతుంటే వింతిగానే ఉంది. కాని అదెందువల్లనో అందరికీ తెలిసినదే.

ఇతర సంస్థాన కూటాలకీ రాజపుత్ర సంస్థాన కూటమికీ చాలా వ్యత్యాసాలున్నాయి. వీనివల్లనే ఈ కూటమికి రాజధానిని ఎంచడంలోనూ భారతప్రభుత్వ సంస్కరణల శాఖతో ఒడంబడికకు పత్రం రచించడంలోనూ ఇంత జాప్యం అయింది ఇన్ని చిక్కులు సంభవించాయి. రాజధాని ఎంచబడకముందు రాజపుత్రస్థానం అంతా తిరిగి చూశాను: రయిళ్లలో విమానంలో, రైళ్లలో, కార్లలో. ఒంటెలపైన ప్రయాణం చేశాను. జైసాల్మీర్ సంస్థానంలో ఇసుకమైదానాలు, బికనీర్‌లో స్థిరంలేకుండా గాలి దుమారంతో ఒకచోటనుంచి మరొకచోటికి బీభత్సంగా తరలిపోయే ఇసుకగుట్టలు, జోద్‌పూర్‌లో వివిధరకాల నేల, పల్లెపట్టులు, ఉదయపూర్‌లో పర్వతమయప్రాంతాలు, జయపూర్‌లో ఇసుక ఎడారులు తిరిగాను. రాజపుత్రులతో, మహారాజులతో, ప్రధానులతో, మంత్రులతో, రైతులతో మాట్లాడాను. రాజధానీనగరాన్నిబట్టే రాజపుత్రరాజ్యకూటమిభవిష్యత్తు ఆధారపడివుంటుందని గ్రహించాను. వీనికి తోడు జయపూర్, జోద్‌పూర్, ఉదయపూర్ రాణాల మధ్య పోటీలు తోడైనాయి. చివరకు జయపూర్ రాజధానీనగరంగా ఎంచబడింది.

ఈ విషయమై నిర్ణయం కాకముందు మహారాణాలతో నేను మాట్లాడాను. రాజప్రముఖుడైన జయపూరు మహారాణా సర్వవిధాలా తన నగరమే సౌకర్యమైనదన్నారు.

ఉదయపూర్ మహారాణా

ఉదయపూర్ మహారాణా అంతఃపురంలో సంభాషణ నేను మర్చిపోలేను. మహారాణా చిన్న సింహాసనంపైన కూర్చున్నారు. అంతఃపురం బహుపురాతనమైనది. పురాతనభవనాల్ని విడిచిపెట్టకుండా వాడుతున్నది రాజపుత్రస్థానంలోకల్లా ఇక్కడొక్కచోటే. మిగతా రాజులు ఆధునికరీతుల క్రొత్త భవనాలు నిర్మించుకున్నారు.

ఉదయపూర్ భవనంలో మహారాణాగారి దర్శనంకోసం వెళ్లడానికి చాలా మేడమెట్లు ఎక్కివెళ్లాలి. ఇరుకు సన్నవరండా చీకటి దారులు గడిచి వెళ్లాలి. ఈ వరండాలలో మహారాణాగారి భటులు కాపలా ఉంటారు. ఉదయపురంలో కాలం నిద్రపోతున్నట్లుంటుంది.

రాజధాని నగరంగురించి ఉదయపూర్ మహారాణా చాలా తీవ్రంగా చెప్పారు. "నా రాజధానీ నగరాన్ని నాశనంచెయ్యాలని చూస్తున్నారు. నావారందరికే చాలా కోపంగా ఉంది. అన్ని విషయాల్లోనూ లొంగిపోతున్నానని నిందిస్తున్నారు" అన్నారు.

జోద్‌పూర్ విషయమై అక్కడి ప్రధాన మంత్రి జైనారాయణ వ్యాస్ గారు వాదించారు.

శ్రీ వ్యాస్ ఎప్పుడూ నవ్వుతూ ఉంటారు. ఎంత చిక్కులో ఉన్నా నవ్వుతూ ఉండడంవల్లనే రాజపుత్రస్థానంలో వీరికి ఇంత ప్రజానురాగం ఉందనిపించింది.

జయపురంవారి ప్రతిభ వెలిగించడానికి యత్నిస్తున్నారని ఉదయపురంవారు నిందించారు.

జయపూర్ రాజధానీనగరం, జయపూర్ మహారాణా రాజప్రముఖులు, జయపూర్ ప్రధానమంత్రి రాజపుత్రస్థానకూటానికి ప్రధానమంత్రి, జయపూర్ దివాన్ రాజ్యకూటమి పరిపాలనకి ప్రభుత్వ సలహాదారు. జయపూర్ విశ్వవిద్యాలయం రాజపుత్రస్థానానికి విశ్వవిద్యాలయం. ఇదంతా ఏమిటి? ఇది రాజపుత్రస్థాన రాజ్యకూటమి అంటారా, జయపూర్ రాజకూటం అంటారా అని ఒక ప్రముఖుడు నాతో అన్నారు.

జయపూర్ మహారాజాగారన్నారు: "నేను రాజప్రముఖుడినైన మాట నిజమే. కాని నాజీవితాంతంలోవరకే కదా. నా అనంతరం నా వారసులకది సంక్రమించదు. మా ప్రధాని ఉంటే ఒక సంవత్సరం ఉంటారు. తరవాత వెళ్ళిపోతాడు. పార్టీ తల్చుకుంటే ఆయన్ని ఎప్పుడైనా తొలగించవచ్చును." అన్నారు.

జయపూర్ నగరం

జయపూర్‌నే రాజధానిగా ఎంచడం న్యాయమైంది ఈనగరాన్ని రెండువందల సంవత్సరాలక్రింద మహారాజా జయసింగ్ నిర్మించారు. నగరనిర్మాణంలో ఈనాడు కూడా భారతదేశంలో ఏ నగరానికీ ఇది తీసిపోదు. ఈ నగరాన్ని నిర్మించేముందు మహారాజా జయసింగ్ ప్రపంచంలోని ప్రసిద్ధనగరాల నిర్మాణ విధానం పరిశీలించినారు. నగరనిర్మాణానికి ఈనాటికీ జయపూర్ ఆదర్శప్రాయమైనదని ఒకప్పుడు పండిట్ నెహ్రూ అన్నారు. నగర వీధులు విశాలమైనవి. పరిశుభ్రంగా ఉంటాయి. ప్రభుత్వకార్యాలయాలు నెలకొల్పడానికి చక్కని భవనాలున్నాయి. నగరం విస్తరించడానికి అపారావకాశాలున్నాయి.

జోద్‌పూర్ నగరంకూడా పరిశుభ్రంగానే ఉంటుంది. అది 500 సంవత్సరాల క్రిందట నిర్మించబడిన నగరం. ఇప్పటి మహారాణా తండ్రి కోటి 30 లక్షల రూపాయల ఖర్చుతో ఉమేద్‌భవన మనే బ్రహ్మాండమైన భవనం నిర్మించారు. 213 గదులతో 6,64,000 చ|| అ|| భూమిపైన నిర్మించబడిన ఈ భవనం అతిసుందరమైనది. ఉదయపూర్ నగరం అంత మంచిది కాకపోయినా ఆరావళీ పర్వతాలచాటున ఉన్నందువల్ల వాతావరణం సుఖప్రదంగా ఉంటుంది.

భారతదేశంలో మహారాణా ప్రతాపసింహుని గురించి తెలియనివారుండరు. ఆ మహామహుని నగరం ఉదయపూర్. బ్రిటిష్‌వారికిగాని, మొగల్ సామ్రాజ్యవాదులకుగాని లొంగని మహావీరుడు రాణాప్రతాపుని గౌరవార్థం ఉదయపూర్‌ను రాజధానిగా చెయ్యాలని ఆ నగరవాసులు కోరారు. రాజధానీనగరంగురించి రాజపుత్రస్థానం అంతటా తీవ్రవాదోపవాదాలు బయలుదేరాయి. జయపూర్‌ను రాజధానిగా ఎంచినందుకు చాలమందికి అసంతృప్తి కలిగింది.

భారత ప్రభుత్వంతో ఒడంబడికపత్రం వ్రాయడంలో ఉదయపూర్ మహారాణా కొన్ని అభ్యంతరాలు తెలిపి చివరకు సంతకం పెట్టారు. రాజపుత్రస్థానంలోకల్లా ఉదయపూర్ అగ్రస్థానం వహించిందని అందరూ అంగీకరించినదే. వారినే ప్రధానపదవిలో ఉంచడానికి అందరూ అంగీకరించారు. అయితే మహారాజప్రముఖ్ అనే పేరుమాత్రం ఉదయపూర్ మహారాణాగారికి నచ్చలేదు. ఆ పేరులో కార్యనిర్వహణబాధ్యత ఇమిడిఉన్నందువల్ల అది ఆయనకు గిట్టలేదు. రాజపుత్రస్థానంలో సైన్యాలపై సర్వాధికారం తన చేతులనుండి పోకూడదని కూడా ఆయన పట్టుబట్టారు. రాజపుత్రస్థానంలోని వివిధరాజ్యాల సైన్యాలను ఏకాధిపత్యంక్రిందికి తెస్తేగాని శత్రులు ప్రబలగలరని జయపూర్ మహారాజాకూడా అన్నారు.

పూర్వ ఔన్నత్యం

రాజపుత్రస్థాన రాజ్యకూట నిర్మాణంతో భరతవర్షంలో పురాతనకాలంనుంచీ వస్తున్న ఒక పరిపాలకుల శకం అంతరించిందన్నమాట. రామాయణ మహాభారతేతిహాసాలు వారి పూర్వుల చరిత్రలు. సూర్యచంద్రులు రాజపుత్రవీరుల వంశాలకు మూలపురుషులని చెప్పుకుంటారు. రామాయణ వీరుడు రామచంద్రుడు సూర్యవంశజుడు. మహాభారత వీరులు ధర్మరాజాదులు చంద్రవంశజులు. భారతవర్ష చరిత్రకు మూలధారమైన ఈ ఉభయవంశాలు క్రీస్తుశకానికి పూర్వం రెండు వేలేళ్లకు పైగా స్థాపించబడినాయి.

భారతవర్షంలో ప్రప్రథమంగా నిర్మించబడిన అయోధ్యానగరం సూర్యవంశజులది. ఆ నగరం రామచంద్రుని కాలానికి పూర్వమే లోకప్రసిద్ధి పొందింది. ఈ నగరాన్ని మనువు నిర్మించినట్లు వాల్మీకి వ్రాశారు. క్రమరీతిలో నిర్మించబడిన రాజమార్గాలు, జలాశయాలున్నవనీ, సుందర ఉద్యానవనాలతో, సింహద్వారాలతో, శోభాయమానంగా ఉండే సుందరభవనాలు, అంతఃపురాలు నిర్మించబడినాయనీ అందులో వ్రాశాడు. వర్తకులు, రాజకుమారులు, సైనికులు, రథికులు, రథాలు ఏనుగులు విదేశరాయబారులతో నగరం కిటకిటలాడుతూ ఉండేదట. ఇప్పటి లక్నో నగరం అయోధ్యానగరానికి చేరువపల్లె అంటారు. చంద్రవంశజులు నిర్మించిన నగరాలు మధుర, ప్రయాగ మొదలైనవి. యదువంశజులు (శ్రీకృష్ణుని వంశం) ద్వారక మొదలైనవి నిర్మించారు.

ఉదయపూర్, జయపూర్, జోధ్‌పూర్, బికనీర్ రాజవంశాలు సూర్యవంశాలు. జైసాల్మీర్ రాజవంశం చంద్రవంశం. ఉదయపూర్ రాజవంశం రామచంద్రుని వంశానికి చెందినదని హిందూలోకం యావత్తూ అంగీకరిస్తుంది. అందువల్లనే ఉదయపుర రాజరికానికీ ఉదయపుర సింహాసనానికీ హిందువులు భక్తిప్రపత్తులు చూపుతారు. విదేశీయుల దండయాత్రలవల్ల ఆ వంశపు రాజపుత్రులు స్వస్థానం విడిచి ఆరావళీపర్వతప్రాంతంలో ఈ రాజ్యాన్ని స్థాపించారు. జైసాల్మీర్ మినహా ఉదయపూర్ రాజులవలె మరే రాజ్యమూ తొమ్మిది శతాబ్దాలు పరరాజులకు తలొగ్గకుండా నిలిచినది లేదు. గజనీ మహమ్మదు దండయాత్ర వచ్చినప్పుడు ఉదయపూర్ రాజ్యం ఎంత ఉందో ఈ నాటికీ అంతే వైశాల్యం కలిగి ఉంది. ఉదయపూర్ రాజవంశానికి మేవార్ అనే మరొక పేరుంది.

జైసాల్మీర్ రాజులు పట్టుదలతో ఎడారికే అంటిపెట్టుకుని ఉన్నారు. కాని ఒకప్పుడు వారి రాజ్యం ఇప్పటికంటె విశాలంగా ఉండేది. జైసాల్మీర్ దుర్గంపై ఇప్పటికీ శిలాఛత్రం ఒకటి



రాజాస్థాన్ సంస్థానసమాఖ్య రాజప్రముఖ్ జయపూర్ మహారాజా, సంస్థాన శాఖామంత్రి సర్దార్ పటేల్.

పొందిన రాజపుత్రుల శకం నేటితో సమాప్తి

సంరక్షించిన దేశంలో నూత్నయుగం ప్రారంభం

[పౌరుషప్రతాపాలకూ, ధర్మనిరతికీ లోకఖ్యాతి గడించి హిందూజాతి సభ్యతావిజ్ఞానాలను ప్రతిమా శిల్ప, చిత్రలేఖనాదికళలను అనేకశతాబ్దాలుగా కాపాడిన రాజపుత్రవీరుల దేశంలో 1949 ఏప్రిల్ 1 తేదీనుంచి నూత్నశకం ప్రారంభమవుతున్నది. జయపూర్ రాజనగరంగా విశాలరాజపుత్రస్థాన రాజ్యకూటం సర్దార్ పటేల్‌చే ప్రారంభించబడింది. రాజపుత్రస్థాన మంతటినీ ఏకచ్ఛత్రాధిపత్యంక్రిందికి తేవలెనని మహారాణా ప్రతాపసింహుడు కన్న స్వప్నాలు నేడు రూపొందినా యని పటేల్ అన్నారు. అయితే ఆ మహావీరుడు కన్న కలలకీ ప్రస్తుత రాజ్యకూటానికీ పోలికైనా లేదు. కాలధర్మాన్నిబట్టి అది కొనసాగదు. ఈ నూత్నవ్యవస్థలో పూర్వ వైభవ చిహ్నాలను నేటికీ మరువలేని రాజపుత్రజాతి కొత్త సమస్యల నెదుర్కొంటున్నది. పరిస్థితుల కనుగుణంగా పరిణామం రావడానికి వ్యవధి పట్టుతుం దని చెప్తూ స్టేట్స్‌మన్ పత్రికలో ఒక వ్యాసకర్త వ్రాసిన వ్యాసాంశాలు ఇక్కడ ఇవ్వబడినాయి.]

ఉంది. గోవర్ధనగిరిధారుడైన శ్రీ కృష్ణుని రాజాధికారానికి వారసత్వం పొందినట్లు ఇది సూచిస్తుంది. జోధ్‌పూర్, బికనీర్ రాజవంశాలు ఉత్తరోత్తరా స్థాపించబడినవి. ముస్లిం దండయాత్రలవల్ల స్థానభ్రష్టులై వీరు వచ్చి రాజపుత్రస్థానంలో వచ్చి చేరారు.

ఒక విషయంమాత్రం స్పష్టమే. ఈరాజులు మధ్యంతరంగా వచ్చి వెలిసినవారు కారు. మొగల్ సామ్రాజ్యం విచ్ఛిన్నమైన తరువాత ఏర్పడిన రాజ్యాలు కావు. వీరు భరతవర్షానికి కీర్తి ప్రశస్తులు ఆర్జించిపెట్టిన పురాతన ఉత్తమ వంశాలకు చెందినవారు. వారిపైన భారతదేశ చరిత్ర, సంప్రదాయం నిర్మించబడినాయి. వారి చరిత్రను ముస్లైన అనేకులు కావ్యాలు రచించారు. దేశాన్ని పరహస్తాలనుండి రక్షించడానికి వారి ఆదేశాన్ని లక్షలాది భారతీయులు పాలించి దేశభక్తితో ప్రాణార్పణచేశారు ఇన్ని శతాబ్దులుగా ప్రజల భక్తిప్రేమలను చూరగొన్న రాజవంశాలు మరెక్కడా లేవు. ఒక్కసారిగా రాజపుత్రస్థానంలో వారి ప్రభావం మాయమవడం చప్పరించి వెయ్యదగింది కాదు. అది ఒక మహత్తరయుగానికి భరతవాక్యం అన్నమాట. మరొక మహత్తరయుగం ప్రారభం కానున్నదని ఇప్పుడు చెప్పలేముకదా!

యుగధర్మం

ముస్లిం దాడి మూకల్ని ఎదిరించి నిరోధించ గలిగిన మహావీరులు, 130 సంవత్సరాల బ్రిటిష్ ఆధిపాలనలోకూడా అంతమొందని రాజవంశజులు, ఈనాడు స్వతంత్ర భారతదేశం ఆప్యాయంగా చెప్పే అనునయవాక్యాల్ని ఆలకించి సింహాసనాలు త్యజించి అద్భుతత్యాగం చేస్తున్నారు. రాజకీయాల్లో ఈ మెత్తదనానికి హేతు వేమిటని అనేకమంది రాజపుత్రరాజుల్ని ప్రశ్నించారు. ఒకరు కనుబొమలు చిట్లించి అన్నారు: "భారతదేశాన్ని కాపాడినవాళ్లం మేము. అదే చరిత్రసిద్ధమైన మా కర్తవ్యం. ఇప్పుడు రాజ్యాధికారాన్ని విడిచిపెట్టి దేశానికి సేవ చేయవచ్చునని మాకు చెప్తున్నారు. అందువల్ల వెంటనే మేము అధికారం త్యజిస్తున్నాం".

మరొక రాజు భిన్నంగా చెప్పారు: "నే నెంతకాలమో నిరోధించలేనని నాకు తెలుసును. నిరోధించడానికైనా రాజపుత్ర రాజులందరూ ఏకమయితే వీలుపడేది. కాని మాలో ఐకమత్యం లేదు. ఇదీ గాక కొన్ని రాజ్యాల్లో ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వాలు భగ్నమైపోయినాయి. ఆ రాజ్యాల్లో రాజులు నిరోధించాలన్నా వారికి బలం లేదు."

చరిత్రప్రసిద్ధి కెక్కిన రాజపుత్రశౌర్యం, ఔదారత మొదలైన సద్గుణాలు క్రమంగా రాజపుత్రుల్లో క్షీణించి పోయినందువల్లనే రాజపుత్రులు పతనమైనారని ఒక జాగీర్దారు నాతో చెప్పారు. నూరేళ్లక్రిందట రాజపుత్రస్థానచరిత్ర రచించిన కల్నల్ జేమ్స్ టాడ్ ఈ పతనం వస్తుందని జోస్యం చెప్పారు. రాజపుత్రస్థానంలో ఎవ్వరూ జోక్యం చేసుకోవద్దని అప్పుడు టాడ్ విజ్ఞప్తి చేశాడు. గుణగణాలలో రాజపుత్రప్రకృతికి పూర్తిగా విరుద్ధమైన ప్రకృతిగలవారు, బలవత్తరులు, అయిన విదేశీయులు యుద్ధకాలంలో వారి సైన్యాల్ని వాడుకుని, శాంతిసమయంలో వారిమధ్య తగవులు తీరుస్తే ఇంక ఆ రాజపుత్రుల గతి ఏమవుతుందో టాడ్‌కి తెలుసును.

రాజపుత్రస్థానంలో బ్రిటిష్ వారు సర్వస్వారాన్ని హరించి రాజులనే పిప్పి పిడిచిపెట్టారని ఒక రాజ్యంలో దివాన్ నాతో నిర్మొగమాటంగా అన్నాడు.

రాజపుత్రుల మహోన్నతి ఈనాడు వేదవడిపోయింది. క్రమంగా ఆ జాతిఛాయలుకూడా అంతరిస్తున్నాయి. కొద్ది మాసాలక్రింద ఉదయపూర్ మహారాణా అంతఃపురములోనికి ఎవరూ శిరసెత్తి వెళ్లడానికి జంకేవారు. ఇప్పుడు నిర్భయంగా శిరస్సుపైన ఏమీ ధరించనైనా ధరించకుండా వెళ్లినా అడిగేవారు లేరు. ఆ అధికారం, గౌరవం, దర్పం మాయమైపోయాయి. నామాదిరిగానే ఇప్పుడు ఇతరులు కూడా చేస్తున్నారు. రాజపుత్ర మహోన్నతి అంతరించినట్లే.

జాగీర్దార్లు

రాజపుత్రస్థానంలో అంతర్గానమవుతున్నది రాజపుత్రరాజులే కాదు జాగీర్దార్లు కూడా. దీనితో రాజపుత్రజాతిప్రాబల్యం పూర్తిగా అంతమైపోతోంది.

రాజు నీడనిచ్చే శిబిర మనీ, శిబిరం నిలపడానికి లాగికట్టే తాళ్లు జాగీర్దార్లనీ ఒక సామెత ఉంది. అది బికనీర్‌లో విన్నాను. రాజులు జాగీర్దార్లు పరస్పరం ఏరీతిగా ఆధారపడిఉన్నారో ఈ సామెత స్పష్టపరుస్తుంది. జాగీర్దారు ఎంత వినయ విధేయతలతో విశ్వాసంతో రాజుకి సేవచేస్తాడో, జాగీర్దారుని రక్షించడానికి రాజు అంత బాధ్యుడు. పరస్పరం ఆధారపడి ఉన్నారు కాబట్టి ఈ ఉభయవర్గాల పద్ధతీ 18 వ శతాబ్దం వరకూ చక్కగా నెరవేరింది. రాజ్యాలకు నిత్యం ప్రమాదం ఉంటున్నందువల్ల రాజు నాయకత్వంకింద సామంతు లందరూ స్వదేశరక్షణకుగాను ఏకమయ్యేవారు. జాగీర్దార్లను మన్నించి గౌరవించడం రాజుల విధి అయింది. శాంతి దీర్ఘకాలం ఉన్నప్పుడెల్ల ఈ పరిస్థితి చెడేది. రాజులు స్వంతసైన్యంపైన అధికంగా ఆధారపడిఉండేవారు. సామంతుల సైన్యాలపైన అప్పుడు ఆధారపడేవారుకాదు. సామంతుల సైన్యసహాయం అక్కరలేనిచోట సామంతులు కప్పం కట్టవలసివచ్చేది.

ఈనాడుకూడా జాగీర్దార్లు బలవంతులే. బికనీర్ రాజ్యంలో నాలుగింట మూడు వంతులు భూమి జాగీర్దార్ల అధీనంలో ఉంది. జోధ్‌పూర్‌లో నూరింట 87 వంతులు భూమి వారిదే. ఇతర సంస్థానాల్లో ఎక్కడా నూటికి 60 వంతులు తక్కువ కాకుండా వీరి అధీనంలో ఉంది

కొందరు పెద్ద జాగీర్దార్లకి రాజ్యాధికారాలు కూడా ఉన్నాయి. న్యాయపరిపాలనాధికారాలు కూడా ఉన్నాయి. వారికి స్వంత పోలీసు దళాలున్నాయి. పన్నులు వసూలుచేసే అధికారాలున్నాయి. మహారాజా ప్రత్యేక ఉత్తరువుపైన కాని వారి హత్యానేరంపైన కూడా అరెస్టు చెయ్యడానికి వీలులేదు. వారిని సామాన్యన్యాయస్థానాల్లో విచారించడానికి వీల్లేదు.

జాగీర్దార్లను గురించి అభిప్రాయభేదాలున్నాయి. జయపూర్‌లో వారసత్వంవల్ల జాగీర్లు సంక్రమిస్తాయి. వీరు రాజుకి కప్పం కట్టుతూ సాలీనా రాజు కోరినంత సైన్యం ఏర్పాటు చెయ్యాలి. రాజు రమ్మన్నప్పుడు రావాలి. కొందరు జాగీర్దార్లు రాజుతో సమానులనీ, రాజుల కెన్ని అధికారాలున్నాయో, అన్ని అధికారాలు, స్వాతంత్ర్యం తమకు తమ ప్రాంతాల్లో ఉన్నాయనీ భావిస్తారు. రాజులకు బంధువులై రాజ్యసంపాదనలో తోడ్పడినందువల్ల రాజ్యంలో భాగంగా జాగీరును అనుభవిస్తున్నామని కొందరనుకుంటారు.

రాజపుత్రసంస్థానా లన్నిటిలోను రాజులకు జాగీర్దార్లు బంధువులే. రాజు దానంచేసినందువల్ల కాక ఆదిలో రాజ్యం జయించినవారి వంశానికి చెందినందువల్ల సమానరాజ్యాధికారం పొంది జాగీర్లు అనుభవిస్తున్నట్లు కొందరనుకుంటారు.

కొందరు యుద్ధాల్లో శౌర్యం చూపి రాజు ప్రసన్నత పొంది తత్ఫలితంగా జాగీర్లు బహుమతిగా పొందినవారు. ఏది ఏమైనప్పటికీ రాజుల బలాన్నిబట్టి జాగీర్ల అధికారాలు మారుతూవచ్చాయి. మొగల్ సామ్రాజ్యం విచ్ఛిన్నమైన తరువాత రాజుల దౌర్బల్యాన్ని ఆధారంగా చేసుకొని కొందరు సామంతులు తమ అధికారాలు ప్రాబల్యం పెంచుకున్నారు.

బ్రిటిష్ ప్రభుత్వం స్థిరపడగానే ఈ పద్ధతి ఆగిపోయింది. బ్రిటిష్ రెసిడెంటు జాగీర్దార్లకు ఏయే అధికారాలున్నాయో నిర్ణయించి పరిమితం చేశారు. వారి దేశభక్తిని పొగిడి బ్రిటిష్ వారు జాగీర్దార్ల ప్రాబల్యం తగ్గించడానికి కృషిచేశారు. బలప్రయోగం అవసరం లేకుండానే అది నెరవేరింది. ఇదే పద్ధతి ఇప్పుడు భారత ప్రభుత్వపు సంస్థానాలశాఖ రాజులపై ప్రయోగించి సాధించింది. కాని ఆ కాలంలో సామంతులకు దాదాపు బ్రిటిష్‌ప్రభుత్వం వారి అధికారాలన్నిటినీ వారికి వదిలి రాజులతో తగవులు వచ్చినప్పుడు పరిష్కర్తలుగా వ్యవహరించారు.

ఇంతవరకూ రాజ్యంలో విద్య, పోలీసు, సైన్యం, న్యాయవిచారణ మొదలైన విషయాలన్నిటినీ సామంతులే నిర్వహిస్తూవచ్చారు. మహారాజుకే చింతా బెంగా లేదు. పరిపాలన అంతా ఏ ప్రాంతాన్ని ఆ ప్రాంతం స్వయంగా నిర్వహించుకునేది. ఈ పద్ధతి ఇప్పుడు మారిపోతుంది. పరిపాలన అంతా ఒక కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. నూత్నవ్యవస్థలో ప్రజలు అలవాటుపడ్డానికి వ్యవధి తీసుకోవచ్చును.

నేను దర్శించిన రాజ్యాలలో జాగీర్దార్ల సమస్య పరిష్కరించడానికి అందరూ హడావిడిగా ఉన్నారు. జాగీర్దార్ల అధికారాలు చాలావరకు తగ్గించడానికి ఇప్పటికే ప్రస్తుతం ఉన్న రాజస్థాన్ కూటమి కృషి చేసింది.

వివిధరాజ్యాల్లో కాంగ్రెస్ సంస్థలు సంస్కరణ విషయంలో ఒకే పంథాలో నడుస్తున్నాయి. జాగీర్దార్లకి రైతులపైగల అధికారాల్ని తొలగించి, ప్రభుత్వమే స్వయంగా రైతులవద్ద పన్నులు వసూలుచేసి, ఖర్చులు వగైరా మినహాయించి మిగిలినదానిలో పదోవంతును వారికివ్వాలని కొందరు వాదిస్తున్నారు. చివరికి జాగీర్దార్లని పెన్షనర్లుగా చేస్తారు. ఇందుకు ప్రభుత్వం చెల్లించవలసిన పరిహారం ఆశ్లే ఉండదనుకుంటున్నారు.

అకస్మాత్తుగా జరుగుతున్న ఈమార్పులకి జాగీర్దార్లు కలవరపడుతున్నారు. ఇంతవరకూ రాజుల ఆదరాలపైనే ఆధారపడిన జాగీర్దార్లు ఇకనుంచి రాజకీయపక్షాల వాగ్వివాదాలకు లోను కానున్నారు. రాజకీయ తంత్రాల

(21 వ పేజీ చూడుడు)



రాజస్థాన్ సమాఖ్య రాజప్రముఖ్ చేత సర్దార్ పటేల్ రాజప్రమాణము స్వీకరింపచేయుట.

మద్రాసు ప్రభుత్వపు బడ్జెట్

శ్రీ వి. యస్. మూర్తి

ప్రభుత్వముకూడ ఒక సంస్థయే. తద్వ్యవహారములు నిర్వహించుటకు ప్రత్యేక కుటుంబములకు ధన మెంత యావశ్యకమో ప్రభుత్వమునకు కూడ అంతియే ఆవశ్యకము. సామాన్య మానవులు వర్తకము చేసియో లేక ఏదైన వృత్తుల నవలంబించియో ధనము గడింతురు. కాని ప్రభుత్వమునకు వృత్తి యేది? అంతే కాక లాభదాయకమగు వర్తకముకూడ ప్రభుత్వము చేయరాదను నొక సిద్ధాంతము కూడ కలదు. అందుచే ప్రభుత్వము తమ ఖర్చు నిమిత్తము ప్రజలపై పన్నులను విధించి ధనము వసూలు చేయును.

అయిన ప్రభుత్వముయొక్క ధనము ప్రజలను పీడించి తీసికొని నదన్నమాట. ఈ ఉద్దేశ్యము ననుసరించియే ఒక ఆర్థికశాస్త్రవేత్త "ప్రభుత్వము ప్రజలపై పన్నులను సాధ్యమైనంత తక్కువగా విధించుటయే కాక ఆ ధనము నత్యవసరములగు కార్యములపైననే ఖర్చుపెట్టవలె" నని తన యభిప్రాయము వెల్లడించియున్నాడు.

కాని రానురాను పరిస్థితులు మారినవి. ప్రభుత్వము సంఘము నుచ్చస్థితికి తీసికొనివచ్చుటకు కొన్ని నిబంధన లేర్పరచిరి. అందుచే ప్రభుత్వము బాధ్యతలు వాని ననుసరించి ఖర్చులుకూడ అధికమైనవి. ప్రస్తుతము పైసూత్రమును రాజకీయజ్ఞు లంతగా పాటించుట లేదు. ప్రతి ప్రభుత్వముయొక్క బడ్జెట్టు కూడ అధికమగు ఆయవ్యయముల నే కలిగియున్నది.

ఇంతమాత్రమున ప్రభుత్వము పన్నులను విధించుటలోను, వాటిని వ్యయపరచుటలోను పాటింపవలసిన ఆర్థిక రాజకీయ సూత్రములు లేవని చెప్పుటకు వీలులేదు. సంఘమును ఉచ్చస్థితికి తీసికొనివచ్చి తత్పురోభివృద్ధికి సాయపడుట ప్రభుత్వమునకు ముఖ్యమగు బాధ్యత. దానిని దృష్టియందుంచుకొనియే ప్రభుత్వము పన్నులు విధించుటగాని, దానిని వ్యయపరచుటకాని చేయవలయును. ఈవిధముగా చేయుటకు ఆర్థిక శాస్త్రజ్ఞులు పన్నులను విధించుటలోను, ఆ ధనమును వ్యయపరుచుటలోను కొన్ని సూత్రముల నేర్పరచియున్నారు. (1) పన్నులు వసూలుచేయుటలో ధనికులకద్దనుండిన వసూలు చేయునది అధిక మొత్తముగా నుండవలయును. (2) వ్యయపరచుటలో మధ్య తరగతి, తక్కువ తరగతి ప్రజలకు సౌకర్యము అధికముగా నుండునట్లు చూడవలెను.

1. కాని ధనవంతులవద్ద నుండునదియును, బీదలవద్ద నుండునదియును ఒక్కటే ధనము గదా! అట్టిచో ధనికులపై ఎక్కువగా పన్నులు విధించుటలో గల న్యాయ మేమి? యని ప్రశ్నింపవచ్చును. అయినను, ధనికులవద్దనున్న ధనముకన్న బీదలవద్దనుండు ధనమునకు విలువ హెచ్చు. అనగా బీదలవద్ద నుండి వసూలుచేసిన ఒక నాణెము వలన వారు కోల్పోవు సౌఖ్యలాభములు, అట్టి నాణెమే ధనికులనుండి వసూలుచేయుచో వారు కోల్పోవు సౌఖ్యలాభములకంటె హెచ్చుగా నుండును. ధనము ఒక మానవునివద్ద హెచ్చిన కొలది ఆ హెచ్చుధనము వ్యయపరచుటవలన వారికి కలుగు సంతృప్తియు, సుఖమును తగ్గుచుండును. ఈ సూత్రము ననుసరించియే ఆదాయపుపన్ను రేట్లు విధింపబడుచున్నవి. అందుచే ఆర్థిక శాస్త్రజ్ఞులు హెచ్చుమొత్తమును ధనికులనుండియే వసూలు చేయవలయును.

2. ఒక పౌరుడు కొంత ధనమును పన్నురూపకముగా ప్రభుత్వమున కిచ్చుచున్నాడనగా అతడు కొంత సుఖమును (ఆ ధనము ఖర్చుపెట్టుటచే కలుగునది) త్యాగము చేయుచున్నాడన్నమాట. అట్లే ప్రభుత్వము ఖర్చు చేయుట యనగా కొంత సుఖమును, లాభమును ప్రజలకు కలుగజేయుచున్నదని భావము. అట్టియెడ ప్రభుత్వము ఒక నాణెము ఖర్చు చేయుచున్నదనగా ఆ ఖర్చువలన కలుగు సుఖముగాని, లాభముగాని, ఆ నాణెమును పన్నుగా నీయుటలో పౌరులు కోల్పోయిన సుఖమునకుగాని, లాభమునకుగాని, ఎక్కువగాగాని, సమానముగాగాని యుండవలయును. ఇదియే ఆర్థికశాస్త్రవేత్తలు ప్రభుత్వపు వ్యయము అనుసరించవలసినదని చెప్పిన సూత్రము. కానిచో ప్రభుత్వము పన్నులు వసూలుచేయుటలోగల లాభ మేమియు లేదుగదా! ప్రభుత్వము కలుగజేయు సుఖలాభములు ప్రజలు పన్నుల నీయుటలో కోల్పోయిన వానికంటె తక్కువైనపుడు ఆ ధనము పన్నుల క్రింద వసూలుచేయకుండినపుడే పౌరులకు సుఖము హెచ్చుగా నుండు ననుట నిర్వివాదాంశము.

ఈ పైసూత్రము ప్రభుత్వము అమలుపరచవలెనన్న ప్రభుత్వము వ్యయమధికముగా తక్కువతరగతులవారికై నిర్దేశించబడవలయును. అట్లు కానినాడు సంఘమున కట్టి వ్యయముచే నష్టమే గాని లాభము లేదనుట విదితము. కారణ మేమనగా తక్కువ మొత్తములను పన్నుల రూపకముగా నిచ్చుచున్నను క్రింది తరగతుల వారిత్యాగము సామాన్యముగా హెచ్చుతరగతుల వారి హెచ్చుమొత్తముల నిచ్చుటలో కలిగెడి దానికన్న హెచ్చుగా నుండుట. ఈ హెచ్చు త్యాగమునకు సమానమగు లాభము రావలెనన్న ప్రభుత్వవ్యయములో చాలభాగము ఆ తరగతుల వారికై ఖర్చుపెట్టవలయును.

అదియును గాక సామ్యవాద సిద్ధాంతముల ననుసరించినచో ప్రభుత్వము పన్నులు విధించుటలో వేరొక సూత్రమునుకూడ పాటింపవలసియున్నది. ధనముపై నాధారపడి సంఘమునందు వర్గము లుండరాదని వారి సిద్ధాంతము. ఆర్థికముగా నందరు సమానులుగా నుండవలె నని వారి యాశయము. తదాశయసాఫల్యమునకు పన్నులొక మార్గము. ధనవంతులపై ఎక్కువ పన్నులను విధించి ఆ ధనమును బీదలపై వినియోగించుటవలన కొంతకాలమునకు ఆర్థికతారతమ్యము లను సంఘములో చాలవరకు నిర్మూలించుటకు వీలగును. ప్రతిప్రభుత్వము ను సామ్యవాద సిద్ధాంతముల ననుసరించుటవలననే సంఘమును ఉచ్చస్థితికి తీసికొనివచ్చుటకు వీలగు నని చాలమంది రాజకీయజ్ఞుల యభిప్రాయము.

ధనికులపై పన్ను లధికముగా విధింపవలె ననుటకు సూత్రప్రాయముగా కారణములు:

1. పన్నులభారము వహించుటయందు వారు సమర్థులు.

2. అట్టిపన్నుల నీయుటలో వారు కోల్పోవు సౌఖ్యలాభములు చాల తక్కువ.

3. సామ్యవాద సిద్ధాంతముల ననుసరించుచో ధనికులే పన్నుల భారము వహింపవలసివచ్చుట.

బీదలపై విధింపవల దనుటకు సూత్రప్రాయముగా కారణములు:

1. వారి యశక్తత (హెచ్చు మొత్తముల విధించినప్పుడు).

2. పన్నులు చాల తక్కువమొత్తములుగా వారిపై విధింపవలసివచ్చుటచే అట్టి పన్నులు వసూలుచేయుటలో ప్రభుత్వమునకు వ్యయమధికము.

3. ఒక వేళ తక్కువ మొత్తములుగా విధించినను అట్టి పన్నుల నీయుటలో వారికి కష్టనష్టము లమితములు.

4. ప్రభుత్వము వారి కుపకరించుటకు కాని, వారిపై పన్నులు విధించి పీడించుటకు కాకపోవుట.

ఈ పైన లిఖింపబడినవి ఆర్థికశాస్త్రవేత్తలేక గ్రీవముగా నంగీకరించిన యార్థికసూత్రములు. ఇట్టి సూత్రముల ననుకరించుచు, దేశకాలపరిస్థితుల ననుసరించి ప్రభుత్వము పన్నులు విధింపవలయును. బీదలపై అసలుపన్నులు విధింపవలయునా లేదా? అన్న ప్రశ్నపై ఆర్థికశాస్త్రవేత్తలయందభిప్రాయ భేదములు కలవు. కాని ఒక వేళ వారిపై పన్నులు విధింపవలసివచ్చినను అట్టి పన్నులు వారతిసులభముగా నిచ్చునట్టివిగా యుండవలెనను విషయముపైమాత్రము వారందరేకీభవించుచున్నారు.

ఈ పైసూత్రములతో సమన్వయించి మన రాష్ట్రప్రభుత్వముయొక్క బడ్జెట్టు ఎంతవరకు ప్రజల కుపకారియో విచారింతము. ఏ ప్రభుత్వమైనను పరిస్థితుల ననుసరించి పన్నులు విధింపవలయును. ప్రస్తుత పరిస్థితులయందే వర్గము పన్నులభారముక్రింద నలిగిపోవుచున్నది? అను ప్రశ్నకు సమాధాన మొసంగిన తరువాత కాని కొత్తపన్నులను విధింప తలంపరాదు. ఈవిషయ మాలోచింపనినాడు అట్టి ప్రభుత్వమందార్థికశాస్త్రజ్ఞులు కాని రాజకీయజ్ఞులు కాని ఉన్నారనుట హాస్యాస్పదము.

ప్రస్తుత ద్రవ్యోల్బణ పరిస్థితులయందధికముగా కష్టనష్టముల కోర్చుచున్నది, మధ్య తరగతివారును బీదలును కాని ధనికవర్గము మాత్రము కాదు. అంతే కాక మీదు మిక్కిలి వారి లాభము లధికము లగుచున్నవి. యుద్ధ మంతరించినను పరిస్థితులయందు మార్పధికము కాకపోవుటయే దానికి కారణము. పైపెచ్చు, మన రాష్ట్రప్రభుత్వముచే విధింపబడిన అమ్మకపు పన్నుకూడ మధ్య తరగతివారికిని, బీదలకును మాత్రము బాధాకరముగ నున్నది ఇట్టి పరిస్థితులయందు, ఆర్థికసూత్రముల మాట యటుండనిచ్చి, ప్రజాస్వామ్య ప్రభుత్వమైనపుడు ధనికవర్గముపైననే పన్నులను విధించి బడ్జెటులోని లోటుపాటులను కూడ దీసికొనుట విధియై యున్నది.

కాని, దురదృష్టవశమున శ్రీ గోపాలరెడ్డిగారు ప్రవేశపెట్టిన బడ్జెట్టు దానికి వ్యతిరేకముగనే కాని అనుకూలముగ నున్నట్లు కన్పించుట లేదు. ఈవిషయము బడ్జెట్టును కొంత విమర్శ చేసినచో మనకు విశదము కాగలదు.

బడ్జెట్టులోని పన్నుల విషయకమైన ప్రతిపాదనలు:

1. కొబ్బరికాయలు, కొన్ని రకముల నూనె విత్తులు, చెరకు, మిరపకాయలు, కాఫీ, రబ్బరు, బంగాళాదుంపలు, మిరియాలు, అరటి పళ్లు మొదలగువానిపై తిరిగి పన్ను విధించుట. ఈ వస్తువులపై యిప్పుడు అమలులోఉన్న అమ్మకపు పన్ను చట్టము ననుసరించి మొట్టమొదటిసారి అమ్మినపుడు పన్ను విధింపబడుట లేదు.

2. ప్రత్తిపైన పన్ను. ఈ పన్ను ఎప్పుడు విధింపవలెనో-అనగా పండిన ప్రత్తిపైననా, లేక అది బాగు చేసిన తర్వాతనా, లేక వేరొక పరిస్థితిలోననా అనునది యింకను నిర్ణీతము కాలేదు.

3. నూటికి $12\frac{1}{2}$ చొ॥న బస్సుచార్జీలపై సర్ ఛార్జి.

4. ఇపుడున్న యింటి పన్నుపై నూటికి $12\frac{1}{2}$ సర్ ఛార్జి.

5. విద్యుచ్ఛక్తి నుపయోగించువారిపై ప్రత్యేక అమ్మకపు పన్ను.

6. ఎడ్వర్టయిజుమెంట్లు క్రాస్‌వర్డ్ పజిల్సుపైన పన్ను.

7. కాఫీ హోటళ్లపైనను, సినిమాలు మొ॥ వాటిపై తగిలినట్లు పన్ను.

8. ద్రవ్యోల్బణ పరిస్థితులచే స్థలములకు ధర పెరిగినది. అందుచే దానిపై వచ్చు లాభమధికమైనది (అమ్ముటచే కలుగునది). అట్టి లాభము కష్టపడకుండ పరిస్థితుల మార్పువలన కలిగినది. అందుచే ప్రభుత్వము ఆ పెరిగిన విలువయందు నాల్గవపాలు పన్నుగా తీసికొనును.

ఈ పై ప్రతిపాదనల నొక్కటొక్కటిగా పరిశీలింతము.

కొబ్బరికాయలు, నూనెవిత్తులు, చెరకు, మిరపకాయలు మొదలగువానిపై మొట్టమొదట అమ్మినపుడు పన్ను విధించినచో అట్టి పన్ను వ్యవసాయదారు లిచ్చుకొనవలసియుండును. వారిపై పన్నులు విధించుట మంచిది కాదను తలంపుతో ఈ వస్తువులపై యింతవరకు అమ్మకపు పన్ను విధింపబడలేదు. అంతే కాదు. ఈ వస్తువులపై మొట్టమొదట పన్నుల విధించుట సులభము కాదు. ఆ విధించిన పన్నులను వసూలు చేయుటకగు వ్యయము ఆ పన్నులపై వచ్చు ఆదాయముకంటె అధికముగా నుండు దను తలంపుతోకూడ అట్టి వస్తువులు అమ్మకపుపన్నునుండి ప్రత్యేకించబడినవి. ఇదివరకు ఈ పన్నులు వసూలుచేయుట కష్టమైనపుడు ఇపుడు మాత్రము సులభమా? ఈ పన్నులు వసూలుచేయుటకు సులభమార్గ మిది యని శ్రీ మంత్రిగారు చెప్పక పోవుటచే మన మిప్పుడుకూడ అది కష్టసాధ్యమనియు, అట్టి పన్నులు వసూలు చేయుట శ్రేయోదాయకము కాదు సరిగదా, లాభదాయకముకూడ కానేరదనియు అనుకొనవలసివచ్చుచున్నది. ఇట్టి చిక్కులే ప్రత్తిపై విధింపబోవు పన్నునకుకూడ కలుగుచున్నవి. ఎడ్వర్టయిజుమెంట్లు క్రాస్‌వర్డ్ పజిల్సుపై వచ్చు నాదాయముకూడ నధికము కాజాలదు. అందుల కగు వ్యయముమాత్ర మధికము కావచ్చును.

ఇట్టి వసూలుచేయుటకు వీలులేని పన్నులను ఆర్థికశాస్త్రవేత్త లంగీకరించరు. అందులకే ఒక ప్రఖ్యాత ఆర్థికశాస్త్రవేత్త "పన్నులెంత మంచి అభిప్రాయములపైనను, సూత్రములపైనను ఆధారపడియున్నను, అవి ఆచరణయోగ్యములు కానినాడు (అనగా వసూలు చేయుటలో వ్యయము, కష్టము అధికమైనపుడు) అవి వర్జనీయములు" అని నుడివియున్నాడు. ఇట్టి ప్రఖ్యాతమగు నార్థికసూత్రమును మంత్రిగారేల విస్మరించిరో తెలియకున్నది.

బస్సుల ఛార్జీలిదివరకే చాలవర కధికమైనవి. క్రింది తరగతులవారి వ్యయమందీ ఖర్చే మిక్కుటముగానున్నదని వారి Cost of living index. అంచనా వేసినపుడు నిపుణులు తమ యభిప్రాయమును వెల్లడించియున్నారు. అట్టియెడ వాని నింకను హెచ్చించుట ప్రజలకు ప్రయోజనకారియా అనునది ప్రజలే నిర్ణయించుకొనవలయును.

ఇక యింటిపన్ను విషయమును పరిశీలింతము. ఈ పన్ను పట్టణములలోను, పురపాలకసంఘము లుండుచోటను మాత్రమే విధింపబడును. ఇప్పటికే అట్టిచోట్ల ఇండ్లకరవధికముగా నున్నది. అద్దెకు యిండ్లు దొరకకయు, దొరికినచో అద్దె లధికమగుటవలనను మధ్యతరగతివారును, క్రిందితరగతులవారును బాధపడుచున్నారు. ఇట్టి పరిస్థితులలో ఇండ్ల నధికముగా నిర్మించుటకు ప్రోత్సహించవలసిన ప్రభుత్వము కట్టిన యిండ్లపై పన్నుల నధికముచేయుచున్నారు. అట్టిచో అద్దెలుకూడ అధికము కాక మానవు. ఇప్పటికే తక్కువ ఆదాయములతో ఎక్కువగా నున్న యింటి అద్దెలతో బాధపడుచున్న సామాన్యుల పాట్లు ఈ పన్నుకూడ వచ్చినచో ఎట్లుందురో పాఠకు లూహించుకొందురుగాక! కాని ప్రభుత్వ మొక ప్రశ్న యడుగవచ్చును. పల్లెలనుండియు గ్రామములనుండియు పట్టణములకు ప్రజలు రానేల? — అని.

అట్లు వచ్చువారు చాలవరకు స్వోదరపోషణార్థ మరుదెంచువారే. జీవనమునకై పట్టణములందధికమగు త్రోవ లుండును. పొట్ట జరుగకపోయే వారున్న ఊరు విడిచి పట్టణముల చేరుచుందురు. ప్రభుత్వ మట్టివారికి గ్రామములందే వృత్తి చూపించినచో వారు రాకుందురు. కాని ప్రస్తుతము మన ప్రభుత్వమట్టి సదుపాయము చేయగలిగిన పరిస్థితులలో లేదు. అందుచే కనీసము అట్లు వచ్చు వారికి తమ శక్తికొలది తగిన సదుపాయము (వృత్తులవిషయము కాకపోయినను, మిగిలిన విషయము లున్నవి కదా!) చేయుట ధర్మము. అది చేయలేదు సరిగదా, పైన వ్రాసినట్లు ఒక వేళ ప్రశ్నించినచో అట్టి ప్రశ్న అర్థశూన్యము మాత్రమే!

ఇక స్థలముల అమ్మకములపై పన్ను సాధారణముగా ఇట్టి హెచ్చుధరలలో స్థలము లమ్మకొను వారు మధ్య తరగతి వారు, నుక్రింది తరగతులవారును. వారి కున్న అప్పులనుండి విముక్తికోరువారు సాధారణముగా నాలోచించు మార్గ మేమన - పరిస్థితుల ననుసరించి హెచ్చువిలువ కలిగిన తమ స్థిరాస్తులను, స్థలములను అమ్ముకొనుట. ఈ పన్ను అట్టి వారికి కొంచెము బాధాకరము. అంతేకాక గృహనిర్మాణమవసరముగ జరుగవలసిన ప్రస్తుత పరిస్థితులలో ఈ పన్ను స్థలముల విలువ నధికముచేసి గృహనిర్మాణము తొందరగా జరుగుటకు కొన్ని యడ్డంకు లేర్పడు నను వాదముకూడ కొంతవరకు నిజమే. ఈ రెండు లోటులను సర్దుబాటుచేసి

(18వ పేజీ చూడుడు)

ధానిక:

వ్యాపారం

'జగన్నాథ్'

ఒకప్పుడు వెంకటశివుడి తండ్రి బాగా ఉన్నవాడే. అతనికి నలభై అయి దేళ్లప్పుడు మొదటి భార్య పోయింది. ఆవిడ నతను బాగా ప్రేమించేవాడని పేరు. అది ఆవిడ పోయాకే ప్రచారంలోకి వచ్చిందో, బ్రతికున్నప్పుడే వచ్చిందోమాత్రం నాకు తెలియదు. కాని పెళ్ళాం పోయిన యేడాదివరకూ అత నించుమించు వైరాగ్యదశలోనే వున్నాడని చెప్పవచ్చు. ఎన్ని సంబంధాలు వచ్చి నాతో నసేసేవాడు, ఎందు రెన్నివిధాలా చెప్పినా వినేవాడు కాదు. బహుశా చచ్చిపోయిన భార్య మీద వుండే మమకారంవల్లనయివుండవచ్చు. అయితే, ఇంకొక యేడాదికే మర్లాంలో అతనికున్న భూమి కాస్తా అమ్మడైపోయింది. వెంకటశివుడి తండ్రి భూమి అమ్మేస్తున్నాడని తెలిసినప్పుడు చాలామందికి ఆశ్చర్యంవేసింది. అప్పటిలో అతనికి చెడ్డ అలవాట్లున్నాయని వూహించడానికైనా ఎవరికీ ధైర్యం లేకపోయింది. అకస్మాత్తుగా అతను తాగుతున్నాడనీ తిరుగుతున్నాడనీ తెలిసినప్పుడు ఊరంతా ఒక్కసారి ఊగిపోయింది. వెంటనే కొందరు పెద్దలు పట్టుబట్టి అతనికి పెళ్లిసంబంధం కుదిర్చేశారు. కిక్కురుమనకుండా అతను పెళ్లిచేసివేసుకున్నాడు. తరువాత రెండేళ్లకి వెంకటశివుడు పుట్టాడు. అప్పటికే ఆకుటుంబం పూర్తిగాచితికిపోయింది. అక్కడక్కడా మిగిలివున్న భూమి సొంతంగా అమ్మడైపోయింది. సొంతయింట్లోనుంచి అంతకంటే చిన్నదైన అద్దెకొంపలోకి మారవలసివచ్చింది. వెంకటశివుడి తండ్రి రోజూ పట్నం వెళ్లి డబ్బు తెస్తూ వుండేవాడు. కాని దానితోనే వాళ్లు సంసారం గడుపుకుంటున్నారని చెప్పడం సమంజసంగా వుండదు. భర్త కాళ్లీడ్చుకొంటూ నాలుగు మైళ్లు కాలినడకని వెళ్లి పట్నంలో సంపాదించే దానికంటే ఎక్కువగా భార్య ఇంటిదగ్గర వుండే సంపాదించగలిగేది. పేదరికం భరించలేక అవవచ్చు, కామం భరించలేక అనవొచ్చు వెంకటశివుడి తల్లి ఈవిధంగా డబ్బు చేయడం నేర్చుకుంది. ఈవిషయం అతని తండ్రికి తెలియ దనుకోడంకూడా పొరబాటే అవుతుంది. అతను ఇంటి ఖర్చుకి ఒక్కదమ్మిడీ యిచ్చేవాడు కాదు. పైగా అవసరమైనప్పుడు పెళ్లాందగ్గిరనుంచి రూపాయి అర్ధా పుచ్చుకుంటూ వుండేవాడు. వీళ్ల దాంపత్యాన్ని చూసి వీళ్ల కొక్క నిముషమైనా మనశ్శాంతి వుంటుందా అని అనుమానపడేవాళ్లు చాలామంది ఉండడానికి అవకాశా లున్నాయి కాని కొంచెం పరీక్షగా చూసినట్టయితే అంతకంటే సంతోషంగా ఉండే భార్యాభర్తలు మనకి కనుపించరు. ఎప్పుడూ వాళ్లిద్దరిమధ్యా అభిప్రాయ భేదాలూ, దెబ్బలాటలూ వుండేవి కావు. వాళ్లిద్దరూ దెబ్బలాడుకుని విడిపోవడం చూసి ఆనందించాలని ఎవ్వరికీ లేకపోయినా వాళ్లసంసారం ఒడుదుడుకులేకుండా శాంతంగా సాగిపోడం కూడా చాలామందిచూసి సహించలేకపోయారు. కొందరు భార్యసంగతి అతనికి తెలియనట్టుగా చెప్పడానికికూడా సాహసించారు. అయితే వెంకటశివు డెప్పుడూ కోపం తెచ్చుకున్నట్టు కనబడేవాడు కాదు. "అంతా అబద్ధం, పెళ్లాం సంగతి నాకు తెలుసు, అది చాలా మంచిది" అంటూ ఉండేవాడు. దీనితో వాళ్ళనోళ్ళు కట్టుబడి పోయేవి. కొంతకాలానికి నిజంగా ఆవిడ పతివ్రత అని ప్రచారంచేసేవాళ్లు కూడా బయలుదేరారు. ఏది ఎలా జరుగుతున్నప్పటికే వెంకటశివుడి తల్లి ఏమీ జరగనట్టుగానే ప్రవర్తించేది. ఇరుగుపొరుగువారు కూడా ఏమీ కంగారుపడకుండా ప్రతి పండగకీ పబ్బానికీ ఆవిడని పిలుస్తూనే వుండేవారు. ఇలా సంతోషంగా గడిచిపోతున్న సంసారానికి వెంకటశివుడి పుట్టుక ఒక నిరోధంగా కనిపించింది. నిజానికి అతని తల్లిగాని తండ్రిగాని సంతానం కోసం తపించిపోలేదు. అందుచేత అతని పుట్టుక సంతోషకరంగా పరిణమించలేక పోయింది. చంటిపిల్లవాడికోసం ఖర్చుపెట్టడంలో అతని తల్లి ఆట్టే కష్టపెట్టుకోకపోయినా, పిల్లని పెంచడం ఆవిడకి మించినపనయింది. అతనికి తిండీ, బట్టా, అన్నీ సక్రమంగా లభిస్తున్నప్పటికీ ఎప్పుడూ సంతోషంగా కనిపించేవాడు కాదు. సరిగ్గా బడికి వచ్చేవాడు కాదు. అందరితోటీ స్నేహంగా వుండేవాడు కాదు. అసలు అందరూ ఇతనిలో స్నేహంగా వుండేవారు కాదు. కొత్తవాళ్ళంటే వెంకటశివుడికి భయం, అసహ్యం, ద్వేషం. ఇతనన్నా తక్కిన కుర్రవాళ్లకి అలాగే వుండేది. మొదటిలో నన్నూ ఇలాగే అనుమానంగా చూసేవాడు. అప్పటికి నాసంగతి సందర్భాలతనికి పూర్తిగా తెలియవు. అందరిలాగే స్నేహంగా వున్నట్టే నటించి నాలుగురోజులు పోయినతరువాత నలుగురిలోనూ ఏడిపించడం మొదలుపెడతానేమోనని భయపడ్డాడు. కాని నేను అతనిలాగే ఒక నిర్భాగ్యురాలి కొడుకునని తెలుసుకున్నప్పుడు పరమానందంతో స్వీకరించాడు. అయితే మా అమ్మకి ప్రస్తుతం భర్తఅనేవాడు ఎవడూ లేరు. తొమ్మిదిపదేళ్ళక్రితం ఒక మహానగరంలో అమ్మని నమ్మించి ఒకడు మోసంచేసి వెళ్లిపోయాడు. అప్పటినుంచీ మా అమ్మ మళ్లీ పెళ్ళివిషయం ఎత్తలేదు. ఈ చిన్న వూళ్లోకి వచ్చి మా సిగ్గుని మరుగుపరుచుకుందామని చూశాం. కాని అది ఎక్కడా దాగదు! నేనే చెప్పడం బాగుండదేమో కాని మా అమ్మ లాగ నీతిగా నడుచుకునేవాళ్ళు ప్రపంచంమీదే చాలా తక్కువ. అయినా మమ్మల్ని ఎవ్వరూ వాళ్ళయిళ్లకి పిలవరు, గౌరవంగా మాట్లాడినట్టు కనబడరు. మనసులో ప్రతివారికీ మే మంటే చాలాగౌరవం అని నా అనుమానం. లేకపోయినట్టయితే ఈపాటికి మే మా వూరునుంచి వెళ్ళిపోయివుండేవాళ్లం. సామాన్యంగా మావంటి వాళ్లని అనే మాటలు చిన్నలుకాని పెద్దలుకాని ఆవూళ్లో మమ్మలి ననరు. ఇంతకీ నాకూ, వెంకటశివుడికీ ఈ ఒక్కవిషయంలోమాత్రమే దగ్గిర సంబంధం. అతను తల్లితండ్రులు కోరకపోయినా పుట్టాడు. అందుచేత వాళ్లు ఇతనిని ప్రేమించలేకపోయారు. వెంకటశివుడికికూడా తల్లితండ్రుల మీద చెప్పలేనంత క్రోధం. అసలు ప్రపంచం మీద తల్లితండ్రులంతా కూడా అలాగే వుంటారని ఒక విశ్వాసం. వాళ్ల దౌర్జన్యాలని తీవ్రంగా విమర్శించాలని ఒకవాంఛ! అన్నింటికంటే తల్లితండ్రులచేత ప్రేమించబడాలని అతనికి ఆశగా వుండేది. వారి దృష్టిని తన వైపుకి తిప్పుకోడంకోసం అన్నం సరిగ్గా తినేవాడు కాదు; బట్టలు సరిగ్గా వేసుకునేవాడుకాదు; చెప్పిన పని ఏదీ చేసేవాడుకాదు. నెమ్మదిగా అతను ఒకరిని లెక్కచేయకుండా తయారయ్యాడు. ఊళ్ళో ఎవ్వరన్నా అతనికి భయం లేదు. ఎక్కడ చూసినా వెంకటశివుడు, అతని జట్టు కనిపిస్తూవుండేది. అప్పుడప్పుడు దెబ్బలు తినకూడా ఇంటికి రావడం అతనికి పరిపాటి అయిపోయింది. ఇంక వెంకటశివుడితో పడడం తల్లి శక్యం.కాలేదు. ఆవిడ అన్నయ్య ఎక్కడో పట్నంలో గవర్నమెంటు ఉద్యోగం చేసుకుంటున్నాడు. అతనిదగ్గిరకి కొడుకుని పంపించివేసింది. కొంతకాలం వెంకటశివుడికక్కడ సుఖంగానే గడిచింది. అతని చరిత్ర నెరుగున్న వాళ్లుకాని, ఏడిపించేవాళ్లు కాని అక్కడ లేరు. అయినా అతను పట్నంలో చాలా కాలం వుండలేకపోయాడు. మేనమామ ఇంట్లో మూడు పూట్లా భోజనం తప్పితే చేతికి ఒక్కచిల్లు గవ్వయినా దొరికేది కాదు. అదయినా వేళకి సరిగ్గా అన్నం తిని, చదువుకుని, నిద్రపోవాలి అల్లరిచిల్లరగా తిరగడానికే మాత్రమూ అవకాశ ముండేదు. పైగా మేనత్త సాధింపులు, తిట్లుపడడం వెంకటశివుడికలవాటులేని పని. ఒకళ్లని తిట్టడం, ఎదిరించడం వీటికే అలవాటుపడ్డాడు. కాని ఒకళ్లచేత తిట్టించుకోవడం అతనికి కొత్త. కొంపతీసి ఏమైనా నోరు జారాడా రాత్రికి మామయ్యచేత దెబ్బలు తప్పేవి కాదు. ఇటువంటి పరిస్థితులలో సైతం వెంకటశివుడు కొన్ని ఏళ్లు గడపగలిగాడు. ఒకరోజున మేనమామ పెట్టెలో పది రూపాయిల నోటు పోయింది అది మామకొడుకు తీయడం ప్రత్యక్షంగా వెంకటశివుడు చూశాడు. కాని నిజం చెప్పబోతే అది తనమీదే బెడిసికొట్టింది. ఆవాళ తిండి పెట్టకుండా స్తంభానికి కట్టి కొట్టేటప్పటికి ఇన్నాళ్లనుంచీ అతనిలో అజ్ఞాంతంగా అణగివున్న అభిమానం ఒక్కసారి పైకి లేచింది. ఆరాత్రే అతను వూరు వదలిపెట్టి పారిపోయాడు. నిజంగా అతనికోసం విచారించినవాళ్లుకాని, అత నెక్కడ వున్నాడో వెతికించినవాళ్లు కాని లేరనే చెప్పవచ్చు. అసలు, ఈవిషయం మావూరుపాకేటప్పటికే అతను పారిపోయి వారం గడిచింది. అప్పుడలా వెళ్ళిపోయిన వెంకటశివుడు మళ్లీ పాతిక సంవత్సరాలకి ఒక లక్షరూపాయిల ఆస్తితో అసలు వూళ్ళ ప్రవేశించాడు. మే మెవ్వరమూ మొగటిలో అతని నానవాలుపట్టలేకపోయాం. నేనూ, కరణం, మీసాలకాపూ, మునసబు అరుగుమీద కూర్చుని ఆప్తులలాగ మాట్లాడుకొంటున్నప్పు డతను వచ్చి వెంకటశివుడి నని తెలియజేసుకున్నప్పుడు ఆశ్చర్యపోయాం. నే నలా వాళ్లలో సమానంగా కూర్చుని మాట్లాడుతున్నందుకు అతనుకూడా ఆశ్చర్యపడ్డట్టే కనిపించాడు. అతను ఊరు విడిచి వెళ్ళిపోయిన ఈ పాతికేళ్లల్లోనూ చాలా మార్పులు జరిగాయి. అతని తల్లితండ్రు లిద్దరూ చచ్చిపోయారు. నేను ఊరు విడిచిపెట్టి వెళ్ళిపోయి, పట్టణంలో వ్యాపారంచేసి లక్షరూపాయలపైచిలుకు కూడబెట్టాను. అందుచేత మాపాతమచ్చ మాయమయిపోయింది. సరిగ్గా వెంకటశివుడు వచ్చినరోజునే మునసబుకొడుకుపెళ్లికి కుటుంబంతో సహా వచ్చాను. మా స్నేహం విడిపోయి పాతికసంవత్సరాలు కావస్తున్నప్పటికే, మా స్థితిగతులలో ఇంత భేదం వచ్చినప్పటికే ఒకరినొకరు కలుసుకున్నప్పుడు ఒక్కక్షణంలో చిన్నప్పటిలాగే ఐక్యమై పోగలిగాం. ఇద్దరమూ అలాగ పొలాలలోకి వెళ్ళి ఎన్నో సంగతులు మాట్లాడుకున్నాం. ఇంత డబ్బు అత నెలా గడించాడో నే నడగలేదు. అతనూ చెప్పలేదు. కాని ఇద్దరం కలిసి పట్టణంలో ఒక కొత్త వ్యాపారాన్ని ప్రారంభించడానికి మాత్రం స్థిరపరుచుకున్నాం.

మరునాడే పట్టణంలో మాయింటిపక్కన ఒక యిల్లు కుదిర్చిపెట్టా నతనికి. ఆవాళే కుటుంబాన్ని తీసుకువచ్చేస్తానని బయలుదేరాడు. కొంచెం మంచి రోజు చూసి తీసుకురావయ్యా అంటే నాకు వీటిల్లో నమ్మకం లేదు, పొమ్మన్నాడు. ఎలాగో వప్పించి రెండు రోజులపాటు అతని కుటుంబాన్నంతా మాయింట్లోనే వుంచి మూడోనాడు ప్రవేశపెట్టాను. మునుపటికీ యిప్పటికే వెంకటశివుడిలో చాలా మార్పు కనిపించింది. అప్పటిలాగ అత నెవరికీ భయపడడు. పైగా నీతినియమాలగురించి మాట్లాడేవాళ్లని చులకనగా చూస్తాడు. ప్రపంచంలో ఎవ రేమయిపోయినా సరే తన కుటుంబం, తన భార్య, తనపిల్లలు, తిన తిండి, అంతా తన విషయమే అతనికి కావలసింది. ఒకప్పుడు వెంకటశివుడిని ఎవరూ లెక్కచేసేవారు కాదు. ఇప్పు డతనే ఎవరినీ లెక్కచేయకపోవడం నేర్చుకున్నాడు.


వెంకటశివుడికి ముగ్గురు కొడుకులు. పెద్దవాడు మద్రాసులో వకీలు చేస్తున్నాడు. పెద్ద కొడుకుగురించి అత నెంతో పొగిడి చెబుతూ వుంటాడు. చిన్నప్పుడు పుట్టిందిమొదలు ఎలా పెరిగిందీ, ఒక్కొక్క క్లాసూ ఎలా పాసయిందీ, చదువుకునే రోజులలో ఆటలలో అతని కెన్ని బహుమానాలు వచ్చిందీ విడివిడిగా ఉద్రేకంగా చెప్పుతూ వుంటాడు. ఎందరిదగ్గర ఏకరువుపెట్టినా అతనికి విసుగు అనేది లేదు. ఒక్కొక్కప్పుడు చెప్పినవాళ్లకే మళ్లీ చెప్పతాడు అటువంటి ప్రయోజకుడు తనకడుపున పుట్టినందుకు జన్మ సార్థకమైనట్టు మాట్లాడుతాడు. అతనిని తలుచుకుని గర్వపడతాడు, ఆనందపడతాడు. తక్కిన యిద్దరూకూడా అలా తయారయితే ఇంక తన కే బెంగా వుండదంటాడు. సాధారణంగా రెండో కొడుకుసంగతి మూడోకొడుకు సంగతి కొత్తవాళ్లదగ్గిర ఎత్తనే ఎత్తడు. వాళ్లమాట వచ్చినప్పుడు అతను నిజంగా బాధపడతాడు.

అతని రెండో కొడుకు ఇంట్లోనుంచి పారిపోయాడు. వెంకటశివుడికి నీతినియమాలనుగురించి అదే పనిగా మాట్లాడేవాళ్లని చూచినప్పుడు అసహ్యంవేసినా అవి పాటించనివాళ్లని చూచినప్పుడు అపరిమితమైన కోపం వస్తుంది. అతను చిన్నతనంలో స్వయంగా అనుభవించిన బాధ ఇంకొకళ్లకి రాబోతూందని తెలిసినప్పుడు చెప్పలేనంతగా కుమిలిపోతాడు. అందుచేతనే తన పిల్లలని చిన్నతనంనుంచీ మంచి కట్టుదిట్టాలలో వుంచాడు. ఎప్పుడు ఏ విధంగా కొడుకులతో మాట్లాడినా ఇంద్రియనిగ్రహం ఎంత గొప్పదో చూచాయగా తెలియచేస్తూ వుండేవాడు. ఫలితంగా అతని రెండోకొడుకు వెంకటశివుడి మనస్సుకి శాంతి లేకుండాచేశాడు. తండ్రిరక్షణలో వున్నంతసేపూ అతను బాగానే వున్నాడు. కాని వూరు విడిచి కాలేజీలోకి వెళ్లాక అతనిగురించి చాలా చెడ్డ సంగతులు వాడుకలోకి వచ్చాయి. క్లాసు ఆడపిల్లలపట్ల అత్యాచారంగా ప్రవర్తిస్తున్నా డనికూడా కొన్నిసార్లు తండ్రిచెవున బడింది. దానికితోడు అతను చదువు పూర్తిచేసి ఇంటికి వచ్చేస్తూ ఒక ఆడపిల్లనితీసుకువచ్చి పెళ్లిచేసుకుంటానన్నాడు. అలా వీలులేదని శివుడు గట్టిగా చెప్పివేశాడు. అంతే కాకుండా నలుగురి ఎదుటా నాలుగు చివాట్లు పెట్టాడు. తెల్లవారేటప్పటికి కొంత డబ్బుతో కొడుకూ, కొత్త అమ్మాయి మాయమయి పోయారు.


ఇంక మూడోవాడివిషయంకూడా విషమంగానే పరిణమించింది. అతను కొంచెం మందబుద్ధి. ఏ విషయంకూడా చురుకు అర్థం చేసుకునే శక్తి అతనికి లేదు. అసలు అతనికి ప్రత్యేకమైన అభిరుచులుంటూవుండేవి. తనికి తోచింది తప్పితే ఇంకొకటి ఎవ్వరు చెప్పినా చెయ్యడు. వెంకటశివుడికిమాత్రం కొడుకు నేదో చేసేయాలని వుండేది. తన శక్తినంతా వినియోగించి అయినా సరే, కొడుకుని వకీలు చేయడానికి ప్రయత్నించాడు. అతను మొదటినుంచీ లా చదవననే అంటూవచ్చాడు; కాని తండ్రి బలవంతంమీద లాకాలేజీలో చేరవలసివచ్చింది; యఫ్. యల్. లో రెండేళ్లు కూర్చోవలసీ వచ్చింది. ఎన్నిసార్లుపోయినా అతను కష్టపడి చదివేవాడు కాదు. ఊరికనే పరీక్షలకి కూర్చుని వచ్చేసేవాడు. చివరికి విసుగెత్తి కట్టడం మానేశాడు. వెంకటశివుడు కూడా కట్టమని బలవంతం చేయలేదు. నేనే ఒకరోజున కుర్రవాడిని పిలిచి యం.ఏ. చదవకూడదా అనిఅడిగాను. తప్పకుండా లిటరేచర్ యం. ఏ. చదువుతా నన్నాడు. నేనీ సంగతి వెంకటశివుడితో చెప్పితే ఇంకతను కొడుకుని చదివించదలుచుకో లేదని స్పష్టంగా చెప్పివేశాడు. ఎంత చదివినా చేసే పని ఏమీ లేదు. కాబట్టి ఇంక ఆట్టే ఖర్చుపెట్టకుండా ఇంట్లో కూర్చుని తింటూ వుంటేనే బాగుంటుం దన్నాడు.

వెంకటశివుడి తత్త్వం నే నర్థం చేసుకోగలిగాను. ప్రపంచంలో ప్రతి విషయాన్నీ వ్యాపారదృష్టితో చూడడం అలవాటు చేసుకున్నా డతను. పెద్దకొడుకుమీద కొంత పెట్టుబడి పెట్టాడు. లాభించింది. అతడుచేత అదే పనిగా అతనిని పొగడగలుగుతున్నాడు. రెండోవాడికి ఖర్చుపెట్టిందంతా వ్యర్థమై పోయింది. మూడో కొడుకుమీద కూడా అతనికి నష్టమే వచ్చింది. ఇప్పటివరకూ తను చదివించిందానికి ఫలితంగా ప్లీడరీ చేసి డబ్బు సంపాదిస్తా డనీ, తన పేరు నిలబెడతా డనీ ఆశించాడు. కాని అది ఫలించదని చాలా ఆలస్యంగా తెలుసుకున్నాడు. ఇప్పటికే కొంత నష్టపోయాడు కనుక యింకా దానిలోనే ప్రయత్నించి మరికొంత నష్టపోవడానికి అతని మనస్సు వప్పుకోలేదు!

—




విమానానికీ, రైలుపట్టాకీ మధ్య రాకెట్ కారును చూడవచ్చును. రాకెట్ కారు వేగంతో బయలుదేరాక, చట్రం అంచుకు 4 అడుగుల లోపున హైడ్రాలిక్ బ్రేకుతో రాకెట్టు ఆగిపోతుంది. విమానం రాకెట్‌ను వదిలి బాణంలాగ గాలిలోకి దూసుకుపోతుంది.




కొత్తరకం జెట్ విమానము. ఈ మధ్య ఈ విమానములు మద్రాసులో ప్రదర్శింపబడ్డాయి.


విమానాలతో వింతలు



ఒకటవ స్క్వాడ్రన్‌కు చెందిన పాత విమానములలో ఒకదానిని భారతవైమానిక టెక్నీషియనులు కొంతమంది శుభ్రపరచి సిద్ధముగ నుంచుచున్నారు.



టార్గెటు విమానము :— ఈ విమానము నేలమీద వలయాలు తిరిగి గాలిలోకి పోవటానికి బదులుగా, ఒక రైలుపట్టావంటి చట్రంమీద రాకెట్ బండిలో ఉంచి, వింటిని బాణము వదిలినట్లు గాలిలోకి వదలుతారు.



రాకెట్ బండి పట్టామీద ఆగిపోతుంది. టార్గెటువిమానం గంటకు 80 మైళ్ల వేగంతో గాలిలోకి ఎగురుతుంది. గంటసేపటివరకు ఎగరటానికి కావలసిన పెట్రోలు విమానంలో ఉంటుంది.



ఎర్ర గులాబీ

(చిన్న కథ)

మూలం: ఆస్కార్ వైల్డు

అనువాదం: 'రామమోహన్'

"ఎర్ర గులాబీ తెచ్చి పెడితే నాతో నాట్యం చేస్తా నన్నది నా ప్రేయసి. కాని నా తోటలో ఎక్కడా ఎర్ర గులాబీయే లేదు" అని విద్యార్థి బిగ్గరగా అనుకున్నాడు.

ప్రక్కనే ఉన్న తియ్యమామిడి చెట్టుమీద గూడుకట్టుకుని ఉంటున్నది ఒక కోకిల. ఆ కోకిల ఈ మాటలు విన్నది. విని ఆకుల్లోంచి తొంగి చూసి కొంచెం ఆశ్చర్యపడింది.

"నా తోటలో ఎర్రటి గులాబీ ఒక్కటైనా లేదు" అతని అందమైన కళ్లల్లో నీళ్లు పొర్లినై.

"మానవుల ఆనందం, ఎంత స్వల్ప విషయాల మీద ఆధారపడి వుంటుంది! నేను అనేక గొప్ప గొప్ప గ్రంథాలు చదివాను. వేదాంతరహస్యా లన్నీ తెలుసుకున్నాను. కాని ఒక్క ఎర్ర గులాబీ పువ్వు లేక నా జీవితం ఆక్రోశిస్తోంది" అన్నాడు విద్యార్థి బిగ్గరగా.

కోకిల మళ్లీ విన్నది.

"ఎంత కాలానికి నిజమైన ప్రేమికుణ్ణి చూశాను! దినదినమూ అతణ్ణి గూర్చి నేను పాటలు పాడాను—అతడెవరో తెలియక పోయినా. ప్రతి రాత్రీ అతణ్ణిగూర్చి నక్షత్రాలకు కథలు చెప్పాను. అతడింతకాలానికి నా కళ్లెదుట నుంచున్నాడు. అతని కేశాలు నల్లగా నిగనిగ లాడుతున్నాయి. అతని పెదవులు మందారాలవలె, చిక్కని అతని కాంక్షవలె అరుణములై వున్నాయి. కాని అతని ముఖం పాలిపోయి వున్నది. అతని నుదుటిమీద విషాదరేఖలు గాట్లుపడ్డాయి." అనుకున్నది కోయిల.

"ఈ రాత్రి పెద్ద విందు జరుగుతోంది. అక్కడికి నా ప్రేయసి వస్తుంది. ఒక్క ఎర్రగులాబీని ఆమెకివ్వగలిగితే తెల్లవారేవరకూ ఆమె నాతో, నాట్యం చేస్తుంది; ఆమె నా చేతులలో సోలిపోతుంది. మే మిద్దరం చేతులు చేతులు కలిపి విహరిస్తాము. కాని నా తోటలో ఎర్రగులాబీ ఒక్కటైనా లేదు. నే నొక్కడినే ఉండిపోవాల్సివస్తుంది. ఆమె నన్ను గమనించదు; కనికరించదు. అప్పుడిక నా హృదయం వ్రక్కలౌతుంది." అనుకున్నాడు విద్యార్థి.

కోకిల విన్నది. "ఆ, ఇతడే నిజమైన ప్రేమికుడు. నేను దేనినిగూర్చి పాడానో, అతడు దాని బాధ ననుభవిస్తున్నాడు. నాకు ఏ ప్రేమ సంతోషాన్నిస్తున్నదో, అది అతనికి దుఃఖకారణమవుతోంది. ప్రేమ నిజంగా అద్భుతమైంది. నవరత్నాలకంటే అమూల్యమైనది" అనుకున్నది.

"ఎందుకు పాపమా కుర్రాడు ఏడుస్తున్నాడు?"అని ఒక బల్లి అతణ్ణి దాటిపోతూ అడిగింది.

"ఎందు కబ్బా?" అని రెక్కలు మెరిపిస్తూ సీతాకోకచిలక అన్నది. మల్లెపువ్వుకూడా అలాగే అడిగింది.

"ఎర్ర గులాబీ కోసం ఏడుస్తున్నాడు" అని కోకిల జవాబు చెప్పింది.

"ఎర్రగులాబీకోసమా?" అని అందరూ నవ్వారు. "ఎంత హాస్యాస్పదం?" అని నిరాశావాదియైన బల్లి కొంచెం వెగటుగా నవ్వింది.

కాని విద్యార్థివిషాదం కోకిల కర్థమైంది. మామిడిచెట్టుఆకుల్లో కూచుని ప్రేమతత్వాన్నిగూర్చి ఆలోచనలో పడింది.

ఒక్కసారిగా లేచి, నల్లటి రెక్కల్ని విదిల్చి, ఆ తోటలో మధ్యగా వున్న ఒక అందమైన గులాబీచెట్టువద్దకు వెళ్లింది.

"నా కొక్క ఎర్రగులాబీని ఇవ్వవూ? నీకు ఎన్ని మంచి పాటలో వినిపిస్తాను" అని కోకిల చెట్టుతో అన్నది.

"అబ్బే, నా పువ్వులు తెల్లటివి. సముద్రపు నురగలకంటే, పర్వత శిఖరాలపైన పేరుకున్న మంచుకంటే తెల్లటివి. కాని అదుగో అక్కడ పెరిగే నా చెల్లెలి నడుగు. నువ్వు కోరింది ఆమె ఇవ్వవచ్చు" అని ఆ చెట్టు జవాబిచ్చింది.

కోకిల రెండో గులాబీచెట్టువద్దకు వెళ్లి "నీకు అద్భుతమైన ప్రేమసంగీతం వినిపిస్తాను. నా కొక్క ఎర్రగులాబీ నివ్వు" అని అడిగింది.

ఆ చెట్టుకూడ తలకాయ అడ్డంగా ఊపింది.

"అయ్యో! నా పువ్వులన్నీ పసుపుపచ్చనివి. కాని, ఆ విద్యార్థి కిటికీ క్రిందుగా పెరిగే నా చెల్లెలి నడుగు. నువ్వు కోరింది ఇవ్వవచ్చు" అన్నదా చెట్టు.

సరే, మళ్లీ కోకిల విద్యార్థి కిటికీ దగ్గర పెరిగే గులాబీచెట్టు వద్దకు వెళ్లి "నీకు గంధర్వగానం కంటే తియ్యని పాట వినిపిస్తాను. నా కొక్క ఎర్ర గులాబీ నివ్వు" అని అడిగింది.

కాని గులాబీ చెట్టు తల అడ్డంగా ఊపింది.

"నా పువ్వులు ఎర్రటివి. రాజహంసల పాదాలకంటే, అప్సరసల అధరాలకంటే ఎర్రటివి. కాని ఈ శీతకాలంలో నా నరాలన్నీ బిగుసుకుపోయినవి. మంచు పడి నా మొగ్గలన్నీ వడిలి పోయినవి. తుపాను వచ్చి నా కొమ్మలు విరిగినవి. ఇక ఈ ఏడాదికి నేను పువ్వు లివ్వలేను." అన్నది.

"నా కొక్కటే ఎర్రని రోజా కావాలి. ఒక్కటి చాలు. అది నాకు లభించే మార్గం లేదా?" అని కోకిల గద్గదకంఠంతో అన్నది.

"మార్గం ఉన్నది. కాని అది చాల భయంకరమైనది. నీకు దానిని చెప్పలేను." అన్నది చెట్టు.

"అయితే చెప్పు నేను భయపడను."

"నీకు ఎర్రని రోజా కావాలంటే ఈ రాత్రి వచ్చే వెన్నెలని నీ పాటతో పువ్వుగా మార్చి, దానిలోకి నీ రక్తాన్నెక్కించాలి. నాముల్లు నొకదానిని నీ గుండె కెక్కించి, దానిద్వారా నీ రక్తాన్ని పంపాలి. రాత్రి అంతా నువ్వు నాలోకి పాడుతూనే ఉండాలి. ముల్లు నీ గుండెనుకూడా ఛేదించాలి. నీ జీవనరక్తమంతా నా నరాల్లో ప్రవహించాలి. అప్పుడు నాలోనుండి ఎర్రని గులాబీ ఉద్భవిస్తుంది." అన్నది చెట్టు.

"కేవలం ఒక ఎర్ర గులాబీ కోసం అంత ధరపెట్టలేను." అన్నది కోకిల. కాని జీవితంకంటే ప్రేమ గొప్పది. పక్షి హృదయం కంటే మానవుని హృదయం గొప్పది." అని అనుకుంది.

నల్లటి రెక్కలు విప్పి ఆకాశంలో రెపరెపలాడింది కోకిల.

విద్యార్థి ఇంకా పచ్చికలోనే పడుకుని ఏడుస్తున్నాడు. అందమైన అతని కళ్లలో నీళ్లు నిలిచి మెరుస్తున్నాయి.

"ఏడవకు అబ్బాయ్. నీకు ఎర్రగులాబీ నిస్తాను. నా, గానంతో, నా రక్తంతో. ఈ రాత్రి దానిని సృష్టిస్తాను. కాని నువ్వు నాకు వాగ్దానం చెయ్యాలిడి నువ్వు నిజమైన ప్రేమికునిగానే ఉండిపోతా నని. ఎందుకంటే వేదాంతకంటే ప్రేమ గొప్పది. మహాసామ్రాజ్యం కంటే ప్రేమ గొప్పది."

విద్యార్థి తల ఎత్తి చూశాడు. కాని అతనికి కోకిల ఏం చెబుతున్నదో అర్థం కాలేదు. అతనికి పుస్తకాల్లో మాటలే అర్థమౌతాయి.

కాని కోకిలమాటలు మామిడి చెట్టుకి అర్థమయ్యాయి.

"నాకు ఆఖరిసారి పాట వినిపించు కోకిలా! నువ్వు చనిపోతే నేను ఒంట

(16వ పేజీ చూడుడు)

బాలగేయం:

జమీదార్ - మల్లిమొగ్గ

సంపాదన: చి. నెక్కలపూడి రామచంద్రము

కాకీ కాకి గవ్వలకాకి
కాకిని పట్టికెళ్లి గంగలో ముంచి
గంగా నాకూ గంధం ఇచ్చె
గంధం పట్టికెళ్లి ఆవుకు రాయ
ఆవూ నాకూ పాలూ ఇచ్చె
పాలూ పట్టికెళ్లి అమ్మకు ఇచ్చి
అమ్మా నాకూ జున్నూ ఇచ్చె
జున్నూ పట్టికెళ్లి అక్కా కివ్వ
అక్కా నాకూ దారం ఇచ్చె
దారం నేనూ సాలీ కివ్వ
సాలీ నాకూ దుప్పటి ఇచ్చె
దుప్పటి నేనూ పంతుల కివ్వ
పంతులు నాకూ చదువూ చెప్ప
చదువూ నేనూ మామా కివ్వ
మామా నాకూ పిల్లా నిచ్చె
పిల్లపేరు మల్లి మొగ్గ!
నాపేరు జమీదార్!

పిల్లలు వ్రాసిన కథలు:

శకున ఫలితం

చి. సబ్బిశెట్టి సుబ్బారావు

అనగా అనగా ఒక వూరిలో ఒక రాజు వుండెను. వాని వద్ద ఒక మంత్రి వుండెను. ఒక రోజున రాజు మంత్రితో 'నేను బయటకు వచ్చుసరికి రెండు కాకులు ఉన్న రమ్మని చెప్పు. ఒక కాకి ఉన్న శకునము మంచిది గాదు, చెప్పవద్దు' అనెను. మరునాటి ఉదయమున శకునము చూచి రాజు చెప్పిన చొప్పున మంత్రి బయట రెండు కాకులను చూచి రాజును రమ్మని చెప్పెను. రాజు బయట అడుగు పెట్టగానే ఒక కాకి ఎగిరి పోయెను. రాజు ఒక కాకి నే చూచెను. మంత్రితో రెండు కాకులుండగా చెప్పమంటే, ఒక కాకి ఉండగా చెప్పినావు అని, రాజు మంత్రి తల నరకమని సేవకులను పిలచి చెప్పెను. అప్పుడు మంత్రి చేతులు కట్టుకొని 'ఈ రోజు మీరు ఒక కాకి ఉండగా బయటకు వచ్చినారు. నేను రెండు కాకులను చూచినాను. అందుచేత రెండు కాకులకంటె ఒక కాకిని చూస్తే శకునము మంచిది. నేడు నేను రెండు కాకులను చూస్తిని. అందు చేత మీరు నా తల తీయించుచుండిరి. మీరు ఒక కాకిని చూచుట చేత సుఖముగా నుండిరి' అని చెప్పెను. మంత్రి మాట విని శకునఫలితములో గల నిజమును తెలుసుకొని మంత్రిని విడిచిపుచ్చెను.

దండనాథులు:

కొట్టరువు సిద్ధనామాత్యుడు

శ్రీ కోన వెంకట్రాయ శర్మ

ఆకాలమున నార్వేల నాటిలో, ప్రఖ్యాతి జెందిన నియోగి బ్రాహ్మణ కుటుంబము లలో మంత్రి భాస్కరుని కుటుంబ మొకటి. మారెనమంత్రి మనుమడును కేతనమంత్రి కొమారుడును నగు భాస్కరమంత్రి క్రీ. శ. ౧౨ వ శతాబ్దాంత్యమున బూర్వ చలుక్య చోడ చక్రవర్తులకు బ్రతినిధులై వేంగిదేశ మనబడు నాంధ్రభూభాగమును బరిపాలించుచున్న "ధనదుప్రోలు" రాజన్యుల యధికారమున గుంటూరి సీమను బాలించి విశ్రుతు డయ్యెను. వెలనాటి మహామండలేశ్వరులలో నొకరుం డగు పృథ్వీశ్వర మహారాజు "ధనదప్రోలు" రాజధానిగా నెల్లూరు మొదలుకొని సింహాచలముదాక గల తీరాంధ్ర దేశమును బరిపాలించుచుండెను. ఇతడు చలుక్య చోడ చక్రవర్తికి లొంగినవా డని చెప్పికొనబడు టయే గాని క్రీ. శ. ౧౧౬౫ దవ సంవత్సరము వఱకును స్వతంత్రుడై యేల్బడి సాగించెను.

ఇతని క్రింద యధికారులలో నొకరుడై గుంటూరి సీమను బాలించినవాడు మంత్రి భాస్కరుడు. కావుననే కవిబ్రహ్మ తిక్కన సోమయాజి తన "నిర్వచనోత్తరరామాయణము"న

"సారకవితాభిరాముఁ గుంటూరివిభుని
మంత్రి భాస్కరు మత్పితామహుని దలచి"

అని చెప్పికొనగలెను. మూలఘటిక కేతన తన "దశకుమారచరిత్రము"న భాస్కరుడు సాహిత్యవిద్యాపారీణుడు, శాపానుగ్రహ సమర్థుడు, ధర్మమార్గపథికుడు, అమలాచారుడు, అర్థార్థిలోకావనవ్యాపారవ్రతుడు, గౌరీపతి శ్రీపాదప్రవణాంతరంగుడు, వివిధశ్రేయస్కరుడు—అని మంత్రి భాస్కరుని వర్ణించుట వలన నత డసామాన్యపురుషుం డని విదిత మగుచున్నది.

ఈ భాస్కరునకు, గౌమ్మాంబ మహాసాధ్వి గర్భమున జనించిన నల్వుర కొమాళ్లలో మూడవ వతడు సిద్ధనామాత్యుడు. నాల్గవ యతడు కొమ్మనామాత్యుడు. ఇతడు మంత్రి భాస్కరుని యనంతరము గుంటూరి సీమను బరిపాలించెను. కావుననే తిక్కకవియజ్వ—

"మజ్జనకుండు సన్మాన్య గౌతమ గోత్ర
మహితుండు భాస్కరమంత్రి తనయు
డన్నమాంబాపతి యనఘులు కేతన
మల్లన సిద్ధనామాత్య వరుల
కూరిమి తమ్ముండు గుంటూరి విభుడు కొ
మ్మన దండనాథుడు మధురకీర్తి
విస్తరస్ఫారు డాపస్తంబ సూత్ర ప
విత్రశీలుడు సాంగవేదవేది"

అని విరాటపర్వమున దన తండ్రిని నభివర్ణింపగలెను.

సిద్ధనామాత్యుడు తిక్కరాజునకు ప్రధానమంత్రియు సేనాపతియునై తేజరిల్లె నని కేతన—

'స్థాపిత సూర్యవంశ వసు
ధాపతినా బరతత్త్వ ధూతి వా
ణీపతినా నుదాత్త నృప
నీతి బృహస్పతినా గృహస్థ గౌ
రీపతినా గృపారస స
రస్వతినా బొగ డొందె సిద్ధసే
నాపతి ప్రోడ తిక్కజన
నాథశిఖామణి కాప్తమంత్రియై"

అను (దశకుమారచరిత్రము) పద్యమున విస్పష్ట మొనర్చినాడు. సిద్ధన తిక్కరాజునకు మంత్రివల్లభుడుగా నుండెనని (*Nellore Inscriptions published by Butterworth and Venugopala Chetti*) శాసన మొకటి యవగత మొనర్చుచున్నది. భాస్కరుని తండ్రి కేతన కమ్మనాటిని బరిపాలించిన త్రిభువన మల్లదేవ నికి మంత్రిసత్తముడుగా నుండెను. భాస్కరుని కొమాళ్లగు మల్లన, కేతనలు కమ్మనాటి చోడుల కొలువులో బ్రఖ్యాతాయుతులు.

రవివంశ క్షత్రియాన్వయులే తెలుగు చోడ చక్రవర్తులు. ఇవ్వంశజులకు మూలపురుషుడు కరికాల చోడుడు. ఇతడు త్రిలోచనపల్లవుని నిర్జించి కావేరినదికి నవకట్ట (*Anicut*) గట్టించెనని తిక్కనసోమయాజి తన 'నిర్వచనోత్తరరామాయణము'న—

"చేసేతం బృథివీశు లందుకొనగా
శ్రీ సింధుతోయంబుల
జ్జేసె న్మజ్జన మంగిటంబున హరిం
చెం బల్లవోర్వీశు న
ల్లాసం బొందగ, ఫాలలోచనము లీ
లం గట్టె గావేరి, హే
లా సాధ్యాఖిలదిఙ్ముఖుండు కరికా
లక్ష్మావిభుం డల్పడే"

అను పద్యమున విస్పష్టము సేసినాడు. ఈ కరికాలభూవిభునకు మహిమానుడును, వానికి గరికాల, తొండమాన, దాసవర్మ లను మూవురు కొమాళ్లును. గలరని శాసనము లుద్ఘోషించుచున్నవి. కరికాలుని వంశమున బిజ్జన జనించెను. ఇతడు—

"పురుషపరాక్రముం డనుచు
బల్లవుపీట ముదగ్రులైన ప
న్నిరువుర నాతనిం గలయ
నెన్ని యనర్గళ మత్సరంబునై
మురరిపు సన్నిభుండు—పగు
మువ్వుర గండడ గంగ బెట్టె దా
బిరుదు వెలుంగ "బిజ్జ" డరి
భీకర భూరి భుజాబలంబునన్."

అను నిర్వచనోత్తర రామాయణమందలి పద్యముం బట్టి నిర్వక్రవిక్రమోదారుం డని తెలియనగుచున్నది. ఈ బిజ్జన ఉఱ్ఱ్యపురమున శిఖరముపయిం గరుడవిగ్రహము గల జయస్తంభ మొకదాని వినిర్మించె నని యొక శాసనమున నుదాహరింపబడి యున్నది. ఇతని వంశమునసే మన్మసిద్ధి యుదయించి విశ్రుతు డయ్యెను. చలుక్య చోడ చక్రవర్తి యైన మూడవ కులోత్తుంగ చోడనికి మన్మసిద్ధి కప్పము సెల్లించెడు సామంతుడై క్రీ. శ. ౧౨ వ శతాబ్దాంత్యమునను బదుమూడవ శతాబ్దారంభమునను కావలి నుండి కంచివఱకును గల దేశమును బరిపాలించినట్లు శాసనాద్యాధారము లగపడుచున్నవి. ఇతడు "వల్లూరు" రాజధానిగా "మార్జవాడి" రాజ్యమును బాలించుచు గాంచీ (*Conjeeveram*) పయి దండెత్తి యా వల్లభునిచే గప్పము గైకొనుచుండె నని (*S. I. I. Vol, P. iii 218.*) విదిత మగుచున్నది. ఈ మన్మసిద్ధికి దక్కనృపాలు డుదయించెను. తెలుగు చోడ చక్రవర్తులలో నిత డొక్కడు. శైవమందె యితడు వెలనాటి పృథ్వీశ్వరునితో దలపడి, వాని తల ద్రుంచి, యా మస్తకముతో గందుక క్రీడ గావించినా డని—

"కేశవ సన్నిభుండు పరి
గీత యశోనిధి చోడ తిక్కధా
త్రీశుడు కేవలుండె నృపు
లెవ్వరి కా చరితంబు గన్గునే
శైశవలీల నాడు పటు
శౌర్య ధురంధరబాహుడైన పృ
థ్వీశ నరేంద్రు మస్తకము
నేడ్తెఱ గందుకకేళి సల్పడే"

అను 'నిర్వచనోత్తరరామాయణ' మందలి పద్యము ద్యోతింపజేయుచున్నది. మన్మసిద్ధి తర్వాత దిక్కనృపాలుడు విక్రమసింహపురము (*Nellore*)న బట్టాభిషిక్తుడై మూడవ కులోత్తుంగ చోడనికి లోబడిన వాడుగా బ్రవర్తించినను స్వతంత్రుడై యేల్బడి సాగించెను. ఇవ్విషయము లన్నియు గేతన మహాకవి—

"బలిమిచే బృథ్వీశు వసుధేశు తల ద్రుంచె
గటక సామంతుల గర్వ మడచె
గాళవ విభు నహంకారంబు మాన్పించె
బాండ్యుని చేత గప్పంబు గొనియె
ద్రవిడ మండలికు లందఱ దక్క గెలిచి చో
డని నిజరాజ్య పదమున నిలిపె
నెఱుకు మన్నీల నెవ్వాఱ పుట్టగా జేసె
వైరివీరుల నామలూరు నోర్చె
యోధ హరిరాయ పెండెరు రుభియ కటక
వీరు డభినవ భోజు డాకార మదను
డని భౌరద్వాజేయ మహాత్మ విజిత
దిక్కరీంద్రుడు ఘన చోళ తిక్కనృపతి"

అని తన 'దశకుమారచరిత్రము'న జెప్పియే యున్నాడు. ఇద్ధరారమణుండు శంభురాజాది శత్రుయూథంబుల బీచమడంచి కాంచీపురమును బరిపాలించెనని 'నిర్వచనోత్తర రామాయణ' మందలి—

"లకుమయ గురుము లూరికి నెత్తివచ్చిన
గొనడె యాహవమున ఘోటకముల
దర్ప దుర్జయు లగు దాయాద నృపతుల
ననిలోన బఱపడే యాగ్రహమున
శంభురాజాది ప్రశస్తారిమండలి
కము జెర్చి యేలడే కంచిపురము
జేది మండలము గాసిగ జేసి కాళవ
పతి నియ్య కొలుపడే పలచమునకు
రాయగండ గోపాలు నరాతి భయద
రాయ పెండార బిరుదాభిరాము నుభయ
రాయ గండాంకు ఖండియరాయు దిక్క
ధరణి విభు బోల రాజుల కరిద గాదె?"

అను పద్య మవగత మొనర్చుచున్నది. కంచియందలి 'అరుళాళ పెరుమాళ్ల' దేవాలయములోని క్రీ. శ. ౧౨౩౩–౩౪ నాటి తిక్కనృపాలుని శాసనముంబట్టి యితని పూర్వులు శైవమతావలంబు లయ్యును ఇతడు మాత్రము వైష్ణవమతావలంబియై తన యేల్బడి ప్రదేశమున బలుతావుల విష్ణ్వాలయముల నెలకొలిపి వైష్ణవమత పోషకుడై వర్తించెనని తెలియందగును. అయినను పరమతద్వేష మీషణ్మాత్ర మేని లేక యుండినట్టులే యగపడుచున్నది. మన్మసిద్ధి తిక్కనృపాలురు గావించిన యుద్ధములలో బ్రచండ దండనాథుడగు సిద్ధన పాల్గొని తన యనుపమాన బాహుబల దర్పముల నగపఱచి యసమాన శౌర్యధనుం డని ప్రసిద్ధి నెందెను.

సిద్ధనామాత్యుడు తిక్కరాజునకు మంత్రిగా నుండి యతడు (తిక్కనృపాలు ననంతరము) చనిపోయిన తర్వాత గూడ గొన్నాళ్ల వఱకు బ్రదికియుండినట్టు గగుపడుచున్నది. తిక్కరాజు—

"భృత్యానురాగంబు పెంపు జెప్పగ నేల
పరివార సన్నాహ బిరుదు గలుగ
వంది ప్రియత్వంబు వర్ణింపగా నేల
పాఠక పుత్త్రాఖ్య పఱగుచుండ
సకల విద్యా పరిశ్రమము దెల్పగ నేల
కవిసార్వభౌమాంక మవని జెల్ల
సుభగతా మహిమ బ్రస్తుతి సేయగా నేల
మన్మథ నామంబు మహిమ నెగడ
నుభయ బలవీరు డను పేరు త్రిభువనముల
బ్రచురముగ ఘోర బహు సంగరముల విజయ
లక్ష్మి జేకొను బాహు బలంబు సొంపు
పొగడె నేటికి గలికాల భూవిభునకు"

అను 'నిర్వచనోత్తరరామాయణ' పద్యమును బట్టి విద్వాంసుడు, "కవిసార్వభౌమ" బిరుదాంచితుడు, "కరికాలభూవిభు" డను నభిధేయము గలవాడు నని స్పష్టమగుచున్నది. ఇట్టి వీరవిక్రమాదిత్యుడు విద్యావిభవ సంపన్నుడు నగు తిక్కనృపాలునొద్ద బ్రచండ దండనాథుడై తేజరిల్లినవాడు సిద్ధనామాత్యుడు. ఇతని గృహము ప్రత్యహ మెట్టు లుండెడిదో సచివోత్తముడై—

"వీరవివాదంబు వేదనినాదంబు
పాయక యెప్రొద్దు మ్రోయుచుండు
భూసుర ప్రకరంబు సేసలు సల్లంగ
బాయ కెన్నియొ కుటుంబములు బ్రదుకు
బ్రాహ్మణావళికి ధారలు పోసిన జలంబు
సతతంబు ముంగిట జాలువాఱు
రిపుల కొసగిన పత్త్రికల పుత్త్రికలను
బాయక కరణముల్ వ్రాయుచుంద్రు
మాన ఘనుడైన సిద్ధనామాత్యు నింట
మదన సముడైన సిద్ధనామాత్యు నింట
మహిత యశుడైన సిద్ధనామాత్యు నింట
మంత్రి మణి యైన సిద్ధనామాత్యు నింట."

—అను పద్యము దెలుపుచున్నది. వేద వేదాంగాది సమస్త విద్యల నభ్యస్త మొనర్చి, పవిత్ర శీలుండయి, బ్రహ్మర్షియై, తన దరోద్ధతిని అద్యతన జగత్ప్రాణసుతుండయి, పరధన దారాపహారాణానభిజ్ఞత నూత్న గంగాతనూజుండయి, యర్థార్థి జన వాంఛితార్థ సంపూర్ణ వితీర్ణమై యభినవ కర్ణుడై, కామినీచిత్తాపకర్షకారణ శుభాకార సంపద వింతకంతుడై, ధీరతా గుణమున మేరు మహీధరమై, గభీరవృత్తి నబ్ధియై యశస్సు గడించిన సిద్ధన మంత్రి తన కొమారుడగు తిక్కన పాలేటి యొద్దున నున్న "పంచలింగాల" కడ జరగుచున్న యుద్ధము నుండి పరాభూతుడై గృహోన్ముఖుడయ్యె నని తెలిసికొని జరాభారమున నటునిటు గదలలేక శయ్యాగతుడై యున్నను గ్రోధారుణాలోచనుండయి—

"రణరంగమున మోహరంబులు పొడగని
ప్రాణంబు దాచిన పంద గజము
విజయాధిపుని దాడి వెఱకొని తిరుగక
వెస దప్పి వచ్చిన దిగ్గజంబ
పోర జాలక యోడి మారు మాటల మాని
మంచాన గొఱగిన మత్త గజము
పెనుపల్లి వెలువులో బిరుదు లన్నియు రొంపి
గ్రుంగంగ వచ్చిన కుంజరంబ
నేడు మొదలు సేసి నెల్లూరిసీమలో
బగ పతనము మాని మగిడి తలల
బూరి గఱచి తిక్క! భూతంబు సోకిన
బాఱు వాని రీతి బందవైతి."

అని యుపాలంభ మొనర్చినాడు. ఇయ్యుపాలంభమున దన కొమారుని శక్తిసామర్థ్యములు త్తంగితములై యున్నను రణభూమినుండి మఱలు బెగ్గడతనమునకు లోటు వాటిల్లుట యని బిట్టు వాపోయినట్టు లగపడుచున్నది.

ఆ పోటు మాటలు ములుకులై రోమ కూపముల దాక మానాభిమానములు ముప్పిరి గొన్నవాడగుట దా జేసిన పనికి బశ్చాత్తప్తుడై మన్మసిద్ధి నొడం బఱచి వలయు సేన దోడ్కొని రణరంగమున శాత్రవ యూథంబుల బీచ మడంచి ప్రచండయుద్ధము సేసెను. సిద్ధనామాత్యుని యేడ్వుర పుత్త్రులలో మొదటివాడీ రణతిక్కన.

సిద్ధనమంత్రి వహించిన మంత్రిపదవి, దండనాథ పదవి, నిజకులక్రమాగతంబైన దని కేతన మహాకవి చెప్పిన—

"అందలంబు గొడుగు లడపంబు మేల్కట్టు
చామరములు జమిలి శంఖములును
గంబగట్లు భూమి కానిక గాగ బెం
పెసగు రాచపదవు లెల్ల బడసె"

అను పద్యము ననుసరించి తెలియనగుచున్నది. ఇతడు వేడిన నర్థార్థి వృథవుచ్చ నేఱని దాని యనియు, వెదరిపోవ జముడైన బ్రదికిపోవగనీని శౌర్యధను డనియు, శరణు సొచ్చిన శత్రువరు నేలి రక్షించువాడనియు, బలికిన బాండవ ప్రభు నేని మెప్పించు సత్యవంతు డనియు జగతి నుతికెక్కినాడు.

ఇ వీరవిక్రమాదిత్యునకు నమోవాకములు!

———

నేటిప్రపంచం :

ఈ సంవత్సరమే ప్రపంచ యుద్ధం సంభవిస్తుందా?

ఈ సంవత్సరమే తృతీయ ప్రపంచ సంగ్రామం సంభవిస్తుందని ప్రఖ్యాత అమెరికన్ రాజకీయ జోస్యకారుడు, డ్రూపియర్సన్ ఇటీవల ఒక వ్యాసంలో సూచించాడు.

రష్యా ముందుగా శాంతికోసం తాపత్రయం పడుతున్నట్లు ఐక్యరాజ్య సమితిలో కొన్నాళ్లు నటించి, తరువాత ఉత్తర అట్లాంటిక్ ఒడంబడికను భగ్నంచెయ్యడానికి ఏ నార్వే దేశంపైనో ఏదో సాకు పెట్టి దండయాత్ర చేస్తుందని ఇతను జోస్యం చెప్పుతున్నాడు. అయితే బట్టబయలుగా దండయాత్రకూడా చెయ్యదుట. ఆ దేశంలో కమ్యూనిస్టుల్ని తిరుగుబాటు లేవదియ్యమని పైచేసి, ఆ దేశంలో ఏదో కొంత ప్రాంతంలో కమ్యూనిస్టులతో ఒక ప్రభుత్వాన్ని స్థాపింపచేసి, (గ్రీస్ మాదిరిగా) ఆ ప్రభుత్వంచేత సహాయం కోరించుకుని, ఆపైన రష్యా తన ఎర్ర సైన్యాన్ని పంపుతుందన్నాడు. అటువంటి నార్వేలో కాకపోతే పర్షియాలో జరగవచ్చును. ఏమయితేం పశ్చిమదేశాల్తో, అంటే ఉత్తర అట్లాంటిక్ దేశాల్తో బలాబలాలు పరీక్షిస్తుందట.

అట్లాంటిక్ ఒడంబడికని మాస్కో ఏ దృష్టితో పరిశీలిస్తుందో గమనించి ఇలా దండయాత్ర జరుపుతుందని అతను అంచనా వేశాడట. మాస్కో అభిప్రాయాలు ఈక్రింది విధంగా ఉంటాయని వివరించాడు.

1. అట్లాంటిక్ ఒడంబడికతో మధ్య యూరప్‌లో రెండు సైనిక శ్రేణులు ఏర్పడతాయి. ఒకటి ఆంగ్లో - అమెరికన్ బలాల ఆధ్వర్యంక్రింద పశ్చిమయూరప్ రాజ్యాలలోనూ, మరొకటి రష్యా అధిపత్యంక్రింద తూర్పు యూరప్ రాజ్యాల్లోనూ. పశ్చిమ యూరప్ రాజ్యాల్లో శ్రేణి నిర్మాణం ఇంకా ఇప్పుడిప్పుడే ఆరంభ మవుతోంది కాబట్టి, అది పూర్తి కాకముందే యుద్ధం ఆరంభమయితే అది లాభకరమని రష్యా అభిప్రాయపడుతుంది.

2. రష్యాలో రాజకీయ అధికారవర్గమైన పోలిట్ బ్యూరో పద్ధతేమిటంటే, ఏ దేశాన్నైనా తన ఆధిపత్యంక్రిందికి తెచ్చుకోవాలనుకున్నప్పుడు, ఆ దేశంలో సామాన్య ప్రజలపైనా, వారిలో ప్రచారం, కమ్యూనిస్టుపార్టీ పన్నాగాలపైనా ఆధారపడి ఉంటేది. ఇప్పుడు మార్షల్ ప్రణాళిక పేరుతో ఆర్థికంగా అమెరికా సహాయం పొందుతున్న పశ్చిమ యూరప్‌లో ప్రజలు క్రమంగా కమ్యూనిస్టుపార్టీలని బలపరచడం మానేశారు. ఇంకముందు ఈ దేశాల్లో పోలిట్ బ్యూరో పద్ధతులు సాగవు కాబట్టి, ఆ పద్ధతులు మాని ఎంత త్వరలో దండయాత్ర చేస్తే అంతమంచిదని మాస్కో అభిప్రాయపడుతోంది. ఇప్పటికే రష్యా మధ్య యూరప్‌లో బాల్టిక్ సముద్రతీరంనుంచి బాల్కన్ దేశాలవరకూ దిట్టమైన రక్షణ శ్రేణులు నిర్మించింది. శ్రేణి పొడుగునా రష్యన్ సైన్యాలు నిలవరించి ఆయుధసామగ్రి మందుగుండు సామగ్రి గుట్టలుగా పేర్చి విమానాశ్రయాలు నిర్మించి ఉంచారు. దీనికి తూర్పుగా రష్యాలో ఒక శ్రేణి నిర్మించారట. అది విల్నానుంచి కీవ్ వరకూ నిర్మించబడిందట. ఆ శ్రేణికి అవతల మందుగుండు సామగ్రి, ఆయుధాలు తయారుచేసే ఫాక్టరీలున్నాయి. ఆంగ్లో - అమెరికన్ విమానాలు వచ్చి బాంబులు వేస్తాయేమోననే ఉద్దేశంతో ఫాక్టరీలన్నిటినీ రష్యాలో దేశం మధ్యలోనే నెలకొల్పుతున్నారు. ఈ పక్కనున్నవాటిని అటు జరుపుకుపోతున్నారు.

వీటికి ప్రతిగా పశ్చిమదేశాలు 35 యూరోపియన్ సైన్యదళాల్ని నిలవరించడానికీ దిట్టమైన రక్షణశ్రేణి నిర్మించడానికీ యత్నిస్తున్నాయి. రైన్‌నదీ తీరంలో ఈ శ్రేణి నిర్మించడానికి మూడు సంవత్సరాలు పట్టుతుంది. నిర్మాణం పూర్తి అయిందంటే రష్యా అటువైపు ఒక్క అడుగు వెయ్యలేదు.

ఏటంబాంబు

అయితే రష్యా యుద్ధం ప్రకటించకుండా వెనకాడానికి ఏటంబాంబు ఒక్కటే హేతువని పియర్సన్ అన్నాడు. కాని రష్యావంటి విశాల భూభాగంలో, పట్టణాలు చెల్లాచెదరుగా అక్కడాఅక్కడా ఉన్నందువల్ల అమెరికా ఏటంబాంబుల్ని ఎక్కడ వేస్తుంది? ఎల్లా వేస్తుంది? అక్కడ ఏటంబాంబులు ప్రయోగించాలంటే విమానాలు చాలాదూరం ప్రయాణం చేసి వెళ్లాలి. తెగించి వెళ్లినా ఏదో ఒక చిన్న పట్టణం చెదురుగా కనిపిస్తుంది. ఆ ఒక్కదానిపైనా లక్షలరూపాయల విలువైన ఏటంబాంబు పాడుచెయ్యలేరు. ఈలోగానే రష్యా, లండన్, పారిస్, రోమ్, కోపెన్‌హాగన్, ఆస్లో నగరాల్లో వేటిని ఆక్రమించుకున్నా వాటిపైన అమెరికన్లు ఏటంబాంబులు వెయ్యలేరుగదా. వాళ్లని అక్కడనించి వెళ్లగొట్టడం అసాధ్య మవుతుంది.

ఇవన్నీ ఇల్లా వుంచి, సైబీరియాలో ఉన్న 22 సైనికదళాల్లో 15 దళాల్ని రష్యా యూరప్‌లోకి మార్చిందనికూడా పియర్సన్ చెప్తున్నాడు. 1940 లో జపాన్ పెర్ల్‌హార్బర్‌పైన దాడిచేసే ముందు అమెరికాలో బాంకుల్ని మూసేసినట్లు జెకోస్లావాకియా ఇప్పుడు బాంకులు మూసేసింది. తూర్పు యూరప్ దేశాల సైన్యాలు సమీకరించబడుతున్నాయి.

ఇవన్నీ చూస్తే రష్యా త్వరలోనే యుద్ధానికి దిగుతుందని పియర్సన్ చెప్తున్నాడు.

ఉభయపక్షాల బలాలు ఇప్పుడు దాదాపు సరిసమానంగా ఉన్నట్లు ఉభయులికీ తెలుసునని చెప్తూ ఇందువలన ఈ సంవత్సరం యుద్ధభయం ఉందని అతను వాదించాడు. అమెరికాలో ప్రఖ్యాత పత్రికా రచయిత డ్రూ పియర్సన్ ఇటువంటి జోస్యాలు చెప్తూ ఉంటాడు. చాలా జోస్యాలు నిజమైనాయని చెప్తారు. అమెరికన్ ప్రభుత్వ వర్గాల్లో రహస్యాన్ని ఇట్టే కనిపెడతాడు. ప్రభుత్వ వర్గాలకి అతనంటే భయం. అధ్యక్షుడు ట్రూమన్‌కి అతని పేరు చెప్తే కారం రాసుకున్నట్లుంటుంది. పియర్సన్ ప్రభుత్వ రహస్యాల్ని కనిపెట్టగలడనే కారణం వల్లనే ట్రూమన్‌కి అంత కోపంట. అతను హిట్లర్ సైనికచర్యల్ని జోస్యం చెప్పగలిగాడట. దీన్ని బట్టే ఈ జోస్యాన్ని పూర్తిగా త్రోసిపుచ్చడానికి వీల్లేదు.

రష్యా ప్రచారం

ఈ జోస్యంమాటెల్లా ఉన్నా, పశ్చిమ యూరప్ రాజ్యాల్లో ప్రజల్లో అట్లాంటిక్ ఒడంబడికకు విరుద్ధంగా రష్యా తీవ్రప్రచారం ప్రారంభించింది. అట్లాంటిక్ ఒడంబడిక దురాక్రమణోద్దేశంతోనే కాని స్వదేశరక్షణకోసం జరగలేదని మాస్కో రేడియో చెప్పింది.

తనతో బ్రిటన్, ఫ్రాన్సులు చేసుకొన్న ఒడంబడికలకీ, అగ్రరాజ్యాలు చేసుకొన్న యాల్టాపోట్స్‌డామ్ ఒప్పందాలకీ అట్లాంటిక్ ఒడంబడిక విరుద్ధమని చెప్పింది. అట్లాంటిక్ పాక్టు దేశాలన్నిటికీ రష్యా అసమ్మతి సూచక పత్రాలు పంపింది. ఈ ఒడంబడిక ఐక్యరాజ్య సమితి సూత్రాలకు విరుద్ధమని చెప్పింది. పశ్చిమ యూరప్ రాజ్యాల్లో ప్రజలకి నిజంగా ఒడంబడిక పట్ల ఇష్టం లేదని ప్రచారం చేస్తోంది. ప్రజలే ఈ ఒడంబడికని భగ్నం చెయ్యగలరని చెప్తోంది.

ప్రపంచశాంతి సాధన సమావేశం అనే పేరుతో బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేస్తోంది. ఈ సమావేశం ఏప్రిల్ 20 వ తేదీన జరుగుతుంది. ముఖ్యంగా వివిధదేశాల కమ్యూనిస్టు నాయకులు, అతివాద వర్గానికి చెందిన రచయితలు ఈ సమావేశంలో పాల్గొంటున్నారు.

మరొక ప్రపంచశాంతి సమావేశం న్యూయార్కులో మార్చి 25వ తేదీని జరుపబోతే కొంతమందిని పోలీసులు అరెస్టుచేశారు.

ఈ శాంతిప్రచారానికి బ్రిటిష్ కార్మికపక్ష నాయకుడు హెరాల్డ్ లాస్కీకూడా తోడైనాడు. (కార్మికపక్షం అంటే ఇప్పటి ప్రభుత్వ పక్షం.) ఐసెన్‌హోవర్, మౌంట్‌బాటన్, బ్లమ్ (ఫ్రెంచి సోషలిస్టు నాయకుడు) మొదలైనవారిని మాస్కో పంపి ఉభయ పక్షాల మధ్యా శాంతిసాధనకి యత్నం చెయ్యాలని ఒక సూచన చేశాడు.

ఈ శాంతిప్రచారాలతో రష్యా తన అంతర్జాతీయ కమ్యూనిస్టు కార్యక్రమాన్ని మరొక స్థాయికి తీవ్రతరంగా సాగిస్తోందన్నమాట. త్వరలోనే వివిధదేశాల్లో కమ్యూనిస్టుప్రచారం, అరాచక చర్యలు తీవ్రంగా జరగవచ్చని రాజకీయవాదులు చెప్తున్నారు. గ్రీస్, ఇరాక్, అరేబియా, తూర్పుఆసియా దేశాల్లో కమ్యూనిస్టు విప్లవ ప్రయత్నాలు త్వరలోనే జరగవచ్చును.

అమెరికన్ సామ్రాజ్యం

అయితే అమెరికన్ కాంగ్రెస్‌లో మార్షల్ ప్రణాళికక్రింద పశ్చిమయూరప్ దేశాలకి ఆర్థిక సహాయానికే మంజూరు చెయ్యడానికి చర్చలు తెగడంలేదు. దేశరక్షణవ్యవహారాలకింద యూరప్ దేశాలకి ఇంకెంత ఖర్చుపెట్టాలో, కాంగ్రెస్ ఎన్ని తిప్పలు పెట్టి చివరికి మంజూరు చేస్తుందో తెలియదు. ఎంత ఖర్చుపెట్టడానికి సిద్ధంగా ఉన్నారో తెలియదుగాని బ్రిటన్, ఫ్రాన్సు మొదలైన దేశాలు దేశరక్షణ శాఖల ఖర్చులు హెచ్చించుకోవాలని వాషింగ్టన్ శ్రీముఖం పంపింది. ఆర్థికవ్యవహారాల్లో ఆ దేశాలు ఏ రీతిగా వ్యవహరించుకోవాలో మార్షల్ ప్రణాళిక ద్వారా వాషింగ్టన్ ఉత్తరువులిస్తోంది. అంటే పశ్చిమయూరప్ రాజ్యకూటానికి అమెరికా యజమాని అయిందన్నమాట. అంటే ఈ యాజమాన్యం పూర్వం మన దేశంలో బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ యాజమాన్యంలో స్వదేశ రాజ్యాల రక్షణ, లేదా బ్రిటిష్ ప్రభుత్వ పరిపాలనలో స్వదేశసంస్థానాల్లో బ్రిటిష్ రెసిడెంట్లు, పొలిటికల్ ఏజంట్ల యాజమాన్యం వంటిది. దీనికే యూరప్‌రాజ్య సమాఖ్య అనే పెద్ద పేరు పెట్టబోతున్నారు. చర్చిల్ కలలుగన్న యూరప్‌రాజ్యసమాఖ్య ఇది గాదు. బ్రిటన్ పెత్తనం కింద లండన్ రాజధానీనగరంగా యూరప్‌రాజ్యాలన్నిటినీ ఏకైక పరిపాలన కిందికి తేవాలని చర్చిల్ కలలు కన్నాడు. చర్చిల్ ద్వితీయ ప్రపంచసంగ్రామానికిపూర్వం చేసిన కృషికి కృతజ్ఞతాసూచకంగా యూరప్ రాజ్య సమాఖ్యకి అతన్ని పితామహుడంటున్నారు. ఇటువంటి సమాఖ్యకోసం జర్మన్ పరిపాలకులు ఫ్రెడరిక్, బిస్మార్కులుకూడా తహతహలాడారు. ఇన్ని శతాబ్దాలుగా సాధ్యం కానిది ఈనాడు స్టాలిన్ పుణ్యమా అని సాధ్యపడుతోందని కొందరంటున్నారు: భారత దేశైక్యతను బ్రిటిష్ పరిపాలకులు ఎటువంటి సదుద్దేశంతో కృషి చేశారో, వారి పరిపాలనవల్ల చివరికి మనకేమి ఒలికిందో, అదే అమెరికా కృషి ఫలితంగా యూరప్‌కి ఒలకబోతోంది. ఈ ఫలితం వాస్తవంగా అంతఃకలహం, ఆర్థికదాస్యం అని మాత్రమే చెప్పాలి. యుద్ధకాలంలో సర్వనాశనమైన యూరప్‌కి అమెరికాకూడా ఇదే ప్రసాదించబోతోందని యూరప్‌లోని విజ్ఞానవంతులకీ, రచయితలకీ తెలియకపోదు. అందువల్లనే పశ్చిమ యూరప్‌రాజ్యకూటాన్ని గురించి రాజకీయ తంత్రజ్ఞులెంత పొగిడినా, చివరికి మరొకయుద్ధానికే దారితీస్తున్నారని యూరప్‌లో చెప్పుకోదగిన రచయితలూ రాజనీతిజ్ఞులూ అంటున్నారు. వారి ఘోష అరణ్యరోదనమే.

ఐక్యరాజ్యసమితి

ఈ ఉభయకూటాలవల్లా బలహీనరాజ్యాలకి శాంతి నశించింది. ఐక్యరాజ్యసమితి ఒక్కవేటుతో నిర్వీర్యమైపోయింది. ఏప్రిల్ 5 వ తేదీని సమితి సర్వసభ్య సమావేశం లేక్ సక్సెస్‌లో సమావేశమై ఇక పాతరికార్డులు తిరగేసి దీర్ఘచర్చలు జరుపుతుంది. ఇటలీ వలసల భవిష్యత్తు, దక్షిణాఫ్రికాలో భారతీయులపై దౌర్జన్యాలు, స్పెయిన్‌తో వ్యవహారాలు సమాచార సేకరణ ప్రచారాలస్వేచ్ఛ అనే విషయాల్ని గురించి చర్చ జరుగుతుంది.

ఈ నాలుగింటిపైనా అమెరికా, రష్యా, బ్రిటన్ మొదలైన దేశాలకెంత శ్రద్ధ మిగిలిందో ముందే తెలిసిపోయింది. విషయం విడిచి పెట్టి బెర్లిన్ తగాదా, అట్లాంటిక్ ఒడంబడిక పర్షియా, మొదలైన వాగ్వాదాలు జరుగుతాయి. ఒక్క నిర్ణయం జరగదు. ఐక్యరాజ్య సమితి పత్రంలో సూత్రాల్నే ఒకరిమీదొకరు ప్రయోగిస్తారు. చివరికి పత్రాన్ని తుంపుతుంపులు చేసి విడుస్తారు. భద్రతామండలికి అప్పుడే మీదిగుడ్లు పడ్డాయని జనరల్ స్మట్స్ చెప్పేశాడు. "మా కూటం మేం అనుకున్నట్టు చేరింది. రేపో ఎల్లుండో మేమూ చేరుతున్నాం" అన్నాడు.

దీని అర్థం ఆసియాదేశాలకి తెలుసు. ఆసియా దేశాలపట్ల బ్రిటన్, హాలండు, ఫ్రాన్సు ప్రభుత్వాలు ఏవైఖరి అవలంబిస్తున్నాయో, ముఖ్యంగా వానివాని వలసరాజ్యాల్లో, అంటే మలయా, ఇండొనీషియా, ఇండో-చైనాలలో ఏ పద్ధతి అవలంబిస్తున్నాయో, వలసరాజ్య పరిపాలనా విధానాన్ని తిట్టినట్లే తిట్టి చాటుగా మీ పని మీరు చేసుకుని పొండని అమెరికా చెప్తూ ఎలాతోడవుతుందో మనకి తెలుసును. భారత దేశాన్నీ, పండిట్ నెహ్రూనీ ఆ దేశాల నాయకులు ఎంతగా ఆకాశానికెత్తినా వారి తప్పులూ, దురుద్దేశాలూ కప్పుకుపోవు.

కమ్యూనిజం వ్యాప్తిని అరికట్టడానికి మాత్రమే కాకుండా, ఐరోపీయ (శ్వేత) జాతుల అధికార ప్రాబల్యాన్ని కాపాడ్డానికికూడా అట్లాంటిక్ ఒడంబడికద్వారా అమెరికా కృషి చేస్తుందనీ, అటువంటి కూటంలో దక్షిణాఫ్రికాకు చోటుండకపోదనీ స్మట్స్ చెప్పినమాటలకి అర్థం. వేరే పసిఫిక్ ఒడంబడికగాని, తూర్పు ఆసియా దేశాల కూటం గాని అవసరం లేకుండానే, ఆ దేశాల్లో కమ్యూనిజం వ్యాప్తిని అరికట్టగలం అని అమెరికన్ విదేశాంగ మంత్రి అఛిసన్ చెప్పడంలో ఇంతకంటె మరొక అర్థం కనిపించదు.

ఈ అదను చూసుకుని అట్లాంటిక్ ఒడంబడిక వాస్తవంగా యూరప్‌లో ప్రజాసామాన్యానికి ఇష్టం లేదనీ, రాజకీయ తంత్రజ్ఞుల్ని ప్రజలు ప్రతిఘటించగలరనీ రష్యా ప్రచారం చేస్తోంది. ఆంగ్లో-అమెరికన్ రాజ్యాల దుస్తంత్రాల్ని బహిరంగపరచడానికీ, తమ సదుద్దేశాల్ని, శాంతివాంఛనూ ప్రజలు నమ్మేలా ప్రచారం చెయ్యడానికీ తీవ్రకృషి చేస్తోంది. ఈ ప్రచారానికి ఐక్యరాజ్యసమితిసమావేశం ముఖ్యరంగం అవుతుంది.

అట్లాంటిక్ ఒడంబడిక పత్రం

ఈ పరిస్థితులు ఇలా ఉండగా, రష్యా ప్రచారాన్ని కించిత్తైనా లక్ష్యం చెయ్యకుండా ఉత్తర అట్లాంటిక్ ఒడంబడిక పత్రంపైన ఆయా దేశాల తరఫున విదేశాంగ మంత్రులు వాషింగ్టన్‌లో సమావేశమై సంతకాలు పెట్టేశారు. పత్రంలో నిబంధనలు ముందు ప్రకటించబడినవే. ఇంక ఏయే దేశాలు ఏరీతిగా దేశరక్షణకార్యక్రమాల్ని నిర్వహించాలో, వారివారి యుద్ధబలాలపైన ఎంతెంత ఖర్చుపెట్టాలో, వారివారి దేశరక్షణ కార్యక్రమాల్ని ఏ రీతిగా సమీకరణ చెయ్యాలో, వాషింగ్టన్‌లో వివరంగా చర్చలు జరిగాయి. ఆయా దేశాలమధ్య సహకారం అప్పుడే కనిపిస్తోంది. వీటికి వాషింగ్టన్ ముఖ్యకేంద్రం.

ఫ్రాన్సులో ఫాంటెన్‌బ్లోలో మాంట్‌గామరీ ఆధిపత్యంకింద అయిదు పశ్చిమయూరప్

దేశాల (ఫ్రాన్సు, బ్రిటన్, బెల్జియం, హాలండ్, లగ్జెంబర్గ్) దేశరక్షణకార్యక్రమాల సమీకరణకు ఒక కేంద్రం ఇదివరకే ఉంది. ఇప్పుడు పై అయిదు దేశాలకీ, నార్వే, డెన్మార్క్, ఇటలీ, పోర్చుగల్, ఐస్లండ్, కెనడా దేశాలకి అమెరికా విరివిగా ఆయుధసామగ్రి సప్లై చేస్తుంది.

ఉత్తర అట్లాంటిక్ దేశరక్షణ సలహా సంఘాన్ని ఆయా దేశాల విదేశాంగమంత్రులు సభ్యులుగా నిర్మించడానికీ, దీనికింద సైనికోపశాఖ ఒకటి స్థాపించడానికీ నిశ్చయించారు. సలహాసంఘం ఒడంబడికపత్రంపైన సంతకాలైన వెంటనే వాషింగ్టన్‌లో సమావేశం అవుతుంది.

సిరియా సైనిక విప్లవం

ఇవన్నీ చాల వన్నట్లు అమెరికాకీ, బ్రిటనుకీ మరొక గండం వచ్చి పడింది. పాలస్తీనా విభజనగురించీ, ఇజ్రాయల్ ప్రభుత్వాన్ని గురించీ శాశ్వతశాంతిసమాలోచనలు జరపాలని ఐక్యరాజ్యసమితిచేత నియమించబడిన పరిష్కర్త డా॥ రాల్ఫ్ బంచ్ కృషిచేస్తూ ఉంటే యుద్ధవిరామానికి అంగీకరించిన ఆరబ్ రాజ్యాలు ఇప్పుడు కలిసిరావడంలేదు. 1945లో పెట్రోల్ సేకరణకి సిరియాప్రభుత్వంవద్ద అమెరికా తీసుకున్న కంట్రాక్టు భగ్న మయ్యే స్థితి వచ్చి పడింది

సిరియాలో సైన్యం ప్రభుత్వంపైన తిరుగుబాటు చేసి సైనిక నియంతృత్వం స్థాపించింది.

తిరుగుబాటుకి కారణా లేవో అన్యదేశాలకి స్పష్టంగా తెలియలేదు. పాలస్తీనా యుద్ధంలో ఆరబ్ రాజ్యాలు యూదులపై గెలవలేకపోవడానికి కారణం, ఆరబ్ రాజ్యాలకి ఆయుధపరికరాలకొరత ముఖ్యమైనది. నిపుణులు వీరికి దాదాపు లేనే లేరు. ఇజ్రాయల్‌కు ఒక పెద అమెరికానుంచీ, మరొక పెద జెకోస్లొవాకియానుంచీ ఆయుధాలు విరివిగా సప్లై అయినాయి. యూదుల్లో నిపుణులు చాలామంది ఉన్నారు. అందువల్ల ఆరబ్ రాజ్యాలకు బలగం ఎంత అధికంగా ఉన్నా యూదులపైన గెలవలేక పోయారు. గెలవలేక పోవడానికి రష్యా అమెరికాల తంత్రాలే హేతువుగాని బలంలోపం వల్ల కాదనే అభిప్రాయం ఆరబ్ దేశాల్లో ఇప్పుడు ప్రబలంగా ఉంది. ఇజ్రాయల్ రాజ్యస్థాపన వల్ల అగ్రరాజ్య రాజకీయాల పట్లనూ, తమతమ ప్రభుత్వాల అసమర్థత పట్లనూ, ఆరబ్ ప్రజలకి అసంతృప్తి, క్రోధం ప్రబలంగా ఉన్నాయి

పాలస్తీనా నుంచి సిరియన్ సైన్యాలు తరలిపోవడానికి ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వం హేతువనీ, అదే లేకపోతే ఇజ్రాయల్ రాజ్యం స్థాపన జరక్కపోయేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఆరబ్ ప్రభుత్వాలు కూడా కేవలం రాజకీయతంత్రాలవల్లనే ఈ పరిస్థితి వచ్చిందని రోషంగా ఉన్నాయి. శాంతి సమాలోచనల్లో అన్ని రాజ్యాల మధ్యనూ రౌండ్ టేబుల్ సమావేశం జరగడం అంటూ వస్తే ఇజ్రాయల్ ప్రభుత్వాన్ని గుర్తించినట్లు అవుతుందనే భయంతో సమాలోచనల్లో పాల్గొనడానికి ఆరబ్ రాజ్యాలు నిరాకరించాయి.

ఆరబ్ రాజ్యాలన్నీ పరిస్థితిని తారుమారు చెయ్యడానికి ఏవో పన్నాగాలు పన్నుతున్నాయని ఇదివరకే వదంతులు వ్యాపించిఉన్నాయి. ఇప్పుడు సిరియా సైనికవిప్లవం తత్ఫలితమేనని చాలామంది భావించడానికి వీలిచ్చింది. పరాజయం పొందకపోయినా తిరుగుముఖం పట్టవలసి రావడం సిరియా సైన్యానికి భంగపాటయింది. ఇది సహించలేక దుర్బలప్రభుత్వాన్ని పడగొట్టి ప్రభుత్వాన్ని సైన్యం హస్తగతం చేసుకుంది. ఈ తిరుగుబాటుకి ఇతర ఆరబ్ ప్రభుత్వాల కుట్రకూడా ఉందనీ, తిరుగుబాటుకి రెండు రోజులు ముందుగా పాలస్తీనాలో అర్ధరాత్రివేళ రహస్యసమావేశం ఒకటి జరిగిందనీ ఒక వదంతి ఉంది. తిరుగుబాటు జరిగినవెంటనే ఇరాక్, ఈజిప్ట్ ప్రభువులు "పరిస్థితేమిటో, తిరుగుబాటుకి కారణా లేమిటో కనుక్కుందామనే" మిషతోటి స్వంతరాయబారాల్ని డెమాస్కస్ పంపారు.

పాలస్తీనా విభజనకి కూడా ఇష్టపడి స్వంతరాజ్యాన్ని వ్యాప్తిచేసుకోవాలని ప్రయత్నిస్తున్న ట్రాన్స్‌జోర్డన్ రాజు అబ్దుల్లాపైన సిరియా, ఈజిప్టు, ఇరాక్ ప్రభుత్వాలు కత్తిపెట్టాయనీ, ట్రాన్స్‌జోర్డాన్ రాజు కుట్ర లేకపోతే ఇజ్రాయల్ రాజ్యం స్థాపన కాకపోయేదని వీరు బహిరంగంగా ప్రచారం చేస్తున్నారనీ తెలుస్తోంది. అందువల్ల సిరియా తిరుగుబాటులో ఇతర ఆరబ్ ప్రభుత్వాల కుట్ర కూడా ఉందని, తెలుస్తోంది. మొత్తానికి రోడ్స్‌దీవిలో ఇన్నిమాసాలుగా ఐక్యరాజ్యసమితి పరిష్కర్త సాగిస్తున్న సమాలోచనల ఫలితంగా తాత్కాలికంగా యుద్ధం నిలిచిపోయిందే గాని, ఇజ్రాయల్ రాజ్యానికి ఇప్పుడప్పుడే శాంతి లభించే సూచనలు లేవు. ఇజ్రాయల్ పక్షం వహించి ప్రచారం చేసి రహస్యంగా ఆయుధసామగ్రి సప్లై రవుతున్నా తెలిసి కూడా తెలియనట్టు ఊరు అన్న అమెరికాపైన కక్ష కొద్దీ సిరియా కుట్రోల్ కంపెనీ ఒడంబడికని ఎగరకొట్టేస్తుందని అనుకుంటున్నారు.

బర్మా విప్లవరాజకీయాలు

బర్మాలో అంతర్యుద్ధం తీవ్రంగా సాగుతోంది. స్వచ్ఛందప్రజాసైన్యదళంలో విప్లవకారులైన వైట్‌బాండ్ దళాలు మాండలే నగరాన్ని ఆక్రమించాయి ప్రభుత్వసైన్యాలు తిరిగి వశపరుచుకున్నాయి. ప్రోమ్‌లో విప్లవకారులు స్వంత ప్రభుత్వాన్ని స్థాపించారు. ఐరావతీనది డెల్టా ప్రాంతంలో ఉత్తరభాగమంతా విప్లవకారుల అధీనంలో ఉందని బర్మాప్రభుత్వమే తెలిపింది. అంటే పెట్రోల్ గనులన్నీ విప్లవకారుల అధీనంలో ఉన్నాయన్నమాట.

స్వచ్ఛందప్రజాసైన్యదళానికి బర్మా ప్రధాని థాకిన్ నూ అధిపతి. నూ ఆధిపత్యాన్ని ధిక్కరించి అందులో అధికసంఖ్యాకులైన వైట్‌బాండ్ (తలకి చుట్టుకున్న తెల్ల రుమాలు ఈ వర్గానికి చిహ్నం కాబట్టి తెల్లరుమాలుదళం అన్నారు) మాండలేను ఆక్రమించారు. ఇంక ప్రభుత్వంపక్షాన మిగిలినవారు యెల్లోబాండ్ (పసుపుపచ్చరుమాలుదళం) అల్పసంఖ్యాకులు. కరెన్ జాతివారుకూడా ప్రభుత్వంపైన తిరుగుబాటు చేసినవారే. చిన్, మిన్ జాతులు ఇప్పుడు ఏ పక్షానికీ సహాయం చెయ్యకుండా ఉన్నారు. అయితే ఇంక ప్రభుత్వపక్షాన పోరాడుతున్న సైన్యం ఏ జాతికి చెందినది అని ప్రశ్నిస్తే, ఈ సైన్యంలో కరెన్లు మొదలైన జాతులవారందరూ ఇప్పటికీ ఉన్నారు. వారు ఆంగ్ శాన్ పట్లభక్తి విశ్వాసాలు గల యువకులు.

బర్మాలో అన్ని రాజకీయపక్షాలూ సోషలిస్టు, మార్క్సిస్టు దృక్పథం కలవారే అయినా తిరుగుబాట్లకి కారకులు ముఖ్యంగా కమ్యూనిస్టులు. తరువాత బ్రిటిష్ కంపెనీలు ఇంకా బర్మాని దోచుకుంటున్నందువల్ల ప్రభుత్వ విధానంపై అసంతృప్తి చెందినవారు. ప్రభుత్వవర్గమైనా సమయానికి వేచివుందే కాని బ్రిటిష్ వాణిజ్యాన్ని ఆట్టే కొనసాగనివ్వాలనే ఉద్దేశం వారి కెప్పుడూ లేదు.

బర్మా ప్రభుత్వానికి ధనసహాయం, ఆయుధసామగ్రి సప్లై అత్యవసరం. అవి మినహా దేశంలో యువకులు చాలామంది ప్రభుత్వ పక్షమే. ఆయుధాలే ఉంటే ప్రభుత్వం తిరుగుబాటుల్ని ఏనాడో అణిచివెయ్యగలిగేది.

వైట్‌బాండ్‌వారు చీలిపోయినా తిరిగి వారు ప్రభుత్వంతో చేరి కమ్యూనిస్టుల్ని అణచాలనే అభిప్రాయంతో, ప్రభుత్వం వారిని ఆహ్వానిస్తోంది. త్వరలో సంప్రతింపులు జరగవచ్చును. వారు మంత్రివర్గంలో చేరడానికి వీలు కలుగ చెయ్యడానికిగాను నలుగురు సోషలిస్టుమంత్రులు ఇద్దరు ఇతర మంత్రులు రాజీనామా ఇచ్చారు. వైట్‌బాండ్‌వారితో సఖ్యం కుదిరితే ఈ ఆరు స్థానాలు వారికి ఇవ్వబడతాయి.

ఎర్రగులాబీ

(14 పేజీ తరువాయి)

రిగా ఉండవలసి వస్తుంది." అని మామిడి చెట్టు అడిగింది.

వెండి మువ్వలు కిణకిణ మన్నట్టు కోకిల పాడింది.

రాత్రి చంద్రు డుదయించాడు. వెన్నెలవికసించింది. కోకిల రోజా చెట్టు వద్దకు వెళ్లి, ఒక ముల్లును గుండెలో గుచ్చుకుంది. రాత్రి అంతా పాడింది. చంద్రుడు మబ్బులదాకా వంగి ఆ పాట విన్నాడు. రాత్రి అంతా పాడింది. ముల్లు రొమ్ములోలోనికి చొచ్చుకున్నది. కోకిలజీవనరక్తమంతా గులాబీ చెట్టులోనికి ప్రవహించింది.

మొదట యువతీయువకుల హృదయాలలో క్రొత్తగా జన్మించిన ప్రేమను గూర్చి కోకిల పాడింది.

గులాబీచెట్టు చిటారుకొమ్మన పువ్వు పూసింది. ఒక్కొక్క రేకే పుట్టింది. పువ్వు పూర్తయింది. కాని అది ఉషాదేవి చరణాలలాగా, రాజహంసల రెక్కలవలె, తెల్లగా వున్నది.

"ఇంకా గట్టిగా గుచ్చుకో ముల్లును. గులాబీ ఎర్రపడకముందే తెల్లవారుతుందేమో, ఇంకా గట్టిగా గుచ్చుకో. ఇంకా" అని అరిచిందా చెట్టు.

కోకిల తన రొమ్ముని ఇంకా గట్టిగా నొక్కింది. ఆ బాధలో కోకిలకంఠం మరీ బిగ్గరగా, మరీ గంభీరంగా మారింది. కోకిల స్త్రీ పురుషుల హృదయాలలో జనించే కామతీవ్రతనుగూర్చి పాడింది.

ఈసారి చిటారుకొమ్మన పువ్వులో కొంచెం రాగవర్ణం చిగురించింది. నూత్నవధువుఅధరాలను ప్రియుడు చుంబించినప్పుడు ఆమెకపోలాలలో ఝుల్లున ప్రసరించే రాగవర్ణం చిగురించింది. కాని ముల్లు కోకిలగుండెలను ఇంకా చేరుకోలేదు. అందుచేత పుష్పహృదయంకూడ ఇంకా తెలతెల పోతున్నది.

"ఇంకా గట్టిగా. నొక్కు తెల్లవారకముందే ఎర్రగులాబీ పూర్తికావాలి."

కోకిల గట్టిగా నొక్కింది. ముల్లు గుండెను చేరుకున్నది. ఒక్కసారి కోకిలకంఠం బాధావిహ్వలమై కెవ్వున అర్చినది. బాధ ఇనుమడించిన కొద్దీ కోకిలగీతం అవ్యక్తం, ఉన్మత్తం భీకరంగా సాగింది. ఈసారి మృతితో పరిపూర్ణత చెందే ప్రేమనుగూర్చి, మృతికి వెనుక అమరత్వం పొందే ప్రేమను గూర్చి ఆలపించింది.

కొంత సేపటికి కోకిలకంఠం రుద్ధమై, గానం నిరుద్ధమైంది. ఆఖరున కోకిల తపతపలాడే రెక్కలతో మరణాన్ని పాటగా పాడింది. తెల్లని చంద్రుడు ఉదయమైనదన్న సంగతి మరచి, ఆగి విన్నాడు. ఎర్రని రోజా ఆ పాటను విని రుధిరారుణంగా కంపించింది. ఆ పాట ఉషఃపవనత రంగాలలో తేలుతూ ప్రపంచమంతటా ప్రేమసందేశం వినిపించింది.

"చూడు! చూడు! ఎర్ర గులాబీ పూర్తి అయింది. ఇక చాలు." అన్నది గులాబీ చెట్టు. కాని కోకిల మాటాడలేదు. గుండెలో ముల్లుతో క్రింద పచ్చిక మీద వ్రాలి చనిపోయింది కోకిల.

పగలు బాగా ప్రొద్దెక్కింతరవాత కిటికీ తెరచి చూశాడు విద్యార్థి.

"అరె! ఏమి అదృష్టం? ఈ ఎర్ర గులాబీ ఎక్కడిది? ఇంత అద్భుతమైన రోజాని నే నెప్పుడూ చూడలేదు. ఇంత సుందరంగా ఉండటం చూస్తే దీనికి సంస్కృతంలో చాల పెద్ద పేరుండే లాగానే వున్నది." అంటూ కిటికీలోనించి చేయి చాపి పువ్వుని కోశాడు.

తరువాత దుస్తులు వేసుకుని తన ప్రియురాలి ఇంటికి పరిగెత్తాడు విద్యార్థి.

ప్రియురాలు పూలు అల్లుకుంటూ, మధ్య మధ్య తను పెంచుకునే కుక్కని ముద్దుపెట్టుకుంటోంది.

"నీకు ఎర్ర రోజా పువ్వుని తెస్తే నాతో నాట్యం చేస్తా నన్నావు, జ్ఞాపకమున్నదా? ఇదుగో, ప్రపంచంలోకల్లా ఎర్రని రోజా! ఈ రాత్రి నువ్వు దీనిని ధరించు. మనం ఇద్దరం కలిసి నాట్యం చేసేటప్పుడు, నా ప్రేమ ఎంత అగాధమైనదో ఆ పువ్వు నీకు పాడి వినిపిస్తుంది" అన్నాడు.

కాని ఆమె కనుబొమ్మలు చిట్లించింది.

"నే నీ రాత్రికి కట్టుకునే చీరకీ, జాకెట్టుకీ ఈ పువ్వు సరిపోదనుకుంటాను. పైగా మంత్రిగారబ్బాయి నాకు చాల విలువగల ఉంగరాన్నిచ్చాడు దాంట్లో ఎర్రటి కెంపు ఉన్నది. ఎర్రపూలకంటే ఎర్ర కెంపులు ఖరీదని నీకుమాత్రం తెలియకుండా ఉంటుందా?"

"ఎంత కృతఘ్నురాలివి!" అంటూ విద్యార్థి రోజాని వీథిలోకి విసిరేశాడు. ఇంతలో ఒక జట్కాబండి దానిపైనుంచి పోయింది. ఎర్రని రేకలు చితికి, రక్తం చిమ్ముకుంటూ సైడుకాలవలో ఎగిరి పడ్డాయి.

"కృతఘ్నురాలినా? నువ్వు వట్టి పశువ్వి. ఇంతా ఏడిస్తే నువ్వెవరు? చదువుకునే విద్యార్థివి. మంత్రిగారబ్బాయి కాల్చే సిగరెట్ల ఖరీదు చెయ్యవు నీ బట్టలు" అని ఆమె చివాలున లోనికి వెళ్లిపోయింది.

"ప్రేమ ఎంత పిచ్చిది! ఎంత అర్థవిహీనం! తర్కానికి ఉన్న ఉపయోగంలో సగమైనా దానికి లేదు. ఎందుకంటే, అది దేన్నీ నిరూపించలేదు. పైగా ఎప్పుడూ జరగటానికి వీల్లేని కలలు కంటుంది ప్రేమ. ఎన్నో అబద్ధాలు చెబుతుంది. ఈ రోజుల్లో యథార్థవాదం కావాలి, కాని ప్రేమ, గీమ...అబ్బే—పనికిరాదు. నేనుపోయి తర్కం చదువుకుంటాను" అని విద్యార్థి తన గదికి పోయి ఓమూల పడివున్న పెద్ద గ్రంథరాజం తీసి చదవటం మొదలెట్టాడు.

మత్స్యమహిమ

శ్రీ చె. శ్రీ. వెంకటరామయ్య

మా పేరు విన్నంతనే మాతాలూకు దుర్గంధం మీ ముక్కుల్లో దూరినట్లు మీలో కొందరు మూతులు చిట్లించుకొంటారు. మరి కొందరు మా రుచి మీ జిహ్వలలో తాండవ మాడేటట్లు భావించి లొట్టలు కొట్టుకుంటూ నోట నీరూరించుకొంటారు. ఈ యుభయపక్షాలవారున్నూ మేము కేవలం భక్ష్యవస్తువులుగా భావించి "లోకో భిన్నరుచిః" అన్న సామెతప్రకారం మమ్మలను తినడం మంచిదా, కాదా అని మల్లగుల్లాలు పడతారే గాని యేకభావంతో మా గొప్పతనం యేమిటా అని ఆలోచింపక పోవడం హర్షణీయం కాదు. నిష్పాక్షిక దృష్టితో విమర్శిస్తే మేము మీ రనుకొనేట్లు ఆహారయోగ్యులం మాత్రమే గాక, భారతదేశచరిత్ర, ఆచార వ్యవహారాలు, సంస్కృతి మొదలగువానితో మాకు సంబంధం కద్దని మీరంతా అంగీకరింపక తప్పదు. "మత్స్యః కూర్మో వరాహశ్చ। నారసింహశ్చ వామనః, రామో రామశ్చ రామశ్చ బౌద్ధః కల్కిర్దేవచ" అన్న శ్లోకానుసారం ప్రపంచపరిణామం మానవనిర్మాణం మాద్వారనుండే జరిగింది. భారతజాతికి పునాది వేదములు. వేదోద్ధరణమునకే భగవంతుడు మత్స్యావతార మెత్తినాడు. "వేదోద్ధరణవిచారమతే, సోమక దానవసంహరణే, మీనాకారశరీర నమో" అని మావారు ప్రార్థన చేస్తూ విశాలసాగరంలో యీదులాడుతూ నేటికిన్నీ ఆదిమీనమగు నా భగవంతుని అన్వేషిస్తూంటారు. మరచిపోయిన శకుంతల మహారాజగు దుష్యంతునికి జ్ఞప్తికి వచ్చిన దెట్లు? చేతులోనుండి జారిన యుంగరం చేప మ్రింగినందువల్లనే. తర్వాతనే తపోవనంలో శకుంతలాదుష్యంతుల సమాగమం జరిగి, భరతుని రాజ్యం రావడం, యీ దేశానికి "భారత భూమి" అన్న పేరు కల్గడం. అటు తర్వాత కురువంశానికి మూకటివేరగు శంతనుని భార్య సత్యవతికి మొదటిపేరు మత్స్యగంధి; బెస్తరాజు కూతురు. వేదోద్ధరణం మత్స్యావతారముతో జరిగినట్లు, వేదముల క్రోడీకరణ కూడా మత్స్యగంధి కుమారుడగు వేదవ్యాసుని మూలంగానే జరిగింది. అటు పిమ్మట కురువంశోద్ధరణం, పాండు ధృతరాష్ట్రుల జననానికిన్నీ మత్స్యగంధిసుతుడే కారభూతు డైనాడు. తదనంతరం ద్రౌపదీస్వయంవర సందర్భంలో ధనుర్విద్యా పరీక్షకు మత్స్యయంత్రమే నిర్మింపబడినది

పంద్రెండు రాసులలో మత్స్యరాశి యొకటి. పదునెనిమిది పురాణాలలో మత్స్యపురాణ మొకటి. అంగ, వంగ, కళింగాది దేశాలలో మత్స్యదేశ మొకటి. మహిరావణ చరిత్రలో మత్స్యవల్లభుని మీకు తెలిసే వుంటుంది. మీరు యే శుభకార్యాలు చేయదలచినా 'మీన' మేషాలు లెక్కించుకోక తప్పదు. మీ కవులంతా చక్కని కన్నులున్న కాంతను "మీనలోచని" అంటారు. మీ మానినుల నేత్ర సౌందర్యానికి మేము లక్ష్యవస్తువులన్నమాట. ఇంతెందుకు, అక్షిత్రయములోని కంచి కామాక్షి, కాశి విశాలాక్షితో బాటు మధురలోని అమ్మవారు "మీనాక్షి" దేవి కదా. ఒకదేవి "మీనాక్షి" అయితే మరొక దేవత "మీనకేతను" డైనాడు. "మదనో మన్మథోమారః ప్రద్యుమ్నో మీనకేతనః" అన్న వాక్యం మీ రెరగనిది కాదు. భగవంతుడు మాలో పుట్టినందుకు నిదర్శనంగా భగవదంశమగు అనిమిషత్వం మా కింకా నిలచి యున్నది. ఇదీ మా గొప్పతనం; విశిష్టత.

ఇక మా జీవితమా? త్యాగమయం. మానవ కల్యాణానికిగాను మా దేహప్రాణాలను అర్పిస్తాము. మా ఆహారయోగ్యత మీ రెరుగనిది కాదు. సాగరాల మొదలుకొని పైడుకాలువల దాకా మాకై మీరు దేవులాడడం మే మెరుగనిది కాదు. బట్ట బయలుగ బజారునుండి తెచ్చి, గుట్టుగుట్టుగ గుడ్డమరుగున చుట్టి తెచ్చి, దాపరికంగా దావాళ్ళచే తెప్పించుకొని, ఆరచాటుగా *Cod liver oil, Scott's Emulsion* అన్న పేర్లతో వైద్యునిమీద సాకు పెట్టి మా రుచిని గ్రహించని, మా సత్తువపొందనివారు లేరని చెప్పవచ్చును.

ప్రస్తుతం ఆహారపదార్థాల అభావం మిమ్ములను పట్టి పీడిస్తూంది. ఈ కొరత తీర్చడానికి మీ ఆహారశాఖామంత్రులు తలలు వాయ తలచి దృష్టి మావైపు మరల్చుచున్నారు. *Fisheries Depart-ments* అక్కడక్కడా యేర్పాటు చేస్తున్నారు. ఆధునికపద్ధతులతో మమ్ములను పట్టి, పచనయోగ్యాలుగా మార్చేందుకు పరిశ్రమ విరివిగా సాగుతోంది. "అసలే దుర్భిణి, అందులో గర్భిణి" అన్నటు మా పరిస్థితి మరీ అధ్వాన్నమై తీరుతుం దేమో! భూగర్భంలో కలిసిపోయిన మన తాతలనాటి చరిత్ర యిప్పుడు పరిశోధకులు త్రవ్వి తీస్తున్నారు. కాని మీగర్భంలో కలిస్తే మాజాతి, పేరుప్రతిష్ఠలు నామరూపాలు లేక నశించిపోతాయేమో! అందుకనే గ్రంథస్థమైతే యేమైనా మంచిదే నని మాసోత్కర్ష కొస్త చెప్పుకోవలసివచ్చింది. ఇక పెంచితే మత్స్యపురాణమంత కావచ్చును. ఇక సెలవు.

ఈ తరహా వ్యక్తుల్ని కనిపెట్టండి

(7 వ పేజీ తరువాయి)

పొలంలో పంట విరగ పండి మిగులుండిపోతే బంధువులి కిచ్చేవారు. ముష్టివారి కిచ్చేవారు. పందులు తినేవి. విశాల ప్రపంచంలో రాజకీయాలు కల్లోలమైనాసరే, యుద్ధాలు సంభవించినా సరే రైతులు వాటితో ఏ మీ నిమిత్తం లేకుండా నిశ్చింతగా నిత్యజీవనానికి భంగం లేకుండా గడిపేవారు.

దానితో నేటి నాగరిక జీవనాన్ని పోల్చి చూడండి. అతిక్లిష్టమైన ఆర్థిక పారిశ్రామిక యంత్రాంగానికి ప్రజాకోటిలో ప్రతిఒక్కరి జీవితం ఇప్పుడు ముడిపెట్టుకుని కూచుంది. కాస్త అటుగాని ఇటుగాని కదలడానికి వీల్లేదు. కదిలిందో కంపంతా కదిలి నిప్పున పడుతుంది. లారీ డ్రైవర్లలో ఒక ముఠా మరొక ముఠాతో తగవులాడారంటేచాలు క్షణంలో నగరానికి నీళ్లు, నిప్పులు పుట్టకుండా వార్తాపత్రికలు లేకుండా పోతుంది. గనుల్లో బొగ్గు తవ్వుతోనూ ఉండాలి. పదిమంది రైల్వే ఇంజనీర్లు కలిసి కట్టుకట్టి మానేశారంటే గనల్లో బొగ్గు తవ్వినా ఉపయోగం లేదు. తవ్వకనూ తప్పదు.

ఇదికాక మళ్లీ సర్వం ఒక ద్రవ్యవిధానంపైన ఆధారపడిఉంది. జర్మనీ చీనాల్లో మాదిరిగా ఇన్ఫ్లేషన్ ఉండడానికి వీల్లేదు. దేశాన్ని ఇన్ఫ్లేషన్ నించి కాపాడాలంటే ప్రభుత్వానికీ బాంకులికీ మధ్య వ్యవహారాలు ఒక నిర్ణీతవిధానంలో నడవాలి. కార్మికుల వేతనాల ప్రమాణాలు పన్నుల విధింపు అన్నీ సక్రమంగా నిర్ణయించబడాలి. వీనిలో ఏ కాస్త బెసికినా, పాకీవాళ్ల సమ్మెలు, బస్సు డ్రైవర్ల సమ్మెలు, నీటి పంపులకు నీటిసప్లై శాఖ ఉద్యోగులసమ్మె మొదలైనవి రావడం పట్టణాల్లో క్రిక్కిరిసిఉన్న లక్షలాది జనం మురికి కలరా మశూచి వ్యాధుల మధ్య నీళ్లూ నిప్పు తిండి లేక మలమల మాడిపోవడం సంభవిస్తుంది. మొదటి ప్రపంచ యుద్ధం తరవాత యూరప్‌లోని నగరాల్లో చాలాచోట్ల ఇటువంటివి చాలాసార్లు సంభవించాయి.

వీటన్నిటికీ "పెట్టుబడిదారుల్ని" నిందించిన లాభం లేదు. ఈ పెట్టుబడిదారుల్ని తొలగించినచోట్ల కూడా ఇటువంటి పరిస్థితులు సామాన్యంగా ఉండనే ఉన్నాయి. నిత్యం తిట్లు తినే ఈ పెట్టుబడిదారీ విధానంలోనే కొన్నిచోట్ల పరిస్థితులు చక్కబడ్డాయి గాని ఇతరత్రా ఎక్కడా చక్కబడలేదు. పెట్టుబడిదార్ల పెట్టుబడి ఆధారమే లేకపోతే ఈరోజున అసలు ఆశ పూర్తిగా అంతరించిపోయేదే. వాస్తవంగా పరిస్థితులు చూస్తే ఇదే బోధపడుతుంది.

పరివర్తన చెందిన ఈనాటి ప్రపంచంలో పెట్టుబడిదారుల్ని కూడగట్టుకొని వచ్చిన సమాధానపరచడానికి వీలవుతుంది కాని కార్మికుల్తో అసాధ్యం.

బ్రిటన్‌లో గనుల్ని, రైళ్లనీ ప్రభుత్వం స్వాధీనపరుచుకున్నప్పుడు, ఆకంపెనీల వాటాదార్లకు కార్మికప్రభుత్వం స్వంత షరతుల పైన ప్రభుత్వపు బాండ్లు ఇచ్చింది. పెట్టుబడిదార్లకి అసంతృప్తి కలిగినా చెయ్యగలిగే దేమీ లేదు. గనుల్ని మూసెయ్యలేరు. రైళ్లని ఆపెయ్యలేరు.

కాని కొద్దిమంది కార్మికులు తలుచుకుంటే- అంటే గనుల్లో యంత్రాలవద్ద పనిచేసేవారుగాని, రైళ్లను నడిపేవారుగాని, ఇంజనీర్లుగాని, లారీ డ్రైవర్లుగాని, మార్కెట్‌లో మాంసపు వర్తకులుగాని, ఓడరేవుల్లో పనిచేసేవారుగాని, ఆయుధపట్టులో పనిచేసేవా రెవరైనా సరే కొద్దిమంది చాలు, వారు తలుచుకున్నట్లయితే ఒక పట్టణాన్ని, లేదా ఒక దేశాన్ని స్తంభింపచెయ్యగలరు. ఆకలితో మాడ్చివెయ్యగలరు. దేశాన్ని దమ్మిడీకి అమ్మెయ్యగలరు. కార్మిక వర్గాలవారు ఏదో బాధపడుతున్నామని అనుకుని (అదేదో వారికే తెలియాలి) అవసరవస్తువుల్ని, అవసరకార్యాల్ని సదుపాయం చెయ్యకుండా బిగపెట్టగలరని బెదిరిస్తారు. ఈ బెదిరించేది తమ యజమానులైనా కాదు. పట్టణవాసులందర్నీ బెదిరిస్తారు. తరుచు అవిఘ్నంగా యాతనలు పెడుతున్నారుకూడా. న్యూయార్కు ఓడరేవులో సమ్మెకర్లు ఓడకంపెనీ యజమానులికి ఆహారం లేకగాని సంక్రాంతి బహుమతు లందకగాని బాధపడనేలేదు. బాధలు పడినవారు యూరప్‌లో ప్రజలు (కార్మికులు కూడా).

తమకు పెద్ద శిక్ష రాదని సమ్మెదారులికి తెలుసు. ఏ దేశంకాని 50 వేలమందిని జైళ్లలో బంధించలేదు. రష్యాలో అయితే లక్షలాది జనాన్ని, రైతుల్ని ఆర్కిటిక్ ప్రాంతాలకీ, (ఉత్తరోత్తరా పరలోకానికీ) పంపగలిగారు. లక్షలాది కార్మికులచేత నిర్బంధంగా పనిచేయిస్తున్నారు. ఈ సమస్య రష్యాలో అయితే ఈ రీతిగా పరిష్కరించబడింది. దేశంలో ఆర్థిక యంత్రాంగం నడవాలా వద్దా అని మాస్కో వాదించింది. స్వచ్ఛందంగా పని చెయ్యడాని కొప్పుకోకపోతే వాళ్లుమాత్రం ఏం చెయ్యగలరు. "వర్గపోరాటాల్ని" బోధించి బోధించి అతిక్రూరంగా యుద్ధాలు చేయించిన నాయకులు తమ సిద్ధాంతాల్ని ఈ కార్మికులపైన చక్కగా ప్రయోగించారు."

ఇటీవల ఇటువంటి సమ్మెల (చెలగాటాల) బాధ ప్రజలకి మితిమీరిపోతున్నందువల్ల పై పద్ధతి అవలంబించవలసిన అవస్థ వచ్చే ప్రమాదం ఇప్పుడుంది. అంటే శాసనాలపట్ల మన్నన తగ్గి పై తరహావ్యక్తుల వాదాలు వింటున్నంతకాలం ఇంక ఈపద్ధతులు అవలంబించాలేమో తెలియడం లేదు. ప్రస్తుతం "ప్రజాస్వామ్యం," "స్వాతంత్ర్యం," "న్యాయం" అనే మాటలకి చలామణిలోఉన్న అర్థాలు చూస్తే పై తరహా వ్యక్తుల ప్రభావానికీ, సబబులేని వాదానికి శాసనాల ధిక్కరణకీ, ఇదే మూల మనిపిస్తోంది.

స్వాతంత్ర్యం అనేది కొంత దేశంకోసం త్యాగం చేస్తేగాని ప్రజల కది లభించదు. హరాస్మరణలనుంచి తప్పించుకునే "స్వాతంత్ర్యం" లభించాలంటే, రోడ్డుమీద చిత్తం వచ్చినట్లు కారు నడుపుకునే స్వాతంత్ర్యాన్ని త్యాగం చేసెయ్యాలి. తామే తీర్పుదారులై న్యాయం చేకూరాలంటే మానవులకు న్యాయం లభించదు. తామే నిర్ణేతలై అధికారం చలాయించాలంటే ప్రజలకి న్యాయం చేకూరదు.

దేశాలు పూర్తిగా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు కోరుతున్నంతవరకూ దేశాలమధ్య శాంతి లభించదు. అటువంటి దానిని "హక్కు" అనకూడదు. సంఘక్షేమానికి ప్రమాదకరమైన దౌర్జన్యవాదం అనాలి.

ప్రజాహితం, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, న్యాయం, ధర్మం, శాంతి అనే వాటిని సాధించడానికి పోరాడాలి అనే భావనా పద్ధతి ఉండేవరకూ, మనం మంచివాళ్లం, మనకంటె ధర్మవర్తనులు లేరు అని భావించి దుష్టులని భావించేవారి పైన యుద్ధం ప్రకటిస్తున్నంతకాలం, అటువంటియత్నాలు, పోరాటాలు వ్యర్థమే కాగలవు. ఈ పోరాటం యుద్ధం కాదు. అది పరిష్కరించవలసిన సమస్యలుండొంక ఏస్వాతంత్ర్యాలను త్యాగంచేస్తే అంతకుమించిన విలువగల స్వాతంత్ర్యాలు మనకు సిద్ధిస్తాయి? సంపూర్ణజాతి స్వేచ్ఛ ఇంకెంత మాత్రం సాధ్యంకాదు కాబట్టి, ఎంతవరకూ మనస్వాతంత్ర్యాన్ని త్యాగం చెయ్యాలి? ఎంతవరకూ నిలబెట్టుకుంటే జనసామాన్యానికి మేలు కలుగుతుంది?

ఇటువంటి సమస్యల్ని పరిష్కరించాలంటే ఉభయపక్షాలా చిత్తశుద్ధి ఉండాలే కాని పై తరహావ్యక్తులవల్ల, వారి ప్రేరేపణలవల్ల ఈ సమస్యలు ఎన్నటికీ పరిష్కారం కావు సరిగదా, ముప్పుకి దారి తీస్తుంది.

మద్రాసు ప్రభుత్వ బడ్జెట్

(10-వ పేజీ తరువాయి)

నచో ఈ పన్నుకు మరొట్టి యభ్యంతరము లేదని నా యుద్దేశ్యము.

ఈ విధములగు లోటు లున్నను ఇట్టి పన్నులను విధించుటకు మంత్రి గారి క్రింది కారణములను వాకొనిరి.

1. ద్రవ్యోల్బణ పరిస్థితులచే కేంద్రప్రభుత్వము రాష్ట్రప్రభుత్వమునకు తగినంత ధనమీయజాలక పోవుట.

2. ధనికులపై పన్ను విధించుటచే దేశమందుత్పత్తి తగ్గి క్లిష్టపరిస్థితు లేర్పడవచ్చు నను భయము.

3. మద్యపాననిషేధమువలన బడ్జెట్టులో కల్గిన లోటుపాటులను పూడ్చుదీయుట

కాని ప్రస్తుత ముత్పత్తి తగ్గుటకు కారణము ధనికులపై పన్నుల భార మధికమధికముగా నుంటచే కాదు. వారివద్ద పెట్టుబడికి తగిన ధనమున్నది కాని కావలసిన యంత్రములు నిపుణులు మాత్రము కరవగుటచే ఉత్పత్తి తగ్గుచున్నది. అంతేకాక ఇదివరకున్న యంత్రముల రిపేర్లకు, వానిలో పనికిరానివాటిని తీసి క్రొత్తవి వేసికొనుటకు, తగిన అవకాశములును, కావలసిన యంత్రములయొక్క విడిభాగములును లేకపోవుటచే కూడ ఉత్పత్తి తగ్గుచున్నది.

కేంద్రప్రభుత్వము, రాష్ట్రప్రభుత్వమునకు తగిన గ్రాంటుల నీయలేకపోవచ్చును. అంత మాత్రమున రాష్ట్రప్రభుత్వము ధనహీనులపై పన్నుల విధింపవలెనని యగునా? మద్యపాన నిషేధముచే లోటు కలుగవచ్చును. కాని ఆ లోటును బీదలనుండి వసూలుచేసి పూర్తిచేయవలయునా? అట్లు వారివద్దనుండి వసూలు చేసిన ధనమును వ్యయము చేయు మార్గములు మంత్రులకు వేలకొలది యగుచున్న ప్రయాణపు బత్తెములు ఖర్చులునా! లేక ధన మధిక మగుటచే ఖర్చుచేయుటకు, మోటార్లు, సినీమాలు, రేస్ పందెములు మార్గములుగా నున్న జమీందార్లకు నష్టపరిహారముక్రింద నిచ్చుటకా?

ఈ విషయములు సహృదయు లగు పాఠకులే నిర్ణయింతురు గాక!

చిట్టచివరకు మన రాష్ట్రప్రభుత్వపు బడ్జెట్టులో రెండు సూత్రములు మాత్రము కన్పించుచున్నవి. (1) తక్కువ తరగతులనుండి ధనము వసూలుచేయుట. లేనిచో ఉప్పుపై పన్ను కూడదనిన కాంగ్రెసు ప్రభుత్వము మిరపకాయలపై పన్ను మంచి దని విధించుచున్నదెందురా? లేక ఉప్పుకంటె మిరపకాయలు ప్రజలకు తక్కువ ఉపయోగకర మని యందురా? (2) అమలుపరచుటకు వీలులేనివియు కష్టసాధ్యమైనట్టివియు పన్నులను విధించుచు, శాశ్వతోపయోగకరములైన పనులపై వ్యయము తగ్గించుట, లేక అట్టివానిని వాయిదా వేయుట, 4 కోట్ల రూప్యముల లోటుకై 10 లేక 12 రకములగు పన్నులు విధించి వాటిపై వచ్చు స్వల్పమొత్తములతో ఆ లోటును పూర్తిచేయుట సుఖమా? లేక అంత ద్రవ్యము నీయగల ఒకటి లేక రెండు పన్నులను మాత్రము విధించి దానిని పూర్తిచేసికొనుట మంచిదా? అను విషయమును సహృదయులగు పాఠకులు ప్రజలే నిర్ణయింపవలసి యున్నది.

మంచి ఆదాయము వచ్చునట్లకై వ్యవసాయముపై ఆదాయముపన్ను విధింపవచ్చును. అట్టి పన్నులను విధించుటకు మన రాష్ట్రప్రభుత్వమున కనుమాన మెందులకో తెలియకున్నది.

ఏది ఎట్లున్నను ప్రభుత్వము ప్రజాసామాన్యముకొరకుగాని, వారిని పీడించుటకొరకు మాత్రము కాదు. రాష్ట్రము బాగుపడవలె నన్న అట్టివారికి సుఖకరమైన పనులు ప్రభుత్వమొనర్చు టావశ్యకము. ఈ విషయము ప్రభుత్వమును, శాసనసభాసభ్యులును గ్రహించి వర్తించుచో, రాష్ట్రము సర్వతోముఖముగ నభివృద్ధి పొందు నను నిర్వివాదాంశము.

కృష్ణా - సంగమేశ్వరం ప్రాజక్టు

శ్రీ వారణాశి వెంకటకృష్ణమూర్తి

నల్లమల కొండలకు తూర్పున గల మధ్యాంధ్ర భాగములు కర్నూలు, నెల్లూరు, గుంటూరు, కడపజిల్లాల మెరకభాగములను కంభం మార్కాపురం, దరిశిపొదిలి, కనిగిరి, కందుకూరు, ఉదయగిరి, వినుకొండ, నరసరావుపేట, సత్తెనపల్లి, గుంటూరు, పలనాడు, ఒంగోలు, బద్వేలు వగైరా ప్రదేశములకు నమ్మకమైన నీరుపారుదల వసతి కలిగించుటకు సమీపమునను, సరిహద్దునను గల కృష్ణానదియొక్క యాధారము తప్ప వేరొకటి లేకున్నది. మరియు కృష్ణానది సంగమేశ్వరముదాటినవెనుక చాలాదిగువకు పడిపోయినందునను, క్రిందిభాగములం దెచ్చటను, యేటి కిరువైపులను కొండల వరుసలు తీరియున్నందున, ప్రత్యేకము ప్రాజక్టు నిర్మాణము ద్వారా పై మెరకప్రాంతములకంతయు నీటి వసతి కలిగింప నవకాశము లేదు.

పై మెరకభాగములంతయు సముద్రమట్టమునకు 800 అడుగులకు లోపున నుండి సంగమేశ్వరంప్రదేశము 831 అడుగు లున్నందునను, కృష్ణాపెన్నారుప్రాజక్టు స్కీముప్రకారము సంగమేశ్వరంవద్ద పెద్ద జలాశయము యేర్పడుచున్నందునను, అట్టి జలాశయమునుండియే పై మెరకభాగములకు మధ్యనగల నల్లమలకొండ ప్రదేశము యాటంకము తొలగింపబడిన, కృష్ణ నీరు పారుదలకాగలదని సహజముగ యూహింపదగియున్నది. కాని వరుసలుదీరి షుమారు మూడు వేల అడుగులయెత్తునకు దట్టమగు అడవులతో నిండియున్న ముప్పయిమైళ్ళవెడల్పున గల పర్వతప్రదేశముమధ్యన అదృష్టవశమున, సంగమేశ్వరం రిజర్వాయరు ప్రదేశములకు నేరుగా తూర్పువైపున, పైచెప్పబడిన మెరకభాగముల కంటు బాటుగ పర్వతములమధ్యకు యిరువైపులను చొచ్చుకొని లోయలుగ యేర్పడియున్న కొత్తికనుమ యను చిన్న కొండభాగమున్ను, దాని కిరువైపులను రెండు పెద్దకొండ వాగులు తూర్పున తీగలేరు గుండ్లకమ్మలో కలియుచు సముద్రముచేరునదియును, పశ్చిమము వైపున కృష్ణానదితో సంగమేశ్వరము వద్దనే కలియుచున్న భవనాశియు పుట్టుచున్న లోయ ప్రదేశములు, కృష్ణానదికి పైకి నంత తగ్గుమట్టమున భవనాశి, తీగలేరు, గుండ్లకమ్మలద్వారా తూర్పు సముద్రముతో సహజముగు సంబంధము యేర్పడియుండనిచో కృష్ణనీటిపారుదల వసతి పై మెరకభాగములకు యూహింపనుకూడ సాధ్యమయ్యేడిది కాదు. కొత్తికనుమకొండభాగమునకు సహజమగు కొండప్రాంతపు మిట్టతప్ప యెట్టి కొండల యాటంకమును లేకున్నది.

నల్లమలకొండలయం దచ్చటచ్చట కొత్తికనుమవంటి కాలిరస్తావసతులు కాక, నెలుగోటికనుమ, మంత్రాలమ్మకనుమ, నందికనుమ, యెద్దడుగుకనుమవంటి బండ్లరస్తా ప్రదేశములు కలవుగాని, అతిశయమగు యెత్తున్ను, వైశాల్యమున్ను వాలున్ను కలిగి నీటిపారుదలకు యెట్టి యనుకూలావకాశములు లేనందున, కొత్తికనుమ భాగమే శరణ్యమని నిర్ణయింపబడి ఆందోళన చేయబడుచున్నది.

కొత్తికనుమకాలువ వసతినిగూర్చి యెరుక కలిగిన మాలో కొందరిచే చేయబడిన యాందోళన వెనుకటి రోజులలో అరణ్యరోదనముకాగా, కాంగ్రెసు ప్రభుత్వములు యేర్పడినతరువాత 1946 న పునః ప్రారంభింపబడిన యాందోళన శ్రద్ధాళులగు శ్రీ బత్తిన పెరుమాళ్ల నాయుడు ప్రభృతిశాసనసభ్యుల కృషి ఫలితముగా, 1948 జనవరియందు అధికారపూర్వకముగ నంద్యాల అసిస్టెంటు ఇంజనీరుగారితో కొందరు శాసనసభ్యులు కొత్తికనుమ కొండప్రాంతములు సందర్శించుటయు, సేకరింపబడిన ఇంజనీరింగు సలహాతో కొత్తికనుమ స్కీము సాధ్యముగునని నిర్ణయింపబడి ప్రభుత్వమునకు మెమోరాండము ద్వారా కొత్తికనుమ కాలువస్కీమును, కృష్ణాపెన్నారు ప్రాజక్టునందు భాగముగ చేర్పించి పరిశీలన కావించుటకు, పనిచేయించుటకు, కోరుటకు తలపెట్టబడియుండ, అతిశయించిన శ్రద్ధ కొలది, సంగమేశ్వరం ప్రాజెక్టు రైతుసంఘము యేర్పరుపబడుటయు, తద్వారా, శ్రీ కడప కోటిరెడ్డి, శ్రీ బత్తిన పెరుమాళ్ల నాయుడు ప్రభృతి శాసనసభ్యులతో 1948 సెప్టెంబరు మాసమున మదరాసుప్రభుత్వము పబ్లిక్‌వర్క్సు శాఖామాత్యులవద్దకు రాయబారము వెళ్లుటయు, కొత్తికనుమ కాలువస్కీము యెంతవరకు నిర్మాణసాధ్యమో పరిశీలించుటకు ప్రభుత్వము ఆదేశముప్రకారము మదరాసు సూపరింటెండింగు ఇంజనీరు శ్రీ తిరుమలయ్యంగారున్ను కృష్ణాపెన్నారు ప్రాజెక్టు యెక్సెక్యూటివ్ ఇంజనీరు, అసిస్టెంటు ఇంజనీర్లు, యీ 1949 జనవరిలో, కాలువస్కీము విషయమై పట్టుదలగా పనిచేయుచున్న జాంబవంతుడు శ్రీ పెరుమాళ్ల నాయుడు గారితో కొత్తికనుమకొండభాగములు యిరువైపులున్ను సందర్శించుటయు జరిగినవి.

సంగమేశ్వరం రిజర్వాయరునుండి కృష్ణనీరు కుందులోనికి చేర్చబడవలయు మిట్టకండాల సామీప్యప్రదేశమునుండి తూర్పున కొత్తికనుమ వైపునషుమారు పదిమైళ్లదూరమునగల నందిపీరన్న ప్రాంతమువరకు సమతలమై, అచటినుండి మరి పదిమైళ్లదూరమున గల కొత్తికనుమభాగమువరకు మిట్టగను, కనుమప్రదేశమునకు తూర్పు పదహేడుమైళ్లలోగల యెగువ చెర్లోపల్లివరకు తగ్గునకు, నీరు అందించవలసియున్నది. నందిపీరన్నకును, యెగువ చెర్లోపల్లికిని మధ్యన గల సుమారు యిరువదియైదుమైళ్ల కొండప్రాంతము మిట్టునందు నేరుగా, ఆధునిక పరికరములతో కాలువత్రవ్వుట ఇంజనీరింగుశాఖవారికి సాధ్యమే యైనను కొండప్రాంతములందు నూరునుండి నాల్గునూర్ల అడుగులవరకు లోతునకు కాలువ నిర్మాణముకంటెను, టన్నలింగు (రంధ్రము వేయబడుట) అనుకూల మనియు, సులభసాధ్యమనియు తెలియుచున్నందున, అనుకూలించినంతవరకు కాలువద్వారాను, అవసరమునుబట్టి కొంత టన్నలింగుచేయబడియును, అమెరికాలోని "గ్రాండ్ కౌలీ" డాంవద్ద నున్నట్లు విద్యుచ్ఛక్తిసహాయమున పంపింగుకూడ చేయించు యేర్పాటుతో, కొత్తికనుమకాలువ స్కీమును నిర్ణయింపబడవలయునని ఇంజినీర్లు కోరబడియున్నారు.

కొత్తికనుమ కాలువస్కీము యే వక్కపద్ధతిననను చేయించుట కష్టసాధ్య మనిపించగలదేమో కాని, అమెరికావంటి యితరదేశములందు సాధించబడియున్న టన్నలింగు, పంపింగు విధానములప్రకారము అసాధ్యమని త్రోసివేయుటకు వీలు లేనిదై ఇంజనీరింగుశాఖవారికి తమ శక్తి నైపుణ్యములను ప్రదర్శించుట కవకాశము కల్గించునదికూడ కాగలిగినది. ఇటీవల సంగమేశ్వరం ప్రాజెక్టు ఆనకట్ట నిర్మాణప్రదేశములను సందర్శించియున్న అమెరికన్ ఇంజనీరు శ్రీ సావేజగారితో, కృష్ణా పెన్నారు ప్రాజెక్టు ఇంజనీరింగు శాఖవారు కొత్తికనుమ కాలువ విషయమును కూడ సంప్రదించి, వారి అనుకూలమగు సలహానుబట్టి, మదరాసు ప్రభుత్వమునకు కొత్తికనుమ కాలువస్కీము సాధ్యపడగలదను యభిప్రాయముతో నివేదిక పంపియున్నట్లు తెలియుట సంతోషదాయకము. దిక్కుమాలిన లక్షలాది మధ్యాంధ్రభూమి మెరకప్రాంతముల ప్రజకు శుభవార్త.

కొత్తికనుమ కాలువ, కృష్ణా పెన్నారు స్కీముకు సంబంధించి, ముమ్ముందు అనివార్యముగ నిర్మింపబడవలసిన కృష్ణాసంగమేశ్వరం జలాశయమునకు సంబంధించినది, రాయలసీమ భాగములకే ముఖ్యముగ వుపకరింపగలది, కాని, రాయలసీమభాగములను విశేషముగ ముంచివేయగల దని భయాందోళనలు చెందుచున్న పై స్కీమునందలి రెండవదగు సోమశిలారిజర్వాయరుకు సంబంధించినది కాదని గమనించ గోరుచున్నాను.

కొత్తికనుమ కాలువ స్కీమును, కృష్ణాపెన్నారు ప్రాజక్టు స్కీమునందు భాగముగ చేర్పింపబడి, సంగమేశ్వరం రిజర్వాయరు నిర్మాణముతోబాటు పనిచేయింపబడవలయు ననియు, వెంటనే పరిశీలనాదికములు జరుపబడవలయు ననియు, యావదాంధ్రులును, రాయలసీమ వాసులును, శాసనసభాసభ్యులును శ్రద్ధ వహించి ఆందోళన చేయవలసియున్నారు.

జమీందారీ రద్దుబిల్లు

శ్రీ పేట బాపయ్య

జమీందారీ రద్దుబిల్లు అదిగో వస్తుంది; యిదిగో వస్తుం దని యెదురు చూస్తుంటే చివరకు 1938 సంవత్సరం శ్రీ ప్రకాశం చిత్తుబిల్లుతో ప్రారంభమై వకదశాబ్దం గడిపి శ్రీ కళా వెంకట్రావు రెండు సంవత్సరముల రివిన్యూ మంత్రిత్వహయాంలో అనేక మార్పులకు లోనై మదరాసు శాసన సభలో ప్యాసయింది. అయితే గవర్నరు జనరల్ గారి అంగీకారం కొరవగా యుండుట వలన సరియైన ప్రకటన జరిగి సామాన్య జమీందారీ రైతునకు దాని నిజస్వరూప మింకను సువిదితం గాలేదు. గవర్నరుజనరల్ గారి అంగీకారం బొంది బిల్లు ఎప్పటికి బయటకు వస్తుందో యిప్పటి కింకను యూహాతీతంగానే యున్నది. బిల్లుపై జమీందారీ రైతులోకంలో ప్రథమం శ్రీ ప్రకాశంచిత్తుబిల్లు ప్రకటింపబడినప్పుడున్న ఉత్సాహం లేకపోయినా నామమాత్రపు యీ జమీందారీరద్దు బిల్లు అయిన వచ్చి కనీసం శిస్తువసూళ్లు, అడవులు, చెరువులు, పోరంబోకులు వగయిరాలపై జమీందారుల చలాయించుచున్న నిరంకుశాధికారములన్న త్వరలో విముక్త మవుతవేమో నని ఆశలు గంటుంటే ఆమాత్రంకూడ దూరమై పోతున్నది. మీదు మిక్కిలి జమీందారి విధానం రద్దు అవుతుందనే వాతావరణ మేర్పడినప్పటినుండి జమీందారీరైతుల కష్టాలు లోగడ కన్న యెక్కువయిన వని చెప్పుట కేమాత్రం సందేహం లేదు. జమీందారులు దీప ముండగనే చక్కబెట్టుకొనవలయు నని యీ సంధి సమయంలో తమ తమ జిల్లాలలోని గ్రామోపయోగములగు అడవులు, బంజరులు, పుంతలు పోరంబోకులు చాల భాగం తమ తమ బంధువులపేర ఆత్మీయులపేర బెట్టి వారికి పట్టా లీయడం, కొంత కొంత ఇతరులకు స్వాధీనపరచి లోగడ తేదీలతో వారిపేర పట్టాలు పుట్టించి వారల దగ్గఱ నుంచి నజరాల రూపేణ డబ్బు గాబట్టుకోవడం చేయుచు గ్రామాలలోని రైతుల సమిష్టిసౌకర్యాల కొరకు బెత్తెడు భూమికూడ లేకుండజేయుచున్నారు. ఈ సందర్భంలో ప్రభుత్వం ప్యాసు చేసిన 1947 సంవత్సరపు "మద్రాసు రాష్ట్రము నందలి జమీందారీలలోనిసాముదాయక భూములు అడవిభూములు స్వంతకమతంలు అన్యాక్రాంతం చేయుటను నిషేధించుటకైన చట్టం" నిరుపయోగంగా పడిపోయింది. ముఖ్యంగా జమీందారి నిరంకుశత్వానికి ఆధారభూత మయిన అడవులపై పెత్తనం యిక నెంతోకాలం తమ చేతులలో యుండేది కాదు గదా యనే యుద్దేశ్యంతో కొందరు జమీందారులు వంటచెరకును, బొగ్గు కాల్చుటకు, యితరుల పేర లోగడ తారీఖులతో కంట్రాక్టుల సృష్టించి అడవులను నాశనం చేయించుచున్నారు. కొందరు అడవిరక్షణఆర్డినెన్సు పేరు చెప్పి గ్రామంలోని రైతులు తమకు కావలసిన వ్యవసాయపరికరములు, కట్టె, కంప వగయిరాలు అడవులలోనుంచి తెచ్చుకొను అనాది సిద్ధమగు ఆచారము విరోధించుచు రైతులను అనేక క్రొత్త యిక్కట్లకు గురి చేయుచున్నారు. కొందరు కొందరు జమీందారులు తమ తమ జమీలలోని అడవులపై యెట్టి కాపుదల బెట్టక తమ కేల యని యుపేక్షవహించుటచే ఎవరికి అందినట్లు వారు కొట్టుకొనిపోయి అడవులు నామరూపములు లేకుండ పోవుచున్నవి. యీ విషయములో ప్రభుత్వముకూడ సౌఖ్యం గల్గించుకొనకుండుటచే అట్టి గ్రామముల రైతుల భవిష్యత్ మరీ అంధకారబంధురమై పోతున్నది.

ఇక ప్రస్తుతం జరుగుచున్న జమీన్ గ్రామాలలోని శిస్తు వసూళ్లి తికమకలు చెప్పటానికి వీలు లేదు. బిల్లు అమలులోనికి రాలేదు గనుక శిస్తువసూలు జమీందారులే చేయవలయును. క్రిందటి సంవత్సరం కొందరు మాత్రం ప్రభుత్వ ప్రకటన ప్రకారం రూపాయకు పావలా తగ్గించి వసూలు చేసినారు. కొందఱు పూర్తిగా యిస్తే గాని వీలులేదని తమ నిరంకుశవిధాన మంతా వినియోగించి వసూలు చేసికొన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వం శిస్తుతగ్గింపు చట్టం ప్యాసు చేసింది ఆప్రకారం ప్రత్యేక ఆఫీసరులను నియమించి ఏ గ్రామాని కాగ్రామం శిస్తుతగ్గింపులు నిర్ణయించి బహిరంగ పరచింది. అయితే దాని మీద జమీందారులు అపీళ్లు రైతుల అపీళ్లు జరుగుతున్న వంటున్నారు. ఆ సంవత్సరం తగ్గింపుల ప్రకారమే శిస్తులు చెల్లించవలెనో లేక యథాప్రకారమే చెల్లించవలసే యుంటుందో ప్రభుత్వం చెప్పలేదు. తగ్గింపుప్రకారం తీసికొనుటకు యే జమీందారూ అంగీకరించటంలేదు. ప్రభుత్వం ప్రకటించిన శిస్తుతగ్గింపు అయినా ఒకరీతిగా లేదు. ఒకే గ్రామంలో ఒక చెరువుక్రింద ఒకరకం మరొక చెరువుక్రింద మరొకరకం తగ్గింపులు నిర్ణయించినారు. లోగడ జమీందారు ఒక చెరువు క్రిందనే యున్న ఒకేరకం భూమిని సేద్యంచేయు ఒక రైతుకు యక॥ రు 12-0-0లు మరొక రైతుకు యక॥ రు 8-0-0లు నిర్ణయిస్తే తన యిష్టానిష్టములనుబట్టి, యిప్పుడు ప్రభుత్వపు తగ్గింపులవలన కూడ ఆ తేడాలలాగే నిల్చి యున్నవి. యిది చాలా అన్యాయం. ముఖ్యంగా జమీందారు తన స్వంతకంతం భూములకు రైతుఅధీనం భూమికన్న యెంతోతక్కువ శిస్తును నిర్ణయించి లెక్కలలో మాపించుకున్నాడు. శిస్తుతగ్గింపుల ప్రకారం ఆ శిస్తులు యింక ఎంతపో తగ్గిపోవుచున్నవి—దీనివలన ఉత్తరత్రా ప్రభుత్వానికి యెంతయో నష్టము సంభవించుచున్నది. ఆ తగ్గింపుల ప్రకారమే శిస్తులు యిస్తామని రైతులు కూర్చుందామనుకున్నా వీలులేకుండా యున్నది. జమీందారులు ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం తగ్గింపుశిస్తులు నిర్ణయించి లెక్కలు తయారు చేయించలేదు ఆకారణంగా సామాన్య రైతుకు తన శిస్తు యెంత తగ్గినదో తెలియక తుదకు జమీందారి ఉద్యోగస్థులు అడిగినంత యివ్వక తప్పుట లేదు.

ఇక చెర్వుల విషయం చూడామా జమీన్ గ్రామాలలోని చెర్వులు చాలాభాగం చెమరమ్మతులోనేయున్నవి. లోగడ జమీందారులు ఏ కొద్దిపాటి మరమ్మతులైనా చేయించిన, యేసంవత్సరమున కా సంవత్సరం తాత్కాలికముగానే యుపయోగపడుచున్నవి. జమీందారీల రద్దు తప్పదని తెలిసినప్పటినుంచి జమీందారులు ఆ కొద్దిపాటి మరమ్మతులుకూడ మానివేసినారు. నిరుడు యీ సంవత్సరం యే జమీందారూ యే చెరువుకూ చేరెడుమట్టి వేయించిన పాపమున బోలేదు. రేపో మాపో మా పెత్తనం పోతుంటే మాయింట్లో డబ్బు యెందుకు ఖర్చుపెట్టుకుంటాం. మా కేమి సంబంధ మంటున్నారు జమీందారులు. ప్రభుత్వానికి మొరబెట్టుకుందామా, దీనికి చాల తతంగముగమున్నది. కలక్టరు గారు ముందు ఫలానా చెర్వుకు మరమ్మతు లవసరమా, లేదా ? అవసరమైతే ఎంత అవసరము వగయిరాలు విచారణ చెయించవలయును. తరువాత జమీందారుకు మరమ్మతు చేయించమని నోటీసు యివ్వవలయును. ఆ నోటీసుపై జమీందారు తన అనంగీకారం తెలిపితే అప్పుడు యస్టిమేట్లు తయారుచేయించి అయిదువేల రూపాయలకు లోపు మరమ్మతు అయితే తాను చేయించవచ్చును. అంతకు పైన అయినచో రివిన్యూబోర్డు శాంక్షన్ కోవలయును. యీ వ్యవహారకాండ యావత్తు పూర్తి అయ్యేవరకు ఆ సంవత్సరం కాలం మించిపోతుంది. తొలకరి ప్రవేశిస్తుంది.

కవి, గాయకుడు,
శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులు

శ్రీ పి. వి. రాజమన్నారు

[తిరుపతి దేవస్థాన కమిటీ అధ్వర్యాన ఈ నెల 2-వ తారీఖునుంచి తిరుపతిలో అన్నమాచార్య వర్ధంత్యుత్సవాలు జరిగినవి. అప్పటి శ్రీ పి. వి. రాజమన్నారుగారి అధ్యక్షోపన్యాసము నిట పొందుపరుచుచున్నాము సం॥]

"దేవస్థానం కమిటీవారు ఈ యుత్సవమును నిర్వహించుటలో ఇంకొక విశేషము కలదు. పూర్వమున మన విజ్ఞానమును రక్షించి, పోషించిన సంస్థలు రెండు. రాజాస్థానములు, దేవస్థానములు. సర్వం కృష్ణార్పణమస్తు అనే భావం జీవితమూలసూత్రంగా గ్రహించిన మనవారికి సంగీతసాహిత్యాదులుకూడా భగవత్పరంగా పరిణమించడం ఆశ్చర్యాస్పదం కాదు. అందుచే దేవాలయములు కళాలయములుగా వర్ధిల్లినవి. ప్రతి దివ్యక్షేత్రము కళాక్షేత్రమై భాసిల్లినది. మధుర, కాంచీపురి, తంజనగరము ఇత్యాది పుణ్యస్థలములు విజ్ఞానపీఠములుగా వికసించినవి. దేవస్థానములు లలితకళ లన్నింటికి కేంద్రము లైనవి. శిల్పము, చిత్రరచన, కవిత్వము, సంగీతము, నాట్యము అన్నింటికిని ఆధారభూతము లైనవి. ప్రజల ఆధ్యాత్మిక పిపాసనే గాక, సౌందర్య పిపాసనుకూడా తీర్చడానికి ఏర్పడినవి దేవాలయములు. ఈ విషయం నేను గత సంవత్సరం శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయ వార్షికోత్సవమునాడు సూచించితిని. దేవస్థానం కమిటీవారు కళాపోషణకు తగిన ఏర్పాట్లు చెయ్యవలెనని మనవి చేసికొంటిని. ఆనాడు వేదికపై నాతో శ్రీ వెంకటస్వామి నాయుడుగారు ఉండిరి. అప్పుడు వారు కేవలం ఒక సభ్యులుగా నుండిరి. ఈనాడు మన భాగ్యవశమున కమిటీ ప్రెసిడెంటుగా నున్నారు. ఆయన నాకు బాల్యమిత్రుడు. కనుక నిస్సంశయముగా చెప్పగలను. అతని భక్తి తత్పరత విశేషమైనది అకలంకజీవుడు. నిరాడంబర మూర్తియే గాని నిర్విణ్ణుడు గాడు. మన విజ్ఞానమీద సంస్కృతిమీద అభిరుచి, విశ్వాసం, మర్యాద గల వ్యక్తి. అతని యాజమాన్యమున కమిటీవారు అనేక మహత్కార్యములు చేయగల రనే ఆశ, నమ్మకం నాకు ఉన్నది.

ఒకప్పుడు మన శిల్పనిపుణత్వము, చిత్రరచనా సామర్థ్యము, నాట్యకౌశలము, సంగీతప్రతిభ, సాహిత్యపరిణామము అసమానములై ఉండినవి. అందులకు తార్కాణములు ఎన్నియో ఉన్నవి. ఈనాటికిని శిథిలమై, జీర్ణమైపోయిన మన కళలను ఉద్ధరించి, మన సంస్కృతిని పునఃప్రతిష్ఠ చేసి, పోషించి, ప్రోత్సహించి, సన్మానించి, ఆదరించే బాధ్యత దేవస్థానాధికారులపై నున్నది. ఒక్క ప్రాచ్యపరిశోధనశాల సరిపోదు. సంగీత కళాశాలను, శిల్పకళాశాలను నిర్మించుటకు ప్రయత్నములు సల్పిన బాగుండును. ఇప్పటికిని మన దేశంలో ప్రవీణులైన శిల్పులు ఉన్నారుగాని తగిన ప్రోత్సాహము, ఆదరము లేక వారి సంఖ్య సన్నగిల్లుతూ ఉన్నది. పూర్తిగ సంప్రదాయము నశించిన వెనుక చింతిస్తే ప్రయోజనములేదు.

తత్క్షణమే ఒక మ్యూజియం చిత్రశాలతో సహా స్థాపించవలె నని నా మనవి. పల్లవపాండ్య చోళ విజయనగరాది శిల్ప వైభవమును ప్రకటించే ప్రతిమలు, స్తంభములు, చిత్రములు, ఆభరణములు, నాణెములు ఈ ప్రాంతమున చెదరి ఉన్నవి. అవి నశించక పూర్వమే వాటిని సేకరించి రక్షించుట మన కర్తవ్యము. వీటిని ప్రదర్శించుటకు ఒక భవనము, ఒక భాండాగారము ఆవశ్యకము.

నా కోరికలు పెరుగుచున్నవి. ఇక ఈ ప్రస్తావము చాలించి నేటి ఉత్సవ నాయకుడైన అన్నమాచార్యులవారిని గురించి నాలుగు మాట లాడి ముగించెదను.

శ్రీ అన్నమాచార్యుడు ఇప్పటికి అయిదు వందలేండ్లకు పూర్వమే జీవించిన మహాపురుషుడు. అతని జీవితమునకు సంబంధించిన చరిత్రాంశములను విపులముగా చెప్పుటకు తగినవాడను నేను కాను. ఆ కార్యము నిర్వహించుటకు అర్హులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారే. శాస్త్రిగారి పాండిత్యము, రసికత్వము, భక్తి మీకు తెలియనిది కాదు. వారు ఆంధ్రభాష కొనర్చిన సేవ అత్యద్భుతమైనది. ఆంధ్రలోకం తరపున వారికి ఈ మహాసభలో నా జోహారు లర్పించుచున్నాను. వారికి శ్రీ వేంకటేశ్వరుడు ఆయురారోగ్యము లిచ్చి ఇంకా భాషాసేవ అనేక సంవత్సరములు చేసే అవకాశం అనుగ్రహించు గాక!

అన్నమాచార్యుడు పరమభక్తశిఖామణి, మహాపండితుడు, ఉభయభాషావేత్త, రసికాగ్రగణ్యుడు

"సంగీత మపి సాహిత్యం
సరస్వత్యాః స్తనద్వయమ్,
ఏక మాపాతమధుర
మన్యదాలోచనామృతమ్॥

అని ఆర్యవచనం. సరస్వతీదేవికి అల్లారు ముద్దుకొడుకైన అన్నమాచార్యుడు తల్లి రెండు చన్నులపాలను గ్రోలిన భాగ్యవంతుడు. అందుచేతనే సంగీత సాహిత్యములు రెండింటను శ్రీ ఔన్నత్యము సంపాదించి ఆ రెండును వెంకటేశ్వరునకు ధారపోసి ధన్యుడైనాడు.

ఈ మహనీయుడు ఆంధ్ర, సంస్కృత భాషలలో అనేక గ్రంథములు రచించెను. అందనేకములు నామమాత్రావశిష్టములు. తెలుగులో పంద్రెండు శతకములు నానా ప్రబంధములు రచించెనట. సంస్కృతమున శ్రీ వేంకటాచల మాహాత్మ్యము, సంకీర్తనలక్షణము వ్రాసినట్లు తెలియుచున్నది. అయినను ఆయనకీర్తికి ముఖ్యాధారము ఆయన చెప్పిన సంకీర్తన సంచయమే. సంకీర్తనాచార్యు డని, పదకవితాపితామహు డని హరికీర్తనాచార్యు డని అతని బిరుదులు. ఆధ్యాత్మికశృంగారమార్గములలో పెక్కువేల సంకీర్తనములు చేసినాడు. ఆంధ్ర ద్రవిడ కర్ణాటక భాషలలో సంకీర్తనపద్ధతి కితడు సృష్టికర్తగా కనబడుచున్నాడు. వాగ్గేయకారున కుండవలసిన లక్షణములన్నియు నితనికి గలవు. ఛందోవ్యాకరణాది శాస్త్రజ్ఞానము, సంగీత శాస్త్ర పాండిత్యము, ప్రతిభ, ఉచితజ్ఞత, చిత్తార్ద్రత—అన్నీ మూర్తీభవించిన వితనియందు.

సంకీర్తనము లంటే చులకనగా చూచుట కొందరి మతము. నాయభిప్రాయమున అది పొరబాటు. సంకుచితదృష్టియే దానికి కారణము. సంకీర్తనములు, పదములు, గేయములు ఉత్తమ సాహిత్యానికి చేరినవే నిస్సందేహముగ. కీర్తనలో ఉన్న ఏకాగ్రత ఇతర కావ్యరూపములలో లభించదు. అందుచేతనే కీర్తన అత్యంతానందదాయకము. సంకీర్తనములో సంగీత సాహిత్యములు మిళితమై యుండుటచే ఆకర్షణశక్తి హెచ్చు. కీర్తన హృదయతంత్రులను స్పందింపజేయునట్లు పద్యగద్యాదులు చేయనేరవు.

"నాహం వసామి వైకుంఠే
న యోగిహృదయే రవౌ,
మద్భక్తా యత్ర గాయంతి
తత్ర తిష్ఠామి నారద."

అనే శ్లోకంలో సంకీర్తనకు మనపూర్వులు ఒసగిన ప్రాధాన్యం విదిత మగుచున్నది.

అన్నమయ్యకీర్తనలు భక్తిపూరితము లైనను అన్ని రసములతో చిప్పిలుతూ ఉంటవి. శృంగారము ప్రధానరసము గాన ఎక్కువ పోషించినాడు. సంభోగ, విప్రలంభములు రెంటను రస ప్రకరణములో వివరింపబడిన అన్ని యవస్థలను వర్ణించినాడు. శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధన శాఖవారు ప్రకటించిన శృంగార కీర్తనలు శ్రద్ధతో పరిశీలించిన అంకార శాస్త్రములలోని లక్షణములకు మంచి లక్ష్యములు లెక్కలేనివి దొరుకును.

భాషనుగురించి ఒక్క మాట. అన్నమాచార్యుడు తన సంకీర్తనములలో పెక్కుచోట్ల వాడుక భాషనే ఉపయోగించినాడు. గ్రాంథిక భాష వ్రాయలేక కాదు. వాడుకభాషలో ఉన్న జీవనమే దానికి కారణము. గ్రామ్యం అన్న అక్షేపణకు సమాధానం ఆయనమనుమడు చిన తిరుమలయ్యపద్యంలో ఉన్నది. శాస్త్రిగారు పీఠికలో పొందుపరచినారు.

"జగతి గడు జెల్లుటలై
నగినగి భాషించునట్టి నానుడి పలుకుల్
తగ దన రహి చెడు బువ్వల
సొగసుడుగక బిసికి కంపుసూపిన భంగిన్."

అన్నమాచార్యుని కీర్తనలు తిరుమలాచార్యుడు వర్ణించినట్లు—

"చక్కనై చవి చూపీ జాతై తావి చల్లీ
నక్కజపు మాతు వజ్రాలై మెఱసీని!
నిక్కుటద్దములై నా నిలువు నీడలు చూపీ
నక్కర తాళ్లపాక అన్నమయ్యపదములు॥
నెట్టన వేదాంతములై నిత్యములై పొడచూపీ
పుట్టుతోనె గురువులై బోధించీ!
గట్టివరా లిచ్చే శ్రీ వేంకటనాథుని మెప్పించీ
నట్టె తాళ్లపాక అన్నమయ్యపదములు॥"

ఈ సంకీర్తనములు ఆ రోజుల్లో ఉత్సవ కాలములలోనే గాక అను దినమును స్వామిసన్నిధిని పాడుచుండిరి. కాని ఇప్పుడా సంప్రదాయము నశించిపోయినది. ఈ సంకీర్తనములు మరల ఒక్క తిరుపతిలోనే గాక ప్రతి విష్ణుదేవాలయములోను పాడునట్లు ప్రయత్నము సల్పవలెను. అంతేకాక గానసభలలోకూడా సంకీర్తనము చేయునట్లు గాయకవర్యులను ప్రోత్సహించుట అవశ్యకర్తవ్యము. ఇట్టి యుత్సవము ప్రతిసంవత్సరమును జరుపవలె నని కమిటీవారికి నా ప్రార్థన.

గ్రంథ స్వీకారము :

కళా జీవి

(పూర్వఖండము) బెళ్లూరి శ్రీనివాసమూర్తి, మాస్టర్సు ముద్రాశాలాముద్రితము. ఉచితము.

జై హింద్

(నాటకము) ఎరగుడిపాటి రామయోగి. ప్రకాశకులు, త్రివేణీ పబ్లిషర్సు మచిలీపట్టణం వెల 0-12-0.

అంతతో ఆ సంవత్సరమునకు ఆ పని ఆగిపోతుంది. రైతులస్థితి యథాప్రకారం నిరాశాపూరితంగా నిల్చిపోతుంది.

ఈ సంవత్సరం మన రాష్ట్రంలో 7 లక్షల టన్నుల ఆహారకొరత యుంటుం దని లెక్కలు చెప్పుచున్నవి. ప్రభుత్వం అధికాహారోత్పత్తికి చేయు ప్రయత్నంలో కొంత భాగం జమీందారీ గ్రామాలలోని చిన్న చిన్న చెర్వుల మరమ్మతుకు వినియోగించితే ఆహారకొరత కొంత తప్పక తగ్గుతుంది. జమీందారీ రైతుల ఆర్థిక పరిస్థితులు కొంతలో కొంత చక్కబడుతవి గాని ప్రభుత్వం దృష్టి జమీందారీగ్రామాలపై ప్రసరించేటట్లు లేదు. ఈ సంవత్సరమైనా సకాలంలో చెర్వులు మరమ్మతు చేయించి ప్రభుత్వం సహాయంచేయనిచో గత సంవత్సరం పంటలు లేక దెబ్బతిన్న మెట్టతాలూకాల జమీన్ రైతుల స్థితి మరీ దుర్భర మైపోతుంది. గనుక ప్రభుత్వం వెంటనే ప్రత్యేక ఆఫీసరులద్వారా అన్ని జమీన్ గ్రామాలలోని (ముఖ్యంగా మెట్టుతాలూకాలకు సంబంధించిన, చెర్వులన్నిటిని తనిఖీ చేయించి, యేయే చెర్వులకు ఎంతెంత మరమ్మతు లవసరమో యస్టిమేట్లు కూడ వెంటనే పూర్తి చేయించి అత్యవసర పనులక్రింద చేర్చి మరమ్మతులు చేయించితే యీ సంవత్సరమయిన జమీందారీ రైతులు తమ కష్టార్జితమనుభవించినవా రవుతారు. రాష్ట్రములో రానున్న ఆహారకొరతను కూడ కొంతతగ్గించినవా రవుతారు.

నూత్న యుగంప్రారంభం

(9 పేజీ తరువాయి)

వారికి బొత్తిగా తెలియవు. ఈమార్పులు మెల్లిగా జరిగాలని నాతో కొందరన్నారు.

రాజపుత్రస్థాన మంత్రివర్గంలో రాజపుత్రులకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని ఇప్పుడు వారు ఆందోళన చేస్తున్నారు. జాగీర్దార్లు చాలామంది ఈమధ్య సమావేశమై రాజకీయవ్యవహారాల్లో తమకు సరైన భాగం ఇవ్వాలని భారతప్రభుత్వ సంస్థానాల శాఖకి విజ్ఞప్తి చేశారు.

రాజపుత్రులలో పూర్వసాంప్రదాయాలు ఇప్పుడు కొన్ని కనిపించకపోవచ్చును. కాని వారిని రెచ్చగొట్టినట్లయితే ఇంకా స్వరక్షణనిమిత్తం ప్రాణం పోయేవరకూ పట్టుదలతో పోరాడగలరు. ఈ రీతిగా పోరాటానికి సిద్ధపడేవారు నగరాల్లో నివసించే జాగీర్దార్లు కాదు. ఎడారిప్రాంతంలో గ్రామాల్లో నివాసం ఏర్పరుచుకున్నవా రని జ్ఞప్తిలో ఉంచుకోవాలి. అప్పుడే రాజాస్తాన్‌లో జాగీర్దార్ల నాయకత్వం కింద జనం గుంపులుగుంపులుగా వెళ్లి లూటీలు హత్యలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. సంస్కరణవాదులు జాగ్రత్త వహించవలసిన అవసరం ఉంది.

స్వక్రమ పరిణామం

అన్యప్రాంతాల్లో మాయమైన పూర్వసంప్రదాయాలు, ఉన్నత ప్రకృతి తిరిగి అలవరచాలంటే రాజపుత్రస్థానమే సుక్షేత్రమని చెప్పాలి. రాజపుత్రులలో మహోదాత్తగుణాల్నీ, అద్వితీయ శౌర్యసాహసాల్నీ పురికొల్పిన భావపుంజాన్ని అనాలోచితంగా మట్టుబెట్టాలని యత్నించినా, తొందరపడి పెద్దపెద్ద మార్పులు తేవాలి యత్నించినా తప్పకుండా ముప్పుంది. గతానికి నూతనవ్యవస్థ కేవలం విరుద్ధంగా ఉండ దనే అనకోవాలి. యావద్భారతదేశాన్ని విచలితం చేసి లోకఖ్యాతిని ఆర్జించిన సభ్యత, కళాసాహిత్యాలకు రాజపుత్రస్థానం జన్మస్థానం అనే మాటను అందరూ మరిచిపోయినా రని అనుమానంగా ఉంది. శతాబ్దాలనుంచి సాంప్రదాయసిద్ధంగా వస్తున్న ఆచారాలు రాజపుత్రస్థాన్ ప్రజల్లో గాఢంగా నాటుకుని ఉన్నాయి. ఆ రాజపుత్ర సాంప్రదాయాలే శిల్పానికీ, చిత్రలేఖనం, గానకళ, కవనం, యుద్ధగేయాలలో నిబిడంగా 'ఉన్నాయి. పురుషులతోపాటు స్త్రీలు సాహసకృత్యాలు చేసిన వీరగాథల్లో ఈ సాంప్రదాయం నిబిడంగా ఉన్నది.

రాజపుత్రులు కాని వారు ప్రబలంగా ఉండగల నూతన రాజపుత్రస్థానంలో ఈ అమూల్య సంపదని సమిష్టి వారసత్వంగా మన్నిస్తారా, లేక పూర్వరాజుల కాలంనాటి క్షుద్రవిషయంగా పరిగణిస్తారా అని తెలుసుకోవడం న్యాయం. ఈ విషయంలో జాగ్రత్త వహించి సబబుగా వర్తించకపోతే భారతదేశం పట్ల అకుంఠిత భక్తివిశ్వాసాలు గల ఈ రాజపుత్రజాతిఆత్మ గౌరవాన్ని భంగపరిచినట్లు అవుతుంది.


రాజపుత్రస్థానంలో ప్రతిచోటు, ప్రతి రహదారిమలుపు, ప్రతిగుట్టచారిత్రక వృత్తాంతాలు చెప్పగలవు. రాజపుత్రరాజుల కోటలపై ఇప్పటికీ ఫిరంగులు — తుప్పుపట్టినవైనప్పటికీ — ఉన్నాయి. దేశస్వాతంత్ర్యంకోసం రాజపుత్రవీరులు అక్కడ నిలిచి ప్రాణా లొడ్డిపోరాడిన

మాట మరచిపోవద్దని అవి చెప్తున్నాయి. రాజపుత్రులు పూర్వ కాలపు స్వయంవర గాథల్ని కూడా మరచిపోలేదు.

పూర్వకాలంలో రాజపుత్రులకు ప్రాణపదమైనవి మూడే! తన శూలం, తన గుర్రం, తన స్త్రీలమానం. ఈనాడు ఆ శూలం గుర్రం నిరుపయోగమైనాయి. స్త్రీలు పరదామరుగున ఉన్నారు. కాని పూర్వౌన్నత్యపు స్మృతి రవంతైనా చెరిగిపోలేదు. ఆ గర్వస్మృతిని సుస్థిరం చెయ్యాలి. రాజపుత్రస్థాన చరిత్రను ఆమూలంగా కల్నల్ టాడ్ రచించాడు. ఇంక పరిశోధించవలసింది లేదు. ఇంక వ్రాయవలసింది మిగలలేదు. రాజపుత్రులు స్వీయచరిత్రను రచించడానికి ఎన్నడూ యత్నించకపోవడం వింతైన విషయమే. వారు చరిత్ర నిర్మాతలే కాని చరిత్ర రచయితలు కారు. అయినా రాజపుత్రసంస్థానాల్లో గ్రంథాలయాలు, పురాతన పత్రగ్రంథాలయాలు, చిత్రవస్తు ప్రదర్శనశాలలు విరివిగా ఉన్నాయి చరిత్రకారుల కింకా కావలసినంత సామగ్రి ఉంది.

నూతనవ్యవస్థ ప్రజలకు ప్రయోజనకారి కాగలదో లేదో ప్రజలని బట్టే ఉంటుంది. వారు కాలానుగుణంగా మారగలిగాలి, ఏ దేని మిది శతాబ్దాలు వరిల్లిన వ్యవస్థకే వలంమాయకు కావనీ, దాని ఆధారంపైనే కొత్తవ్యవస్థను నిర్మించుకోవాలనీ ప్రజలు గ్రహిస్తేగాని వారికి పరిస్థితులు సుఖప్రదం కాలేవు. పరిపాలనా విధానంలో మార్పులకు ప్రజలు అలవడాలి. ఏ ప్రాంతాని కా ప్రాంతం విడివిడిగా పరిపాలించబడే పద్ధతి మారుతుంది.

జైసాల్మర్ సంస్థానం 16 వేల చ॥ మైళ్లు వైశాల్యం ఉన్నప్పటికీ • లక్షమంది కంటె జనాభా లేదన్న విషయం, బహుశా, అన్యప్రాంతాలవారిలో చాలామందికి తెలియకపోవచ్చును. జైసాల్మర్‌కి అన్యప్రాంతాలకీ సంబంధమే తక్కువ. ఒక్క సన్ననిమార్గం మాత్రం సంస్థానాన్ని దేశంతో కలుపుతుంది. సంస్థానం అంతటిలోనూ ఒక్కటే చిన్న ఆస్పత్రి, ఒక్కటే స్కూలు ఉన్నాయి. రైలు మార్గం లేదు. నూతులు 300 అడుగులలో తుంటాయి. నీటికోసం ప్రజ లెప్పుడూ తహతహలాడుతుంటారు. ఈ ఎడారిలో ఉన్న పట్టున రాష్ట్రపరిపాలనావిధానం ఎల్లా అమలు జరపగలుగుతారో బోధపడదు. జోధ్‌పూర్, జయపూర్, బికనీర్‌లలో కూడా చాలా ప్రాంతం ఇదే రీతిగా ఉంటుంది. ఇక్కడ వయోజన వోటింగు విధానం అమలు జరపడంకూడా సమస్యే. రాజపుత్రస్థానం పూర్వలక్షణా లన్నిటినీ త్యజించవచ్చును. కొత్తలక్షణాలు అలవరచుకోవడం కష్టం.



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

౨౧

అన్నమయ్యగారి రచన: (సంపు ౨; ప.౧౮౫)

నాటరాగం - ఆదితాళం

[పల్లవి]

(౧) సా స సా సరి। సనిధనిసా,,
లం కె లా డు లే లా భ ము

(౨) సా సనిస పమరి। సరిసనిధా నిసా,,
లం కె లా డు లే లా భ ము

(౩) రిస స నిసగమపధపమగా। మగమపమపపమ రీ,, సరిసని
లం కె లా డు లే లా భ ము ఈ

(౪) ధస స నిసగమపధపమగమ। పధపసా, స సనిపమరిరిసని
లం కె లా డు లే లా భ ము ఈ

(౫) ధనిధససా సారి సరి। సామగమాపమ రీ నిసగమ
లం కె లా డు లే లా భ ము ఈ

(౧) పా మమ మగ మగ మగ మగ। గమపని పమాగ మగపమగరిస
కిం కి రు ల ను న ల గ డి కం కె ను

(౨) నిపామ గమ గమపని। గమపనినిస సనిపమ
కిం కి రు ల ను న ల గ డి కం కె ను
రిస సా సరి సరిసని ధా నీ సా,,
లం కె లా డు లే లా భ ము

[చరణం]

, పపపపా పమ। గమ పమ మా మమ
జం పు లం జం ప క న ర గు న బా సె డి

, సమమ మగపమ రి। సరిస మ మా,,
లం ప ట మే పో లా భ ము

, గమ పధపా నిసా। నిసరిస సనినీ సస
కం ప మో పు తో గ న లి శ రి ర పు

, స స నీ నిపని। స-నిప ను గమపమ రరి (లంకె)
కొం ప లో న వే గు ట కం కె ను

ఇట్లే తక్కిన చరణాలు:

(౨) ఈవల నావల - నేచెడి యాసల
లావు దిగుబెపో - లాభము;
ఏవగింతలకు - నిరవగు నరకపు
గోవల బడి మును - గుటకం కెను. (లంకె)

(౩) తివిరి వెంకటా - ధిపుదాసుల కృప
లవలేశమె పో - లాభము;
నవ్వులని నోరికి - సకలము దినితిని
భవకూపంబుల - బడుకం కెను. (లంకె)

లఘుటీక: లంకెలు=తగులములు; కింకిరులు=రోతలు; జంపులు=ఆలస్యములు; లంపటము=ఆపద, రోగము; కంపమోపుతోగనలి=ముండ్లమోతలవంటి సంసారకష్టములకు వేసరుకొని; నరకపుకోవలు=నరకపరంపరలు; రోగము లనియైనా కావచ్చును.

ముద్రిత పాఠాలు: కింకరులను; బాసేటి; వెంచేటి; కొలువులం బడి; బడుటకం కెను.

లేఖలు



పొన్నేరితాలూకాలో ప్రజల భీతి

అయ్యా,

పోలీసుశాఖలో కొన్ని వ్యవహారములు ప్రజలను కలవరపెట్టుచున్న వని ప్రభుత్వమునకు ప్రజాప్రతినిధులకు తెలుపుకొనదలంచితిని. లంచగొండితనం, అవినీతి, అన్యాయములను నిర్మూలించవలయు నని నాయకు లందఱు ఆశించుచున్నారు. కార్యనిర్వహణయందు నాయకులే కాక ప్రజలును తమ బాధ్యతల నెఱింగి నడచుకొన ప్రయత్నించుట దేశాభ్యుదయమునకు సహాయకారి కాగలదు. కనుక ఇట్టి విషయములలో ప్రజలు తమకు కలిగిన అన్యాయము తా మెఱిగిన అవినీతి, లంచగొండితనము ప్రభుత్వమునకు తెలుపుకొనుట సమంజసమే యని తలంచెదము. ప్రభుత్వము ఇట్టి కేసుల విచారణకు సదరు శాఖాధికారులకు అవకాశము నిచ్చుచున్నది.

ఇట్టి - పరిస్థితులలో తమ క్రింది ఉద్యోగుల మాన మర్యాదలను కించపఱచుటకు అధికారులు ఏ విధమునను సమ్మతించరు. ఏలనగా తమ క్రింది ఉద్యోగుల చర్యలను తా మేమియు గమనించినట్లు లేదని ప్రభుత్వము తలచు నను భయము వారికి కలుగుట సహజమే కదా!

కనుక ఈ పరిస్థితులలో ప్రజలు తెలుపుకొన్న నిజపరిస్థితులను ఏవిధముగ నైన మభ్యపెట్టి వారిమీదనే నేరారోపణలు చేయ అధికారులు ప్రయత్నించుచున్నారు.

ఇట్టి స్థితి మా పొన్నేరి తాలూకాలో కొన్ని యెడల సంభవించుటచేత ఇచటి ప్రజలు ప్రభుత్వచర్యలను నిరసించుచున్నా రను ప్రజాభిప్రాయమైన ఈవిషయము ప్రభుత్వమునకు తెలుపుకొన దలంచితిని. ఇట్టి వ్యవహారములను ఆయా ప్రాంత ప్రజలు యథేచ్ఛగా ప్రభుత్వమునకు తెలుపుకొనుటకు తగిన రక్షణ యొసంగి అనధికారులచే యథార్థ విషయములను విచారింపచేసి, ప్రజల భీతిని పోగొట్టగల రనియు తద్వార లంచగొండితనం, అవినీతి అన్యాయముల నిర్మూలింతు రనియు ప్రభుత్వమును, ప్రజానాయకులను కోరుచున్నాను.

యం. మునిరామయ్య.

"బస్సులలోనికి ప్రవేశ మెట్లా?"

అయ్యా, ప్రతి బస్సుస్టాండువద్ద గుంటూరు మొదలగు ప్రదేశములలో బలము కలిగి త్రోసుకొని లోపలికి వెళ్లగల వారలకే బస్సుయందు ప్రవేశము చిక్కును. నిలబడవలసిన చోటు తప్పి బస్సులను ఆపుట, జనము అక్కడికి పరుగెత్తుకొని వెళ్ళుట, కొట్టుకొనుట, ఆడవాళ్లకు పిల్లలకు, బలములేని పురుషులకు, బలము ఉండినను తోసుకొని వెళ్లుటకు ఇష్టము లేని మర్యాదగల వారికి బస్సుస్టాండులవద్ద ప్రవేశము కలుగుట లేదు.

కండక్టరు మర్యాద తప్పి అధికారముతో అసభ్యముగా ప్రవర్తించుట సాధారణముగా జరుగుచున్నది. బస్సుస్టాండువద్ద డ్యూటీమీదనున్న పోలీసుకు ప్రయాణీకులకు సహాయకారిగా ఉండుట తన మొదటిపని అన్నమాట తెలియదు. ఇందలి అక్రమములు పోలీసు సబు ఇనస్పెక్టరుగారు తలచుకుంటే సులభముగా దిద్దవచ్చు. ఆయనకు మించినదిలేదు. పోలీసు బంట్రోతుయొక్క దృక్పథమును మార్చుచేయుట సులభము. కండక్టరు సరియైన నడత కలిగి ప్రయాణీకుల సౌకర్యము చూచునట్లు చేయవచ్చును. ముందుగా టిక్కెట్లు ఇచ్చి బస్సు రాగానే అక్కడ నిలబడి కండక్టరు ప్రయాణీకులను లోపలికి పోవునట్లు చేయుటయు, పోలీసుబంట్రోతూ కండెక్టరూ ప్రయాణీకులతో మర్యాదగా ప్రవర్తించునట్లు చేయుట సబుఇనస్పెక్టరు చేయలేరా?

"బస్సు ప్రయాణీకుడు."

నవారునేత పారిశ్రామికులు:

అయ్యా,

బట్టలకోటాలు (మిల్లుల) హోలుసేలు డీలర్ల ద్వారా, రిటైలు డీలర్లద్వారా గ్రామాలలో ప్రజలకు వర్తకులద్వారా సహకార సంఘాలద్వారా చేరుతున్నాయి. ఈ సరుకు విడుదలలు సహకారసంఘాలలో మాంద్యముగా వుంటూన్నది. కారణం ఏమంటే గ్రామాలలో కార్మికులు మోటు బట్టలు తప్ప నాజూకువి వాడరు. వారికి మన్నవు. అందుచేత 9. గజముల చాపులు 9½ గజముల చీరలు వుపయోగించరు. కార్మికులకు పని కివచ్చేరకాలు రావటం లేదు. యీ వుత్పత్తి విధానం మిల్లుయజమానుల చేతులలో వుండడం వల్ల ఒకే పెద్ద ఖరీదుకు సన్నని తక్కువ బట్టలు విడుదల చేస్తున్నారు.

అదే ప్రజావసర సరకులను కూడా తయారు చేయువిధానం ప్రభుత్వం బాధ్యత వహించని నాడు కలిగే యిబ్బందులలో యి దొకటి.

చేనేతసంఘాలు, వున్నాయి వారికి నెం. 60, 80, 100, 40, 20ర్ల నూళ్లుదొరుకుతున్నాయి.

యిక గ్రామాలలో ఒక కులమునకు చెందని ఒ కవర్గముగా పనిచేసిన వారు నేతపారిశ్రామికులు వున్నారు. గ్రామాలలో కొన్ని కులాల వారు ఆడవా రందరు పొలములకు వెళ్లి కూలి, నాలి చేసుకొని జీవనం చేస్తారు. కొన్ని కులాల వారు ఎంత బీద లైనప్పటికి ఆడవారు పెల్లదగ్గర నుంచి పొలముచెళ్లక వీధులలో మగవారి కంటబడక, రాత్రులయందు దంపకములు దంచి పొట్టపోసుకుంటారు. వారిలో కొందరు మంచాలకు నవ్వారు నేసి మగవారిద్వారా బజారుకు బంపి జీవిస్తూంటారు.

యిప్పుడు యీ కోటాలు వచ్చినాక 4, 5, 6 ర్ల నూలు హోలుసేలు డీలర్లు రిటైలు డీలర్లకు, రీటైలు డీలర్లు గ్రామాలలో నవ్వారు మగ్గములు వున్నవారిని పరిశీలించి టెక్సుటైలు డిపార్టుమెంటువారు శిఫార్సు చేసినవారికి కోటాలు యిస్తూ వుంటారు.

యీ నవ్వారునేతపరిశ్రమ ప॥ గో॥ జిల్లాలో నర్సాపురం, తణుకు భీమవరం తాలూకాలలో జాస్తి గలదు,

గ్రామాలలో రిటైలు డీలర్లుకు వచ్చేకోటాలు పంపకం యిదంతా సక్రమ పద్ధతిని పడుడనందున నవ్వాలు నూలు అందక పారిశ్రామికులు అనేక యిడుములు పడుచున్నారు.

యీ కోటాలకు ప్రతి నేత నేసేవారు రీటైలు డీలరు వున్న ప్రక్క పట్టణంకు పోవలెనట. అక్కడ వారు వారికి డిపార్టుమెంటు అధికార్లు యిచ్చిన జాబితాలోని వారికి యిష్టమొచ్చిన నూలు యిచ్చి మిగతాది రాలేదని యితరులకు విక్రయిస్తారట. ప్రభుత్వం పంపకంలో కూడా కిర్సనాయిలువలె నూలు ప్రతి మగ్గమునకు నెలకి యింత యివ్వవలె నని, పారిశ్రామికులకు కార్డులను యిచ్చినగాని యీ నవ్వారునేతవారికి న్యాయంగా కోటా చేరదు.

సక్రమ పద్ధతిని కోటా మగ్గాలవారికి చేరులాగున చేయవలసిన బాధ్యత ప్రభుత్వానికి గలదు.

తంగిరాల కృష్ణానందతిలక్.

1948 మద్రాసు పంచదార మిల్లు కంట్రోల్ ఆక్టులో చేర్చవలసిన సవరణలు

ఆర్యా,

ఎన్నాళ్లనుండో పంచదారమిల్లు యాక్టు గురించి అందోళనజరుగుచున్నప్పటికీ యీనాటికైనా దాని ఆవశ్యకత గుర్తించి యీబిల్లును ప్రతిపాదించినందుకు ప్రభుత్వానికి అభినందనాలు. కాని యీ బిల్లు పరిశీలించి చూడగా యీ బిల్లు కేవలం ప్రభుత్వానికి పంచదారమిల్లులకు లైసన్సులు యివ్వడం విషయంలోను, పంచదారమిల్లులలో పనిజేసే కార్మికులకు రక్షణ యివ్వడంకొఱకు అధికారం యిస్తున్నది. కాని ఆ పంచదారమిల్లుకు మూలాధారమైన చెఱకు రైతుకు రక్షణ విషయములో తగిన యేర్పాట్లు లేవు. చెఱకు రైతులకు ఫ్యాక్టరీ యజమానులకు తరచుగా జరుగుచున్న అల్లర్లు, తత్కారణంగా రైతు నష్టపోవడం జరగటం, యీ బిల్లును ప్రతిపాదించిన గా॥ శ్రీ మాధవమీననుగారు గమనించకపోవడం చాల శోచనీయంగా యున్నది

యీ సందర్భంలో యీ బిల్లులో కొన్ని సెక్షనులు సవరించవలసియున్నది. కొన్ని లేనివి కలపవలసి యున్నవి.

సెక్షను 8 (2) రైతు ప్రతినిధికికూడ తమ అభిప్రాయములను చెఱకు కమీషనరుగారికి తెలియజేసికొనుటకు అవకాశం యివ్వాలి.

సెక్షను 10 (1) చెఱకుధర నిర్ణయించేటప్పుడు ఆయాకమిటీలలో చెఱకు రైతుల ప్రతినిధి యుండాలి.

సెక్షను 10 (3) చెఱకు మిల్లుకు సరఫరా చేసిన వారం దినములలో ఒకేసారి ఆ యివ్వవలసిన మొత్తమును రైతు కందజేయాలి.

సెక్షను 15 (2) C - చెఱకు రైతుల ప్రతినిధులు తూనికద్ద, తూనిక కాలములలో యుండవలెను.

కొత్తగా చేర్చవలసినవి

(1) ప్రతి మిల్లుకు సంబంధించిన ప్రాంతములో చెఱకుత్పత్తిదార్ల సహకార సంఘము స్థాపించి (సంఘం లేనిచో) ఆ సహకారసంఘం ద్వారానే మిల్లుయజమానులు చెఱకు తీసికొనవలెను. ఏవిధమైనమధ్యదలారీలకు అవకాశముండరాదు. అట్టి దళారీలను కఠినముగా శిక్షించాలి.

(2) మిల్లు యజమానులు చెఱకు తీసికొనునప్పుడు ముందుగా 5 యకరములు, అంతకు తక్కువగా పండించిన రైతులవద్దనే తీసికున్న తరువాతనే 5 యకరములకుపైగా పండించిన రైతులవద్దవృద్ధిక్రమానుసారం చెఱకుతీసికొనవలెను.

(3) మిల్లుయజమానులు, చెఱకు కమీషనరు, యిన్స్పెక్టరులు, చెఱకుత్పత్తిదార్ల సహకారసంఘాన్ని, రైతుకాంగ్రెసుసంఘాలని, చెఱకుత్పత్తిరైతు సంఘాలని గుర్తించి ప్రతి ముఖ్యమైన విషయములలో ఆయా సంఘాల సలహాలు పాటించవలెను.

పై యేర్పాట్లు లేనిచో చెఱకు రైతుకు రక్షణయుండదు. కాబట్టి కమిటీసభ్యులంతా గమనించ గోరుతున్నాను.

సెలక్టుకమిటీ మనరాష్ట్రములో ముఖ్యప్రదేశములు తిరుగ నిశ్చయించిరి గాన, చెఱకుపంటకు ముఖ్యకేంద్రమగు అనకాపల్లి వచ్చి వాస్తవిక విషయములు తెలుసుకొనగోరుచున్నాను.

వి. వి. రమణ.

అధ్యక్షుడు

ఆంధ్రరాష్ట్ర చెఱకుత్పత్తిదార్ల సంఘం

అనకాపల్లి

ఉత్తరవిశాఖ - రేవుస్థలాలు

ఆర్యా,

1. ఉత్తర విశాఖపట్నంజిల్లా టెక్కలితాలూకా పూండి గ్రామం పూర్వము రేవుస్థలం. 1890 సంవత్సరములలో వర్తకస్థలం. వాడలలో సరుకు యెగుమతులు యితరదేశములకు వ్యాపారము జరుగుచుండెడిది. కస్టమ్సుఆఫీసరు, రేవు యేజంటు తదితరఆఫీసర్లు వుండేవారు. అప్పటి కస్టమ్సు ఆఫీసు బంగళా నేటివరకు వున్నది. పోర్టునుంచి సరుకు యెగుమతిఅయిన స్థలం, రేవునుంచి సముద్రముగట్టు సరిహద్దువరకు పోర్టుయిలాకాలో వుండినంతటికీ వేలంపాట లేకనే వుండేది పశ్చిముకు. కాలువ అంతటికీ బీదవారు తమతమ ఉదరపోషణకు, చేపలు పట్టి జీవించుచుండెడివారు. క్రమశః కొన్ని దినములకు వ్యాపారము గిపోయి రేవు తీసివేయబడినది. అదిమొదలు (పోర్టు) రేవునుంచి తూర్పున సముద్రముగట్టువరకు మినహాయించి పశ్చిమతట్టున వున్న కాలువ వరకు ప్రభుత్వము వేలంపాట నిర్ణయించి విశాఖపట్నం జిల్లాబోర్డువారు ప్రతిసంవత్సరం వేలంపాటలో యీ వోఢ్రులే గుత్తచేయుచుండెడివారు. అప్పటినుంచి (పోర్టు) రేవులో వ్యాపారంగల స్థలంనుంచి సముద్రముగట్టు, సరిహద్దువరకు మినహాయించకుండా ఆ కాలువ అంతటికీ డబ్బు కట్టియున్నామని నేటివరకు యితరులకు రానీయకుండా వారి అనుభవములోయుంచియున్నారు.

2. యిచట వున్న సముద్రప్రాంత గ్రామములు 1 మంచినీళ్లపేట. 2 హుకుంపేట. 3 కంపాలరాయుడుపేట. 4 నువ్వలరేవు. 5 వజ్రపుకొత్తూరు. 6 చిన్నకొత్తూరు 7 కిడిసింగి, గ్రామాదుల ప్రజలు నూటికి నూర్గురు బీదవారలేను. ధనికవర్గము లేరు. కూలీ నాలీ యే మాత్రము జరుగుటలేదు, యిచ్చట పంటలకు వీలుగాని యిసుకభూములు. యీ గ్రామములు చుట్టు వుప్పునీటి కాలువలు. పశ్చిముకు పూండి వుప్పుపర; తూర్పుకు బెంగాళాఖాత మహాసముద్రము, యీ గ్రామములు సమీపముననున్న చిన్నవుప్పునీటికాలువ ప్రవహించుచూ, ఆ నీరు సముద్రములో కలియుచున్నది. యీ గ్రామముల ప్రజలు సుమారు 10,000 వేలు గల్గి వుంటారు అందరూ బీదకుటుంబీకులేను. యే వృత్తి లేదు. యితర యే ఆదమ్యా లేదు. నూటికి నూర్గురు విద్యావిహీనులైయున్నారు. యిచట ప్రజలు బర్మాలో కార్మికవృత్తులలో కడుకష్టములనై జీవించుచుండెడివారు. బర్మాలో పనులు తొరుమారై సరి లేనందున స్వదేశములో నిలిచి బ్రతకలేక హాహాకారములతో తల్లడిల్లుచూ బ్రతుక కష్టములలో పడియున్న ప్రజలకు ప్రాణదాన మొసగిన కాంగ్రెసు గవర్నమెంటు. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వము విధియైయున్నది. యీ బీదలయెడ కనికరించి యిచ్చట గల వుప్పునీటికాలువ వేలంపాట రద్దుపరిచి ప్రజలందరికీ బ్రతుకుమార్గము చూపించుటకు రిమీషను యిచ్చి ప్రభుత్వము ఆదరించవేడుచున్నాము. అందువల్ల యెన్నో బీదకుటుంబములు బ్రతుకగలవు.

3. నువ్వలరేవు గ్రామంలో నివసించియున్న కేవుట్లు, (అనగా వోఢ్రులు) సుమారు 300 వందలు యిండ్లు గలవు. వారందరు వొక్కుమ్మడిగా స్వయంసంఘము స్థాపించుకొని ఆ వుప్పునీటికాలువ ప్రతిసంవత్సరం వేలంపాటలో గుత్త చేయుచుండెడివారు. యిప్పుడీ వేలంపాట రద్దుపరిచి ప్రజలకు రిమీషను యిచ్చినట్లు తెలియక నేటికీ వారి స్వాధీనములో వుంచుకొని యితరులకి రానీయక అదొక వోఢ్ర ప్రభుత్వము స్థాపించి ఆ కాలువ అన్నివేళలయందు ఆక్రమించుకొనియున్నారు. ఆకలిబాధకి తాళలేక యెవరైన యితరులు ఆ కాలువకి చేపలు పట్టుటకు వెళ్లినా వారిని కొట్టి నిర్బంధించి జుల్మానాలు విధించుచున్నారు. యిట్టి నిర్బంధనలు చాలా కాలమునుండి జరుగుచన్నవి. ఆ వోఢ్రులకు తప్ప యితరులు బ్రతుక వీలులేదు. యీ చుట్టుపట్లనున్న గ్రామస్థులు వారికి జడిసి భయముతో నున్నారు. బలవంతులు ధనవంతులు అయినందున గ్రామనాయుడు గాని పోలీసు టానావారుగాని, శ్రీ టెక్కలి తహసీలుదారు వారుగాని వారి కేమీ చేయజాలకున్నారు. ప్రభుత్వోద్యోగులు చిన్న ఆఫీసర్లు వచ్చినా వారికి తగు సహాయము చేయుచూ మంచి రుచికరమైన కూరలు, పెద్దచేపలు సప్లయిచేయుచు కొందరుకు, పెద్దమొత్తములు గుప్పించి పంపివేయుచున్నారని వినికిడి. వోఢ్రులు ధనవంతులగుచే వారు తలచిన కార్యములు సాగిపోవుచున్నవి. బీదవారలకు యెందునా బ్రదుకు మార్గమే లేదు. ఆంధ్రరాష్ట్రములో ఉత్కళులగు ఓఢ్రులకు తప్ప మా కేమీ బ్రతుకు లేదని మరివకసారి ప్రభుత్వమును ప్రార్థించుచున్నాము. స్వరాజ్యము వచ్చి మా కీకష్టములు తొలగగలవని నమ్మియున్న మా బీద ప్రజలనుడచూచువారు లేరు. యీమూల పడియున్న బీదకుటుంబాలుకు కాంగ్రెసు ప్రభుత్వము కనికరించి పైవ్రాసిన వుప్పు నీటి కాలువ రిమీషన్ యిచ్చి ప్రజలను కాపాడుతారని మిక్కిలి ప్రార్థించుచున్నాము.


వంకాయ చిన్నయ్యనాయుడు.




ఉగాదినాడు ఉదయం పురోహితుడు వచ్చి పంచాంగపూజ చేయును.



ఇంటింట ఉగాది ఉత్సవాలు



పూజానంతరం గంధం, కుంకుమలతో పంచాంగమును అలంకరించెదరు.



పంచాంగ శ్రవణం



వేపపువ్వులు, బెల్లం, చింతపండుతో పచ్చడి చేసెదరు.



సాయంకాలం గృహిణి యిరుగుపొరుగు మహిళలకు నారికేళఫలములు ఒసంగును.

Regd. M. No. 4479

ఆంధ్రపత్రిక

విరోధి సంవత్సరాది సంచిక

ముద్దులొలికే ముఖపత్రంతో, ఉల్లములు రంజింపజేసే రంగురంగుల చిత్రాలతో
పెద్దపెద్ద భావోద్దీపకమైన వ్యాసాలతో, చక్కని మెరుగుకాగితాలతో
అందముగా అలంకరించుకొని వెలువడింది.

వెల రూ. 2-0-0 పోస్టేజి ప్రత్యేకము 9 అ.

[illegible]

ప్రతులు మీ సమీపమునగల మా ఏజంట్లవద్ద దొరుకును.
లేదా, మాకు వ్రాసి తెప్పించుకొనండి.

ఆంధ్రపత్రిక
పోస్టు బాక్సు నం. 212, మదరాసు 1.

ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము

ప్రథమ ద్వితీయ సంపుటములు

ప్రథమ సంపుటమునందు డెమ్మీ ౮-వ ఆకృతియందు ౬౦౦ పుటలు గలవు. ఇందు 'అ' నుండి "అధ్వర్యు" వరకును గల విషయము గలదు. త్రివర్ణ పటములు ౮, ఇతరపటములు ౧౨౫, వివిధ విషయములు ౪౦౦ కలవు.

రెండవ సంపుటమునందు డెమ్మీ ౮-వ ఆకృతియందు ౬౦౦ లకు మించిన పుటలు కలవు. "అగ" మొదలుకొని "అశ్విని" వరకు గల విషయము గలదు. త్రివర్ణపటములు ౧౦. వానిలో ౨ అమరావతీ స్తూపమునకును ౨ అనాహతమునకును చెందినవియు, ౬ దేశచిత్రపటములును గలవు ఇవిగాక మరి ౫ సాదా దేశపటములు కలవు. ప్రాచీనాంధ్రుల కళాసంపదను వ్యక్తముచేయు అమరావతీస్తూపమును గురించిన గొప్ప వ్యాసమునందు అమరావతీ శిల్పమునకు సంబంధించిన ఫోటోగ్రాఫ్ బొమ్మలు రమారమి ౧౦౦ ను, వేషభూషాదుల విల్లడించు బొమ్మలు ౫౦ వరకును గలవు. మరియు అభినయమను వ్యాసమున భరతశాస్త్రమునందలి చేతులవేళ్ళహస్తములను సూచించు బొమ్మలు ౫౭ ను, 'అనాహతము' నందు షట్చక్రాదుల చిత్రములును గలవు. ఇట్లు ఆయా వ్యాసములకు చెందిన చిత్రములు మొత్తముమీద ౨౫౦కి పైగా నున్నవి. వివిధ విషయముల సంఖ్య ౪౦౦ వరకు నుండును. సంపుటము చక్కని స్వదేశీచర్మముతోడను బంగారు రేఖలతోడను సంపుటీకృతము. ప్రతిసంపుటమున ౬౦ [illegible]

ప్రతి సంపుటము వెల రూ. ౧౦,
పోస్టుఖర్చులు: రూ. ౧-౮-౦.
రైలుద్వారా దగ్గర చోట్లకు ఖర్చులు అ. ౧౨.

మేనేజరు,
ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ కార్యాలయము,
నెం. 7, తంబుశెట్టివీథి, మదరాసు.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press. 7, Thambu Chetty St., G. T. Madras.